APTEL/25/A4660

# ఆంధ్ర జనానాడు

తెలుగు దినపత్రిక

ఆంధ్ర జనానాడు
ఆంధ్రప్రదేశ్, తెలంగాణ తెలుగు రాష్ట్రాలలో జిల్లాల వారీగా, మండలాల వారిగా విలేఖర్లుగా పని చేయడానికి అనుభవం కలిగిన లేక కొత్తగా ఆసక్తి కలిగిన వారు
సంప్రదించండి
89195 17176

సంపుటి :01   సంచిక : 132   ఎడిటర్ : ఎం. ఎ. నవీన్ కుమార్   పేజీలు : 08,   వెల. 1రూ/   గురువారం-21 - మే - 2026

PUBLISHED FROM ; ANANTAPUR KURNOOL KADAPA THIRUPATHI GUNTUR PRAKASAM VISAKHAPATNAM NELLURU EAST GODHAVARI

## ఫర్టిలైజర్ డీలర్లు, గోడౌన్లపై తనిఖీలు చేపట్టండి



ఎరువులను పక్కదారి పట్టిస్తున్న వారిపై అచ్చెన్నాయుడు ఆగ్రహం

అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశం

అధికారుల నిర్లక్ష్యంపై కూడా విచారణ జరపాలన్న మంత్రి

అమరావతి : ఆంధ్రప్రదేశ్‌లో రైతులకు అందాల్సిన ఎరువులను పక్కదారి పట్టిస్తూ, ఇతర వ్యవసాయేతర పనులకు తరలించడంపై రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. రాష్ట్రంలో కృత్రిమ ఎరువుల కొరత సృష్టించి బ్లాక్ మార్కెట్‌కు తరలించే అక్రమార్కులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఈ మేరకు అక్రమ నిల్వలపై నిఘా పెట్టేందుకు వీలుగా రాష్ట్రవ్యాప్తంగా ఉన్న ఫెర్టిలైజర్ డీలర్లు, గోదాములపై ప్రత్యేక తనిఖీలు చేపట్టాలని మిగతా..2లో

## మండుతున్న ఎండలు.. రేవంత్ కీలక సూచనలు



తెలంగాణలో రోజురోజుకూ ముదురుతున్న ఎండలు

అన్ని ఆరోగ్య కేంద్రాల్లో ఓఆర్ఎస్ ప్యాకెట్లను అందుబాటులో ఉంచాలన్న సీఎం

వడదెబ్బకు గురైన వారికి తక్షణ వైద్యం అందించేలా వైద్య సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని ఆదేశం

హైదరాబాద్: తెలంగాణలో రోజురోజుకూ ముదురుతున్న ఎండల తీవ్రత, వడగాడ్పులపై ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర ప్రభుత్వ యంత్రాంగాన్ని, ప్రజలను అప్రమత్తం చేశారు. ముఖ్యంగా ఉత్తర తెలంగాణ జిల్లాల్లో మిగతా..2లో

## రోడ్డు పక్కన తాటి ముంజలను ఆస్వాదించిన
# చంద్రబాబు, భువనేశ్వరి..

- నేడు కుప్పం పర్యటనకు వెళ్లిన చంద్రబాబు, భువనేశ్వరి
- తాటి ముంజలు అమ్ముతున్న వ్యక్తుల వద్ద ఆగిన చంద్రబాబు దంపతుల వాహనం
- సాక్షాత్తు సీఎం తన వద్దకు రావడంతో ఆనందంలో మునిగిపోయిన తాటి ముంజలు అమ్ముతున్న వ్యక్తులు
- కుప్పం ప్రజల మనసుల్లాంటి స్వచ్ఛమైన తాటి ముంజలు అంటూ సీఎం ట్వీట్





ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు, ఆయన భార్య భువనేశ్వరి గ్రామీణ జీవనశైలికి, సామాన్య ప్రజలకు తాము ఎంత దగ్గరో నిరూపించే ఒక అరుదైన, ఆహ్లాదకరమైన క్షణాన్ని పంచుకున్నారు. ఈరోజు కుప్పం పర్యటనకు వెళ్తున్న క్రమంలో, రహదారి పక్కన తాటి ముంజలు అమ్ముతున్న వ్యక్తుల వద్ద సీఎం దంపతుల వాహనం ఆగింది. మిగతా..2లో

## దేశానికే ఆదర్శంగా ఆంధ్ర మోడల్
# ఎడ్యుకేషన్ తీర్చిదిద్దుతాం

- నూరుశాతం ఎన్‌రోల్‌మెంట్ పై అధికారులు దృష్టిసారించాలి
- ప్రభుత్వ పాఠశాల పిల్లలను సొంత బిడ్డల్లా భావించి పనిచేయాలి
- ప్రభుత్వ స్కూళ్లలో కనీస మౌలిక సదుపాయాల కోసం స్టార్ రేటింగ్
- డీఈవోలు, ఏపీసీలతో విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి లోకేశ్ సమావేశం



అమరావతి : "దేశానికే ఆదర్శంగా ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్ ఉండాలన్నది నా ధ్యేయం. అందుకు అనుగుణంగా విద్యావ్యవస్థను తీర్చిదిద్దేందుకు కృతనిశ్చయంతో ఉన్నాను. అంతర్జాతీయస్థాయి అత్యుత్తమ బోధనా పద్ధతులపై అధ్యయనానికి ఉపాధ్యాయులను విదేశాలకు పంపుతున్నాం. అక్కడ వారు తెలుసుకున్న మంచి బోధనాపద్ధతులను రాష్ట్రంలో అమలు చేస్తాం" అని విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. అమరావతి సచివాలయంలో రాష్ట్రవ్యాప్తంగా డీఈవోలు, ఏపీసీలతో(అడిషనల్ ప్రాజెక్ట్ కోఆర్డినేటర్స్) మంత్రి సుదీర్ఘ సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ, క్వాలిటీ మెరుగుపర్చకపోతే నష్టపోయేది పిల్లలే అన్నారు. ప్రభుత్వ విద్యావ్యవస్థ ఓపెన్ మార్కెట్ తో పోటీపడాలన్నారు. ఇందుకోసం అందరం కలిసికట్టుగా పనిచేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో వాస్తవాలు తెలుసుకునేందుకు ఈ సమావేశం ఏర్పాటు చేసినట్లు చెప్పారు. వరల్డ్ క్లాస్ బెస్ట్ మోడల్ ఆఫ్ పబ్లిక్ స్కూల్ ఎడ్యుకేషన్ తన లక్ష్యమని, ఇందుకోసం అధికారులంతా చిత్తశుద్ధితో పనిచేయాలని దిశానిర్దేశం చేశారు.

### బిడ్డల భవిష్యత్తు కేంద్రంగా నిర్ణయాలు

"ఈ సమావేశం కేవలం సమీక్ష కోసం కాదు. యాక్షన్ ప్లాన్ కోసం ఏర్పాటు చేశాం. నేను విద్యామంత్రిగా బాధ్యతలు స్వీకరించే నాటికి రాష్ట్రంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి, మిగతా..2లో

## కుట్రపూరితంగానే రైళ్లలో
# అగ్నిప్రమాదాలు

### రైల్వే శాఖ కీలక ప్రకటన

- భయాందోళనలు సృష్టించడానికి అసాంఘిక శక్తుల యత్నం
- మిథిలా ఎక్స్‌ప్రెస్ బోగీలో పెట్రోలుతో తడిపిన గుడ్డ ముక్క దొరికింది
- వారం వ్యవధిలో జరిగిన 4 ప్రమాదాలను తీవ్రంగా పరిగణిస్తున్నాం



ఢిల్లీ : ఇటీవలి రైళ్లలో జరిగిన అగ్నిప్రమాద ఘటనలపై రైల్వే శాఖ బుధవారం కీలక ప్రకటన విడుదల చేసింది. కుట్రపూరిత విద్రోహ చర్యల కారణంగానే ఆ ప్రమాదాలు జరిగాయని తెలిపింది. పలు ఘటనల్లో అసాంఘిక శక్తుల ప్రమేయం ఉందని దర్యాప్తులో తేలిందని వెల్లడించింది. మే 19న (మంగళవారం) మధ్యాహ్నం దాదాపు 3.45 గంటలకు బంగాల్‌లోని హౌరా స్టేషన్‌లో మిగతా..2లో

## సాఫ్ట్‌వేర్ కొలువు వదిలి
# అథ్లెటిక్స్ వైపు మొగ్గు

### దేశానికి పతకం తెచ్చిన తొలి క్రీడాకారిణి



- అంతర్జాతీయ అథ్లెటిక్స్‌లో రాణిస్తున్న కృష్ణా జిల్లాకు చెందిన యువతి
- వరల్డ్ యూనివర్శిటీ గేమ్స్‌లో కాంస్యం సొంతం
- లాంగ్ జంప్ విభాగంలో దేశానికి పతకం తెచ్చిన తొలి క్రీడాకారిణిగా గుర్తింపు

ఢిల్లీ : ఇంజినీరింగ్ చదువులు, కంప్యూటర్ ఉద్యోగాలు, లక్షల్లో జీతాలు. ప్రస్తుతం యువత వెళ్తున్న మార్గమిదే. కానీ ఆ యువతి

## మహనీయుల విగ్రహాల ముందు తలలు వంచడం
# పెద్ద ఫ్యాషన్‌గా మారింది

మహనీయులను స్మరించుకుంటున్నామే తప్ప, వారు నమ్మిన సిద్ధాంతాలను సరిగ్గా కాపాడుకోలేకపోతున్నామని రాహుల్ వ్యాఖ్య



ఢిల్లీ : దేశ రాజ్యాంగంపై నిరంతరాయంగా దాడులు జరుగుతున్నాయని లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఆరోపించారు. రాజ్యాంగాన్ని బలహీనపరిచే కుట్రలు సాగుతున్నాయని, దీన్ని కాపాడుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని పిలుపునిచ్చారు. ఉత్తర్‌ప్రదేశ్ రాయ్‌బరేలీలో జరిగిన బహుజన్ స్వాభిమాన్ సభలో రాహుల్ గాంధీ పాల్గొన్నారు. భారత రాజ్యాంగం అనేది కేవలం ఒక సాధారణ పత్రం కాదని, అది డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్, మహాత్మా గాంధీ సిద్ధాంతాలకు సజీవ రూపమని తెలిపారు. మహనీయులను స్మరించుకు ంటున్నామే తప్ప, వారు నమ్మిన సిద్ధాంతాలను సరిగ్గా కాపాడుకోలేక పోతున్నామని చెప్పారు. మహనీయుల విగ్రహాల ముందు తలలు వంచడం పెద్ద ఫ్యాషన్‌గా మారిందని, కానీ అదే మహనీయులు రాసిన రాజ్యాంగంపై, వారు నమ్మిన సిద్ధాంతాలపై దాడులు జరుగుతుంటే మాత్రం అందరూ మౌనంగా ఉంటున్నారని మండిపడ్డారు. రాజ్యాంగంపై ప్రధాని మోదీ రోజు దాడి చేస్తూనే ఉన్నారని ఆరోపించారు. ఉపాధి హామీ పథకాన్ని బలహీనపరచడం, దేశంలో కుల గణన చేపట్టకపోవడం ఇందులో భాగమేనన్నారు. దేశ ప్రయోజనాలను పణంగా పెట్టి అంబానీ, అదానీ వంటి పెద్ద పారిశ్రామికవేత్తల ప్రయోజనాలకే కేంద్ర ప్రభుత్వం తొలి ప్రాధాన్యం ఇస్తోందని రాహుల్ గాంధీ దుయ్యబట్టారు. "ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విదేశాలకు వెళ్లొద్దు, బంగారం కొనొద్దు, ఎలక్ట్రిక్ వాహనాలు కొనండి అని చెప్తున్నారు. మిగతా..2లో

## నేను ఎలాంటి వాడినో మా కార్యకర్తలకు తెలుసు



- కొడుకును స్వయంగా పోలీసులకు అప్పగించినట్లు వెల్లడి
- కన్న కొడుకును స్వయంగా పోలీసులకు అప్పగించిన సందర్భం ఉందా అని ప్రశ్న
- కేసీఆర్ అవినీతి సామ్రాజ్యాన్ని కూల్చింది బీజేపీయే అన్న బండి సంజయ్

హైదరాబాద్: నేను ఎలాంటి వాడినో మా కార్యకర్తలకు తెలుసని, పోక్సో కేసులో తన కుమారుడిని స్వయంగా పోలీసులకు అప్పగించానని కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ అన్నారు. కన్న కొడుకును పోలీసులకు స్వయంగా అప్పగించిన సందర్భం ఏదైనా ఉందా అని ప్రశ్నించారు. విచారణకు పూర్తిస్థాయిలో సహకరించాలనే తాను కుమారుడిని అప్పగించినట్లు చెప్పారు.

## ఐటీ రంగం విస్తరణపై
# సీఎం రేవంత్‌రెడ్డి స్పెషల్ ఫోకస్..

ఐటీ రంగాన్ని హైదరాబాద్‌కే పరిమితం కాకుండా జిల్లాలకు విస్తరించే దిశగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు.

హైదరాబాద్ వెలుపల గ్లోబల్ కెపబిలిటీ సెంటర్స్ ఏర్పాటు చేసే సంస్థలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించారు.



హైదరాబాద్, మే 20 : ఐటీ రంగాన్ని హైదరాబాద్‌కే పరిమితం కాకుండా జిల్లాలకు విస్తరించే దిశగా తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి కీలక నిర్ణయాలు తీసుకుంటున్నారు. హైదరాబాద్ వెలుపల గ్లోబల్ కెపబిలిటీ సెంటర్స్ ఏర్పాటు చేసే సంస్థలకు ప్రత్యేక ప్రోత్సాహకాలు ఇవ్వాలని నిర్ణయించారు. నిజామాబాద్‌కరీంనగర్‌వరంగల్ హైవేల వెంట జీసీసీలు, ఐటీ సంస్థలు ఏర్పాటు అయ్యేలా కార్యాచరణ రూపొందించాలని సీఎం అధికారులను ఆదేశించారు. "బియాండ్ హైదరాబాద్" ప్రాంతాల అభివృద్ధిపై ప్రత్యేక దృష్టి పెట్టాలని సూచించారు. జిల్లాల్లో ఐటీ విస్తరణ ద్వారా యువతకు స్థానికంగానే ఉపాధి అవకాశాలు కల్పించాలన్నదే తమ లక్ష్యమని పేర్కొన్నారు.

### కంపెనీలకు ఇన్సెంటివ్స్..

అదేవిధంగా డేటాసెంటర్ల ఏర్పాటుకు కంపెనీలకు మిగతా..2లో

## మరింత ఆర్థిక మద్దతు అవసరం



- ఎస్ఏఎస్‌సీఐ కింద రూ.5వేల కోట్ల ప్రత్యేక సాయం కావాలి
- విద్యా పెట్టుబడులను ఎఫ్ఆర్‌బీఎం నుంచి మినహాయించాలి
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలకు డిప్యూటీ సీఎం భట్టి వినతి

న్యూఢిల్లీ, మే 20: స్కీమ్ ఫర్ స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ కాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (ఎస్ఏఎస్‌సీఐ) కింద రాష్ట్రానికి అదనంగా రూ.5,000 కోట్ల ప్రత్యేక ఆర్థిక సహాయాన్ని మంజూరు చేయాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్‌ను కోరారు. న్యూఢిల్లీలో మంత్రి నిర్మలా సీతారామన్‌ను బుధవారం కలిసి రాష్ట్ర అభివృద్ధి, విద్యా రంగంలో చేపడుతున్న భారీ పెట్టుబడులు, మూలధన వ్యయాలు, మౌలిక వసతుల విస్తరణకు సంబంధించిన పలు కీలక అంశాలపై ఆయన చర్చించి వినతి పత్రాలు అందించారు. ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఎస్ఏఎస్‌సీఐ ద్వారా రాష్ట్రాలకు 50 ఏళ్ల వడ్డీ లేని రుణాల రూపంలో అందిస్తున్న సహకారానికి రాష్ట్రం తరఫున కృతజ్ఞతలు తెలిపారు. 2025-26 ఆర్థిక సంవత్సరంలో తెలంగాణకు ఇప్పటికే రూ.4,208 కోట్లు మంజూరైన విషయాన్ని ప్రస్తావిస్తూ రాష్ట్రంలో కొనసాగుతున్న అభివృద్ధి కార్యక్రమాలు, సంక్షేమ పథకాలకు మరింత ఆర్థిక మద్దతు అవసరమని తెలిపారు. తెలంగాణ దేశంలో నూతనంగా ఏర్పడిన రాష్ట్రాలలో మిగతా..2లో

మొదటి పేజి తరువాయి

## రోడ్డు పక్కన తాటి ముంజలను ఆస్వాదించిన చంద్రబాబు, భువనేశ్వరి..

వారు స్వయంగా కారు దిగి, వారి వద్ద తాటి ముంజలను కొనుగోలు చేయడమే కాకుండా, అక్కడే నిలబడి ఎంతో ఆప్యాయంగా తింటూ ముచ్చటించారు. ఒక రాష్ట్ర ముఖ్యమంత్రి తన వద్దకు వచ్చి సాదాసీదాగా మాట్లాడటంతో ఆ కార్మికుడు ఆనందంలో మునిగిపోయాడు. ఈ అరుదైన క్షణాన్ని చంద్రబాబు ఎక్స్ వేదికగా పంచుకుంటూ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "కల్తీ లేదు... కార్బైడ్ లేదు.. పురుగు మందుల గోల లేదు.. మా కుప్పం ప్రజల మనసుల్లాంటి స్వచ్ఛమైన, చల్లనైన తాటి ముంజలు రోడ్డు పక్కన ఆగి తింటుంటే ఎంతో హాయిగా ఉంది" అంటూ ఆయన రాసుకొచ్చారు. ఈ సందర్భంగా తాటి ముంజలు అమ్మే వ్యక్తి కుటుంబ పరిస్థితులు, వ్యాపారం, యోగక్షేమాల గురించి సీఎం దంపతులు అడిగి తెలుసుకున్నారు. సీఎం దంపతులు చూపిన ఈ నిరాడంబరత, అప్యాయతలపై స్థానికులు ప్రశంసలు కురిపించగా.. ఇందుకు సంబంధించిన ఫొటోలు, వీడియోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అవుతున్నాయి.

## ఫర్టిలైజర్ డీలర్లు, గోడౌన్లపై తనిఖీలు చేపట్టండి

వ్యవసాయ శాఖ కమిషనర్‌కు స్పష్టమైన ఉత్తర్వులు జారీ చేశారు. ఎరువుల పంపిణీలో వ్యవసాయ శాఖ అధికారుల వైపు నుంచి ఏమైనా నిర్లక్ష్యం ఉందా అనే కోణంలోనూ తక్షణమే విచారణ జరపాలని ఆయన సూచించారు. రైతులకు సాగు సమయంలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా సకాలంలో ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని, ఇందుకోసం ఇకపై ప్రతిరోజూ జిల్లాల వారీగా ఎరువుల నిల్వలపై (స్టాక్) ప్రత్యేకంగా మానిటరింగ్ చేస్తామని మంత్రి స్పష్టం చేశారు. అన్నదాతలను మోసం చేసే ఏ ఒక్క చర్యను ప్రభుత్వం ఉపేక్షించబోదని హెచ్చరించారు. ఏ డీలరైనా ఎరువులను బ్లాక్‌కు తరలించినా లేదా పక్కదారి పట్టించినా వారి లైసెన్సులను తక్షణమే రద్దు చేయడంతో పాటు, వారిపై కఠినమైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలని మంత్రి అచ్చెన్నాయుడు అధికారులను ఆజ్ఞాపించారు.

## మహనీయుల విగ్రహాల ముందు తలలు వంచడం పెద్ద ఫ్యాషన్‌గా మారింది

ఆయనే స్వయంగా వేల కోట్ల రూపాయల విలువైన విమానాల్లో విదేశీ పర్యటనలకు వెళ్తున్నారు. రాబోయే రోజుల్లో రైతులకు ఎరువులు కూడా దొరకని పరిస్థితి రానుంది. ఆర్థిక తుపాను రాబోతుంది. మీరే చూడండి. రానున్న కొద్ది నెలల్లో ద్రవ్యోల్బణం ఎక్కడికి చేరుతుందో. పెట్రోల్, డీజిల్, గ్యాస్, పప్పుధాన్యాలు, బియ్యం ధరలు ఎక్కడికి చేరుతాయో మీరే చూడండి. ఎన్నికలకు ముందు దేశంలో పెట్రోల్, గ్యాస్ కొరత ఏమీ లేదని ప్రధాని చెప్పారు. పెట్రోల్ ధరలు పెరగవన్నారు. ఈరోజు పెట్రోల్ ధరలు పెరుగుతుంటే అంబానీ మాత్రం భారతదేశం నుంచి విదేశాలకు పెట్రోల్‌ను ఎగుమతి చేస్తున్నారు. అంబానీ రష్యా నుంచి పెట్రోల్‌ను కొనుగోలు చేసి విదేశాల్లో విక్రయిస్తున్నారు. ఆ డబ్బుతోనే ప్రధానికి నిధులు సమకూరుస్తున్నారు."

రాహుల్ గాంధీ, లోక్‌సభలో ప్రతిపక్ష నేత

'అలా చేయకుండా మెలోనితో కలిసి చాక్లెట్లు తిని వీడియోలు చేశారు'

మరోవైపు ఇటలీ ప్రధాన మంత్రి జార్జియా మెలోనికి ప్రధాని మోదీ మెలోడి చాక్లెట్లు ఇవ్వడంపైనా రాహుల్ స్పందించారు. ప్రజల రక్షణ కోసం చర్యలు తీసుకోవాల్సిన ఆయన, ఇటలీ ప్రధానితో చాక్లెట్లు తిని వీడియోలు తీశారని ఎద్దేవా చేశారు. అమేఠీలో నిర్వహించిన సభలో మాట్లాడిన ఆయన ఈ మేరకు ప్రధాని మోదీపై విమర్శలు గుప్పించారు. "మనకు చమురు హర్మూజ్ జలసంధి గుండా వస్తుంది కానీ ఇప్పుడు దానిని మూసివేశారు. అయినా, ఇటీవలి అసెంబ్లీ ఎన్నికలకు ముందు చమురు, గ్యాస్, పెట్రోల్ కొరత లేదని, అంతా బాగానే ఉందని ప్రధాని నరేంద్ర మోదీ చెప్పారు. గత రెండు నెలలుగా పార్లమెంటులోనూ, ప్రసంగాల్లోనూ ఒక ఆర్థిక తుఫాను రాబోతోందని నేను నెలల తరబడి చెబుతూనే ఉన్నాను. దీని వల్ల రైతులు, కార్మికులు, యువత, సోదరీమణులు తీవ్రంగా నష్టపోబోతున్నారు. ఇలా చెబితే బీజేపీ నాయకులు నన్ను ఎగతాళి చేస్తున్నారు. ప్రజలను రక్షించడానికి, వారికి ఆర్థిక రక్షణ కవచం కోసం నరేంద్ర మోదీ గత మూడు నెలలుగా చర్యలు తీసుకోవాల్సింది. కానీ ఆయన అలా చేయలేదు. దానికి బదులుగా ఆయన ఇటలీ ప్రధానమంత్రి జార్జియా మెలోనితో కలిసి చాక్లెట్లు తిని వీడియోలు చేశారు." అని రాహుల్ గాంధీ అన్నారు.

## ఐటీ రంగం విస్తరణపై సీఎం రేవంత్‌రెడ్డి స్పెషల్ ఫోకస్..

ఇన్సెంటివ్స్ ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డి నిర్ణయించారు. హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో కొత్త డేటా సెంటర్ల ఏర్పాటుకు అనువైన ప్రదేశాలను పరిశీలించాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఫ్యూచర్ సిటీ అభివృద్ధిపై కూడా సీఎం రేవంత్ రెడ్డి ప్రత్యేకంగా సమీక్ష నిర్వహించారు. ఫ్యూచర్ సిటీలో నెట్-జీరో విధానాలు అమలు చేయాలని, ప్రపంచ స్థాయి ఏఐ సదుపాయాలతో 'ఏఐ సిటీ'ని అభివృద్ధి చేయాలని సూచించారు. అలాగే హెల్త్ సిటీ పనులను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. హెల్త్ సిటీ ప్రాజెక్టుకు కేంద్రప్రభుత్వ సహకారం కోసం చర్చలు జరపాలని సీఎం సూచించారు. కంపెనీలు భూమిపూజలకు సిద్ధంగా ఉండేలా అవసరమైన ఏర్పాట్లు చేయాలని తెలిపారు.

### 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో ప్రత్యేక ఏజెన్సీ..

యువతకు నైపుణ్యాభివృద్ధి కల్పించే దిశగా యంగ్ ఇండియా స్కిల్స్ యూనివర్సిటీతో కంపెనీలు ఎంఓయూలు చేసుకునేలా చర్యలు తీసుకోవాలని సీఎం రేవంత్‌రెడ్డి సూచించారు. భారీ పెట్టుబడులను ఆకర్షించేందుకు 'ఇన్వెస్ట్ తెలంగాణ' పేరుతో ప్రత్యేక ఏజెన్సీ ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. పెట్టుబడిదారులకు ఒకే వేదికపై అన్ని అనుమతులు అందించే విధానాన్ని తీసుకురావాలని సీఎం ఆదేశించారు. ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ పారిశ్రామిక విధానాలను అధ్యయనం చేసి తెలంగాణలో అమలు చేయాలని అధికారులకు సూచించారు. అలాగే వచ్చే మూడు నెలల్లో అన్ని ప్రభుత్వ కార్యాలయాలకు టీ-ఫైబర్ కనెక్టివిటీ కల్పించాలని ఆదేశించారు. టీ-ఫైబర్ ప్రాజెక్టుకు ఇప్పటికే రూ.54 కోట్లు విడుదలైనట్లు అధికారులు వెల్లడించారు.

## నేను ఎలాంటి వాడినో మా కార్యకర్తలకు తెలుసు

హైదరాబాద్‌లో ఆయన మీడియాతో మాట్లాడుతూ, బీజేపీలో ప్రతి ఒక్కరూ సుశిక్షితులైన కార్యకర్తలే అన్నారు. కమిట్‌మెంట్‌తో పనిచేసే పార్టీ కార్యకర్తను 'మీ చివరి కోరిక ఏమిటి' అని అడిగితే చనిపోయిన తర్వాత బీజేపీ జెండా కప్పాలని కోరుకుంటామని అన్నారు. తనను పార్టీ నుంచి బర్తరఫ్ చేయాలని ఇతర పార్టీల నాయకులు డిమాండ్ చేస్తున్నారని ఓ మీడియా ప్రతినిధి అడిగిన ప్రశ్నకు బండి సంజయ్ స్పందిస్తూ, కేసీఆర్ పార్టీకి లోక్ సభలో ఒక్క ఎంపీ కూడా లేరని అన్నారు. వారు ఫామ్ హౌస్‌లో కూర్చుని ఏదైనా చెబుతారని అన్నారు. ఆయన అవినీతి సామ్రాజ్యాన్ని కూకటివేళ్లతో కూల్చింది, ఆ కుటుంబ పాలనను అంతం చేసింది తామేనని అన్నారు. అందుకే తమపై అసత్య ఆరోపణలు చేస్తున్నారని విమర్శించారు.

## మండుతున్న ఎండలు.. రేవంత్ కీలక సూచనలు

గరిష్ఠ ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయన్న వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో సీఎం స్పందించారు. జిల్లాల్లో మారుతున్న పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, జిల్లా కలెక్టర్లకు తగిన దిశానిర్దేశం చేయాలని రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శికి ఆయన కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈ ఎండల తీవ్రతను తట్టుకునేందుకు వీలుగా ప్రజల కోసం ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల నుండి జిల్లా ఆసుపత్రుల వరకు ఓఆర్ఎస్ ప్యాకెట్లను భారీగా అందుబాటులో ఉంచాలని సీఎం సూచించారు. వేసవి దృష్ట్యా రాష్ట్రవ్యాప్తంగా తాగునీరు, విద్యుత్ సరఫరాకు ఎలాంటి అంతరాయం కలగకుండా ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని అధికారులను ఆదేశించారు. వడదెబ్బకు గురైన బాధితులకు ఆసుపత్రుల్లో తక్షణమే మెరుగైన వైద్యం అందించేలా సిబ్బంది అలర్ట్‌గా ఉండాలని ఆదేశిస్తూనే, పట్టణ ప్రాంతాల్లో ప్రజల దాహార్తిని తీర్చడానికి చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. తీవ్రమైన ఎండల కారణంగా ప్రజలు సాధ్యమైనంత వరకు మధ్యాహ్నం వేళల్లో ప్రయాణాలు చేయకుండా సురక్షితంగా ఉండాలని ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారు.

## జనగణనలో కులగణన మినహాయించాలని పిల్

### జనగణనలో కులగణన మినహాయించేలా ఆదేశాలు ఇవ్వాలని సుప్రీంకోర్టులో పిల్

### విచారణ జరిపి పిల్‌ను కొట్టివేసిన సుప్రీంకోర్టు ధర్మాసనం

ఢిల్లీ : జనాభా లెక్కల్లో కులాల వివరాల సేకరణను మినహాయించాలని కోరుతూ దాఖలైన ప్రజాహిత వ్యాజ్యాన్ని (పిల్ ) సుప్రీంకోర్టు బుధవారం కొట్టివేసింది. ఇది విధానపరమైన అంశమని అందువల్ల జోక్యం చేసుకోలేమని స్పష్టంచేసింది. వెనుకబడిన వర్గాలకు సంక్షేమ పథకాలు అమలు చేయాలంటే వారి సంఖ్య ప్రభుత్వానికి తెలియాల్సిందేనని సుప్రీంకోర్టు స్పష్టం చేసింది. ఏజెన్సీలు కులగణన సమాచారాన్ని దుర్వినియోగం చేసే అవకాశం ఉందని సర్వోన్నత న్యాయస్థానంలో ప్రజాప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. దీనిపై విచారణ చేపట్టిన సీజేఐ జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జయమాల్య బాగ్చీ, జస్టిస్ విపు పంచోలీతో కూడిన ధర్మాసం పిల్ ను కొట్టివేసింది. జనగణన కులాల ఆధారంగా జరగాలా వద్దా అన్నది పూర్తిగా ప్రభుత్వ విధాన నిర్ణయమని ఈ సందర్భంగా ధర్మాసనం పేర్కొంది. సంక్షేమ చర్యల కోసం ఎన్ని మంది వెనుకబడిన వర్గాల్లో ఉన్నారో ప్రభుత్వం తెలుసుకోవాలని తెలిపింది. ఈ అంశంలో న్యాయస్థానం జోక్యం చేసుకునే అవసరం లేదని ధర్మాసనం స్పష్టం చేసింది. ఇది పూర్తిగా విధానపరమైన అంశమని, జోక్యం చేసుకునే కారణం కనిపించడం లేదంటూ చెప్పింది. 2027 జనగణనలో కులగణన తప్పనిసరిగా ఉండాలా వద్దా అన్నది కోర్టు నిర్ణయించే అంశం కాదని ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్ పేర్కొన్నారు. వెనుకబడిన వర్గాల నిర్మాణం, వారి సంఖ్య వంటి అంశాలను అంచనా వేయడానికి ప్రభుత్వానికి ఈ సమాచారం అవసరం కావచ్చని ధర్మాసనం అభిప్రాయపడింది. ఈ అంశం పూర్తిగా ప్రభుత్వ విధాన పరమైనదని, ప్రస్తుత పరిస్థితుల్లో న్యాయ సమీక్ష పరిధిలోకి రాదని పేర్కొంటూ ధర్మాసం ఈ పిటిషన్‌ను తిరస్కరించింది. ను సుధాకర్ గుమ్మల అనే వ్యక్తి దాఖలు చేశారు. కుల ఆధారిత డేటా సేకరణను రాజకీయ నాయకులు, కార్పొరేట్ సంస్థలు దుర్వినియోగం చేసే ప్రమాదం ఉందని ఆయన వాదించారు. ఇంత భారీ స్థాయిలో కుల డేటా సేకరణకు సరైన కారణం లేదని కోర్టుకు తెలిపారు.

తొలిసారిగా డిజిటల్ గణన

మన దేశానికి స్వాతంత్ర్యం వచ్చాక జరుగుతున్న 16వ జనగణన ఇది. 2027 జనగణన నిర్వహణ కోసం కేంద్ర ప్రభుత్వం రూ.11,718 కోట్లను వెచ్చించనుంది.

## దేశానికే ఆదర్శంగా ఆంధ్ర మోడల్ ఎడ్యుకేషన్ తీర్చిదిద్దుతాం

మొదటి పేజి తరువాయి

ఏ పాఠశాలలో ఎంతమంది చదువుతున్నారో రాష్ట్రస్థాయి విజిబిలిటీ, కనీస డేటా అందుబాటులో లేదు. పంచాయితీరాజ్ మంత్రిగా పనిచేసినప్పుడే నేను కేవలం మూడునెలల్లో పూర్తిస్థాయి సమాచారంతో డ్యాష్ బోర్డు తయారుచేశాం. విద్యాశాఖలో కనీస డేటా బేస్ అందుబాటులో లేని పరిస్థితి నుంచి విద్యాశాఖలో నా ప్రయాణం ప్రారంభించాను. ప్రభుత్వ పాఠశాలల్లో చదివే పిల్లలు మన సొంత బిడ్డల్లా భావించి నిర్ణయాలు తీసుకోవాలి. మనం తీసుకునే నిర్ణయాలపై వారి భవిష్యత్తు ఆధారపడి ఉంటుంది. బిడ్డల భవిష్యత్ కేంద్రంగా నిర్ణయాలు ఉండాలి. డ్యాష్ బోర్డు ప్రకారం యాక్షన్ ప్లాన్ దిశగా డీఈవోలు, ఏపీసీలు పనిచేయాలి. రాష్ట్రవ్యాప్తంగా లక్షమంది పిల్లలు డ్రాపవుట్స్ గా ఉన్నారు. నెవర్ ఎన్ రోల్డ్ పై కూడా ఫోకస్ చేయాలి. నూరుశాతం ఎన్ రోల్ మెంట్ పై అధికారులంతా దృష్టిపెట్టాలి. యువగళం పాదయాత్ర సమయంలో నేను కర్నూలు జిల్లాలో పర్యటించేటప్పుడు వలస కార్మికుల కష్టాలను కళ్లారా చూశాను. ఎట్టిపరిస్థితుల్లో పిల్లలు పొలం పనులకు వెళ్లే పరిస్థితి ఉండకూడదు. ఈ విషయంలో ప్రాపర్ ట్రాక్ మెకానిజం ఉండాలి" అన్నారు.

ఉద్యమంలా జీఎఫ్ఎల్ఎన్ చేపట్టాలి

"లెర్నింగ్ ఎక్సలెన్స్ ఇన్ ఆంధ్రప్రదేశ్ లో భాగంగా గ్యారంటీడ్ ఎఫ్ఎల్ఎన్ ప్రోగ్రామ్ ను ఒక ఉద్యమంగా అమలుచేయాలి. వాస్తవాలు తెలుసుకున్నపుడే సరైన నిర్ణయాలు తీసుకోగలం. నిజం చేదుగా, అబద్ధంగా తీయగా ఉంటుంది. వాస్తవాన్ని అంగీకరిస్తేనే మన ప్రయాణం సరైన దిశగా సాగుతుంది. మేం సరైన నిర్ణయాలు తీసుకోవాలంటే మీరు సరైన సమాచారం ఇవ్వాలి. ప్రస్తుతం 9వ తరగతికి క్లిక్కర్ టెక్నాలజీ అమలు చేస్తున్నాం. క్రోమ్ బుక్స్ అందించబోతున్నాం. నూరుశాతం జీఎఫ్ఎల్ఎన్ సాధనే లక్ష్యంగా పనిచేయాలి. 5 శాతం వెనుకబడటం అంటే సాధారణమైంది కాదు. వాస్తవంలో అది లక్షల సంఖ్యలో ఉంటుంది. వన్ క్లాస్ వన్ టీచర్ విధానాన్ని అమలు చేస్తున్నాం. రాష్ట్రంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో కనీసం 10శాతం ఎన్ రోల్ మెంట్ ఇంప్రూవ్ చేయాలి. అధికారులు, ప్రజాప్రతినిధులు ఇందుకోసం సమిష్టిగా పనిచేయాలి" అన్నారు.

ఆత్మవిశ్వాసం నింపిన విద్యాశాఖ ప్రకటన

ప్రభుత్వ స్కూళ్లలో క్వాలిఫైడ్, ప్రతిభావంతమైన టీచర్లు ఉన్నారని, పదోతరగతి ఫలితాలపై ఇటీవల తొలిసారి ప్రభుత్వమే యాడ్ ఇచ్చిందని తెలిపారు. అది పిల్లల్లో ఆత్మవిశ్వాసం నింపిందని అన్నారు. అత్యుత్తమ ఫలితాలు సాధించిన ఉపాధ్యాయులందరికీ అభినందనలు




తెలియజేశారు. ఈ ఏడాది మెరుగైన ఫలితాల సాధనకు వందరోజుల ప్రణాళిక బాగా ఉపకరించిందని అన్నారు. అది అవసరం లేకుండానే ట్రాన్సిషన్ జరిగాలని, ఫౌండేషన్ పకడ్బందీగా ఉండాలని, దానిపై అధికారులంతా శ్రద్ధ వహించాలని సూచించారు.

రెండేళ్లలో రాష్ట్రమంతటా స్మార్ట్ కిచెన్లు

"రాష్ట్రస్థాయిలో ప్రభుత్వ స్కూళ్ల మౌలిక సదుపాయాల కోసం స్టార్ రేటింగ్ ప్రవేశపెట్టాం. దీనిపై అధికారులు ఫోకస్ చేయాల్సిన అవసరం ఉంది. క్రిటికల్ ఇన్ ఫ్రా కోసం ప్రభుత్వం నుంచి నిధులిస్తున్నాం. ఇందుకోసం అవసరమైతే దాతల సహకారం తీసుకోండి. ప్రతి పాఠశాలకు లీక్ ప్రూఫ్ బిల్డింగ్, పెయింటింగ్స్, డ్రింకింగ్ వాటర్, టాయ్ లెట్, బెంచిలు కచ్చితంగా ఉండాలి. బేసిక్ ఇన్ ఫ్రా అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో ఉండాలన్నదే మా ధ్యేయం. దీనిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. కడపలో స్మార్ట్ కిచెన్ అద్భుతంగా చేశారు. రాబోయే రెండేళ్లలో రాష్ట్రం మొత్తం స్మార్ట్ కిచెన్ వ్యవస్థ ఏర్పాటు చేస్తాం" అని అన్నారు.

ఇంటర్నేషనల్ స్కూలుగా నిడమర్రు పాఠశాల

మంగళగిరి నియోజకవర్గం నిడమర్రు స్కూలును ఇంటర్నేషనల్ స్కూలుగా తీర్చిదిద్దుతున్నామని లోకేశ్ తెలిపారు. అక్కడ తొలిసారి నో అడ్మిషన్ బోర్డు పెట్టారని అన్నారు. నెల్లూరులో కూడా రెండు స్కూల్స్ ను మంత్రి నారాయణ అభివృద్ధి చేస్తున్నారని తెలిపారు. ప్రతి జిల్లాలో ఒక పాఠశాలను మోడల్ స్కూలుగా తీర్చిదిద్దాలని అధికారులను కోరుతున్నానని అన్నారు. అమెరికాలో స్కూల్ డిస్ట్రిక్ట్ అనే కాన్సెప్ట్ అమలులో ఉందని అన్నారు. నిడమర్రులో మనం కల్పించిన అత్యుత్తమ సౌకర్యాల వల్ల పక్క నియోజకవర్గాల వారు కూడా ఈ నియోజకవర్గానికి తమ బిడ్డల అడ్మిషన్ కోసం నివాసం మార్చుకుంటున్నారని అన్నారు. రాష్ట్రంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో ఇదే పరిస్థితి కల్పించే లక్ష్యంతో పనిచేయాలని అన్నారు. దీనిపై అధికారులు దృష్టిసారించాలని విజ్ఞప్తి చేశారు.

బోధనపైనే ఉపాధ్యాయులు దృష్టిపెట్టాలి

"నేను విద్యామంత్రిగా బాధ్యతలు చేపట్టాక అనేక సంస్కరణలు తెచ్చా. ఉపాధ్యాయులు బోధనపైనే దృష్టిపెట్టాలి. అధికారులు అడ్మినిస్ట్రేషన్ పై శ్రద్ధ వహించాలి. లీప్ యాప్ ద్వారా పనివిధానాన్ని మెరుగుపర్చుకోవాలి. గతంలో విజిబిలిటీ లేకుండా క్రమశిక్షణ చర్యలు తీసుకున్నారు. ఇప్పుడు మొత్తం విధానానికి లీప్ యాప్ కేంద్రంగా ఉంటుంది. రాష్ట్ర, జిల్లా, మండల, స్కూలు స్థాయిలో ఒకేవిధమైన డేటా ఉండాలి. లక్ష్యసారూప్యత ఉండాలి. డ్యాష్ బోర్డుపై శ్రద్ధపెట్టాలి. ఇదంతా పూర్తయ్యాక పబ్లిక్ డ్యాష్ బోర్డుకు యాక్సెస్ ఇస్తాం. పాల్, ఏఐ బేస్ లెర్నింగ్, ఏఐ ట్యూటర్ త్వరలోనే అమలు చేయబోతున్నాం" అని అన్నారు.

నైతిక విలువలు ముఖ్యం

టెక్నాలజీతోపాటు నైతిక విలువలు చాలా అవసరమని అన్నారు. అందుకే చాగంటి కోటేశ్వరరావు గారికి కేబినెట్ హోదాతో అడ్వయిజర్ గా పెట్టామని తెలిపారు. ప్రతి శనివారం వాల్యూ బేస్డ్ ఎడ్యుకేషన్ పై దృష్టిపెట్టాలని అన్నారు. ఒక సోషల్ మీడియా పోస్టులో కొడుకు తల్లిని చంపే పరిస్థితి చూశానని, నైతిక విలువల బోధనతో ఇటువంటి ఘటనలను నివారించే అవకాశముందని అన్నారు. విద్యాశాఖపై పవిత్రమైన బాధ్యత ఉందని అన్నారు. జెండర్ సెన్సిటివిటీ కూడా చాలా ముఖ్యమని తెలిపారు. ఉపాధ్యాయులకు ఎక్స్ పోజర్ విజిట్స్ ఏర్పాటు చేస్తున్నామని, యోగా, స్పోర్ట్స్ పై శ్రద్ధ పెడుతున్నామని వెల్లడించారు. స్పోర్ట్స్ కిట్స్ ఇస్తున్నామని, శాప్ ద్వారా స్పోర్ట్స్ కాంపిటీషన్స్ పెడుతున్నామని అన్నారు. విద్యాశాఖ వద్దని చాలామంది తనను వారించినా సమాజంలో తాను ఆశించిన మార్పు విద్యతోనే సాధ్యమని నమ్మి ఈ శాఖను తీసుకున్నానని అన్నారు. నూరుశాతం ఫలితాలు సాధించినపుడే విద్యాశాఖ మంత్రిగా సంతృప్తి చెందుతానని వ్యాఖ్యానించారు. అవుట్ కమ్ బేస్డ్ ఎడ్యుకేషన్ పై ఎక్కువ శ్రద్ధ పెట్టాలని సూచించారు. మెరుగైన ఫలితాలు సాధించాల్సిన పవిత్ర బాధ్యత మనందరిపై ఉందని మంత్రి లోకేశ్ చెప్పారు.

రెండేళ్లలో విద్యావ్యవస్థలో అనూహ్య మార్పులు

హెచ్ఆర్‌డీ కార్యదర్శి కోన శశిధర్ మాట్లాడుతూ, పాఠశాల విద్య భవిష్యత్ కార్యాచరణ గురించి ఈ సమావేశం ఏర్పాటు చేశామని అన్నారు. గత రెండేళ్లలో పాఠశాల విద్యావ్యవస్థలో మునుపెన్నడూ చూడని సంస్కరణలు చూసినట్లు చెప్పారు. ఇంకా చేయాల్సినవి చాలా ఉన్నాయని అన్నారు. అనేకసార్లు మంత్రి లోకేశ్ రాష్ట్రస్థాయి అధికారులతో సమీక్షించి దశ, దిశ నిర్దేశించినట్లు చెప్పారు. ఒక్కోసారి ఉదయం నుంచి రాత్రి పొద్దుపోయే వరకు సమావేశాలు నిర్వహించారని తెలిపారు.

## కుట్రపూరితంగానే రైళ్లలో అగ్నిప్రమాదాలు

మొదటి పేజి తరువాయి

ఆగి ఉన్న మిథిలా ఎక్స్‌ప్రెస్‌లోని ఒక బోగీలో మంటలు చెలరేగిన విషయాన్ని రైల్వేశాఖ గుర్తుచేసింది. వెంటనే రైల్వే ప్రొటెక్షన్ ఫోర్స్ (ఆర్‌పీఎఫ్), ఫోరెన్సిక్ టీమ్స్ తనిఖీలు చేపట్టగా, ఆ బోగీలోని టాయిలెట్‌లో పెట్రోలుతో తడిపిన సగం కాలిన గుడ్డ ముక్క లభించిందని తెలిపింది. మొత్తం రైల్వే సిబ్బంది చురుగ్గా స్పందించి పరిస్థితిని అదుపులోకి తీసుకొచ్చి పెద్ద ప్రమాదాన్ని నివారించారని రైల్వేశాఖ పేర్కొంది. కొంతమంది అసాంఘిక శక్తులు ప్రయాణికుల భద్రతకు ముప్పు కలిగించడానికి, రైల్వే వ్యవస్థలో భయాందోళనలు, గందరగోళాన్ని సృష్టించడానికి ప్రయత్నిస్తున్నట్లు ప్రాథమిక పరిస్థితులు సూచిస్తున్నాయని రైల్వేశాఖ వెల్లడించింది. ఆర్‌పీఎఫ్, సంబంధిత దర్యాప్తు సంస్థలు ఈ విషయాలన్నింటిపై లోతైన దర్యాప్తు చేస్తున్నాయని చెప్పింది.

### నాలుగు ప్రమాదాలు- కారణాలు

గత వారం రోజుల వ్యవధిలో రాజస్థాన్‌లోని అమరపుర స్టేషన్ సమీపంలో, మధ్యప్రదేశ్ పరిధిలోని కోట రైల్వే డివిజన్‌లో, బిహార్‌లోని ససారం రైల్వే స్టేషన్‌లో, బంగాల్‌లోని హౌరా స్టేషన్‌లో రైళ్లలో జరిగిన నాలుగు అగ్నిప్రమాద ఘటనలను తాజా ప్రకటనలో రైల్వేశాఖ ప్రస్తావించింది. ఈ సంఘటనలను తాము చాలా తీవ్రంగా పరిగణిస్తున్నామని, ప్రతి ఘటనలోనూ ఆర్‌పీఎఫ్ లోతైన దర్యాప్తును నిర్వహిస్తోందని తెలిపింది. రాజస్థాన్‌లోని అమరపుర స్టేషన్ సమీపంలో రైలుబోగీలోని పరుపు, సామగ్రికి నిప్పు పెట్టినట్లు ఆరోపణలు వచ్చాయని పేర్కొంది. బంగాల్‌లోని హౌరా స్టేషనులో అగ్నిప్రమాదానికి గురైన రైలు బోగీలోని టాయిలెట్ నుంచి పెట్రోలులో తడిపిన వస్త్రాన్ని అధికారులు స్వాధీనం చేసుకున్నారని చెప్పింది. మధ్యప్రదేశ్‌లోని కోట రైల్వే డివిజన్ పరిధిలో ఉన్న రత్లాంలో జరిగిన మరొక ఘటనలో రాజధాని ఎక్స్‌ప్రెస్ వాష్‌రూమ్ ఏరియా నుంచి మంటలు వచ్చినట్లు గుర్తించామని రైల్వేశాఖ తెలియజేసింది. బిహార్‌లోని ససారంలో ఓ గుర్తు తెలియని వ్యక్తి రైల్వే బోగీలోకి మండుతున్న వస్తువును విసిరినట్లు సమాచారం వచ్చిందని పేర్కొంది.

### అప్రమత్తంగా, సురక్షితంగా ఉండండి : రైల్వేశాఖ

"రైల్వే ప్రయాణికులు అప్రమత్తంగా, సురక్షితంగా ఉండాలని మేం కోరుతున్నాం. ఏదైనా అనుమానాస్పద కార్యకలాపాన్ని గమనిస్తే, వెంటనే రైల్వే హెల్ప్‌లైన్ 139కు కాల్ చేసి సమాచారాన్ని అందించండి" అని రైల్వేశాఖ పిలుపునిచ్చింది.

ఏసీ కోచ్‌లో 68 మంది- బాత్‌రూమ్‌లో మంటలు

మధ్యప్రదేశ్‌లోని రత్లాం జిల్లా అనేది కోట రైల్వే డివిజన్ పరిధిలోకి వస్తుంది. మే 17న ఉదయం 5.15 గంటలకు ఈ జిల్లాలోని విక్రమ్‌గఢ్ ఆలోట్, లూని రిచా రైల్వే స్టేషన్ల మధ్య తిరువనంతపురం-హజ్రత్ నిజాముద్దీన్ రాజధాని ఎక్స్‌ప్రెస్‌లో కలకలం రేగింది. ఈ రైలులోని ఒక ఏసీ కోచ్(బి-1)లో ఉన్న బాత్‌రూమ్‌లో భారీ అగ్ని ప్రమాదం జరిగింది. బాత్‌రూమ్ నుంచి మంటలు, దట్టమైన పొగలు బయటకు రావడాన్ని రైలు గార్డ్ గమనించారు. ఈ మంటలు ఆ తర్వాత వేగంగా పక్కనే ఉన్న లగేజీ కమ్ గార్డ్ వ్యాన్ దాకా వ్యాపించాయి. అయితే, ఈ ప్రమాదం జరిగిన సమయంలో బి-1 ఏసీ బోగీలో 68 మంది ప్రయాణికులు ఉన్నారు. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు. ఈ ప్రమాదానికి సంబంధించిన ఒక వీడియోలో, వేరుగా ఉంచిన రైలు బోగీ నుంచి దట్టమైన నల్లటి పొగ ఆకాశంలోకి ఎగజిమ్ముడం కనిపించింది. ఈ బోగీ నుంచి రైలు పట్టాల సమీపంలో ఉన్న కొన్ని చెట్లకూ మంటలు వ్యాపించాయి. మొత్తం మీద మే 17న ఈ ప్రమాదంతో విక్రమ్‌గఢ్ ఆలోట్, లూని రిచా రైల్వే స్టేషన్ల రూట్‌లో రైళ్ల రాకపోకలకు అంతరాయం ఏర్పడింది. దాదాపు 18 రైళ్ల షెడ్యూళ్లపై ప్రభావం పడింది.

### రెండు రోజులకే హౌరాలోనూ ప్రమాదం

మధ్యప్రదేశ్‌లో ఈ ప్రమాదం జరిగిన రెండు రోజులకే (మే 19న) బంగాల్‌లోని హౌరా స్టేషన్‌లోనూ రైలు బోగీలో మంటలు చెలరేగాయి. ఈ నేపథ్యంలో గత వారం రోజుల వ్యవధిలో జరిగిన నాలుగు రైలు ప్రమాద కారణాల వివరాలతో రైల్వేశాఖ విడుదల చేసిన తాజా ప్రకటన ప్రాధాన్యం సంతరించుకుంది.

## సాఫ్ట్‌వేర్ కొలువు వదిలి అథ్లెటిక్స్ వైపు మొగు

మొదటి పేజి తరువాయి

బీటెక్‌లో టాప్ ర్యాంకర్ గా నిలిచి సాఫ్ట్‌వేర్ కొలువు సాధించినా వదులుకుంది. ఆసక్తి ఉన్న అథ్లెటిక్స్ వైపు మొగ్గు చూపింది. చైనాలో జరిగిన వరల్డ్ యూనివర్శిటీ గేమ్స్‌లో కాంస్యం సాధించి 102 ఏళ్ల భారత క్రీడా చరిత్రలో లాంగ్ జంప్ విభాగంలో దేశానికి పతకం తెచ్చిన తొలి క్రీడాకారిణిగా గుర్తింపు తెచ్చుకుంది. కృష్ణా జిల్లాకు చెందిన భవాని క్రీడా ప్రయాణం ఈ స్టోరీలో తెలుసుకుందాం. సాధారణంగా ఇంజినీరింగ్ పూర్తికాగానే సాఫ్ట్‌వేర్ కొలువు, లక్షల్లో జీతం ఇదే కదా సగటు యువత కల. కానీ ఈమె ఆలోచనే వేరు. సాఫ్ట్‌వేర్ కోడింగ్ కంటే మైదానంలో పరుగు తీయడమే తనకిష్టమంది. వెన్నునొప్పి వేధించినా, ఆలస్యంగా కెరీర్ మొదలుపెట్టినా లాంగ్ జంప్‌లో రాణించి చరిత్ర సృష్టించింది. 102 ఏళ్ల భారతీయుల నిరీక్షణకు తెరదించుతూ అంతర్జాతీయ వేదికపై భారత జెండా ఎగురవేసి చరిత్రలో తనపేరు లిఖించుకుంది. 2025 ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్ మీట్‌లో స్వర్ణం, సౌత్ ఏషియన్ అథ్లెటిక్ ఫెడరేషన్ పోటీల్లో కాంస్యం సొంతం చేసుకుంది. భవాని యాదవ్ స్వస్థలం కృష్ణా జిల్లా గొల్లపూడి. కుటుంబ ఆర్థిక పరిస్థితులు అంతంత మాత్రమే. మెకానికల్ ఇంజినీరింగ్ పూర్తి చేసి ఐటీ ఉద్యోగం సాధించింది. అయితే ఆమె లక్షలాది మంది ఐటీ ఉద్యోగుల్లో ఒకరిగా మిగిలిపోవడం కంటే దేశం గర్వించే అథ్లెట్‌గా ఎదగాలని నిర్ణయించుకుంది. సాఫ్ట్‌వేర్ కొలువుని కాదనుకుంది. ఇంట్లో వాళ్లను ఒప్పించి 3 ఏళ్ల సమయం



అడిగి పట్టుదలతో అథ్లెటిక్ ట్రాక్‌పై అడుగు పెట్టింది. అలా మొదలైన ఆమె ప్రయాణం నేడు ప్రొఫెషనల్ అథ్లెట్‌గా ఎదిగే స్థాయికి చేరింది. ఏపీలో సౌకర్యాలు లేక కేరళ, బెంగళూరులో శిక్షణ: 2023లో చైనాలో జరిగిన వరల్డ్ యూనివర్శిటీ గేమ్స్ భవాని కెరీర్‌ను మలుపు తిప్పాయి. 102 ఏళ్ల భారత క్రీడా చరిత్రలో లాంగ్ జంప్ విభాగంలో భారత్‌కు ఒక్క పతకం కూడా లేదు. కానీ 6.32 మీటర్ల దూరం దూకి కాంస్య పతకం దక్కించుకున్న భవాని ఆ రికార్డును తిరగరాసింది. భారత క్రీడా చరిత్రలో తన ప్రతిభను సువర్ణాక్షరాలతో లిఖించింది. అక్కడితో ఆగలేదు. 2025 ఇండియన్ ఓపెన్ అథ్లెటిక్స్ మీట్‌లో స్వర్ణం, సౌత్ ఏషియన్ అథ్లెటిక్ ఫెడరేషన్ పోటీల్లో కాంస్యం సొంతం చేసుకుని తన ప్రతిభ చాటుకుంది. చాలామంది అథ్లెట్లు చిన్నతనం నుంచే మైదానాల్లో శిక్షణ మొదలుపెడతారు. కానీ భవాని కథ భిన్నమైంది. ఆమె అథ్లెటిక్స్‌లోకి అడుగుపెట్టేసరికి 20 ఏళ్లు దాటాయి. కెరీర్ ఆరంభంలో వెన్ను నొప్పి వంటి శారీరక ఇబ్బందులు ఎదురైనా వెనకడుగు వేయలేదు. ఏపీలో సరైన సౌకర్యాలు లేక కేరళ, బెంగళూరులో శిక్షణ తీసుకుంది. కేరళ కోచ్ అజిత్ కుమార్ వద్ద మెలకువలు నేర్చుకున్న ఆమె ప్రస్తుతం ఒలింపిక్సే లక్ష్యంగా బెంగళూరులోని సాయి కేంద్రంలో రష్యా దిగ్గజ కోచ్ డెనిస్ కపోస్టిన్ పర్యవేక్షణలో రాటుదేలుతోంది. తన ప్రతిభకు గానూ స్పోర్ట్స్ కోటాలో రైల్వే ఉద్యోగం దక్కించుకుంది. తండ్రి ప్రోత్సాహం వల్లే ఈ స్థాయికి: ప్రస్తుతం రైల్వేలో టీసీగా చేస్తున్న జాబే భవానికి ఆధారం. ఇప్పటికే ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్న ఆమెకు అంతర్జాతీయ స్థాయి శిక్షణ, ప్రయాణాలకు భారీగా ఖర్చవుతోంది. తండ్రి అండగా నిలుస్తున్నా అది ఏమాత్రం చాలడం లేదు. స్పాన్సర్లు సాయం చేస్తే ఒలింపిక్ కల సాకారం చేయగలనంటోంది. ఇతర రాష్ట్రాల్లో అథ్లెట్లకు ఇచ్చే ప్రోత్సాహకాలు ఏపీలో కూడా అందాలని ఆశిస్తోంది. ప్రభుత్వం అండగా నిలిస్తే అంతర్జాతీయ వేదికలపై ఏపీ నుంచి మరిన్ని పతకాలు సాధిస్తాననే నమ్మకంతో ముందుకు సాగుతోంది. ఇప్పటి వరకు తండ్రి ప్రోత్సాహం వల్లే ఈ స్థాయికి ఎదిగానని చెబుతోంది భవాని. కుమార్తె సక్సెస్ పట్ల ఆనందం వ్యక్తం చేస్తున్నాడు తండ్రి భగవతి యాదవ్. ఆమె సాధించిన పతకం కంటే ఆ సమయంలో భారత జెండా ఎగరటం గర్వంగా అనిపించిందని చెబుతున్నాడు. లక్షల జీతాన్ని వదులుకుని పతకాల వేటలో పట్టుదలతో దూసుకుపోతున్న భవాని యాదవ్ ప్రయాణం భవిష్యత్ తరానికి ఆదర్శం. ప్రభుత్వం ప్రోత్సహిస్తే ఒలింపిక్ వేదికపై దేశం గర్వించేలా చేస్తానని చెబుతోంది.

## మరింత ఆర్థిక మద్దతు అవసరం

మొదటి పేజి తరువాయి

ఒకటిగా వేగంగా అభివృద్ధి చెందుతున్నప్పటికీ 2014 నుంచి 2023 మధ్య ప్రత్యేక ప్రయోజన సంస్థలు (ఎస్‌పీవీల) ద్వారా చేపట్టిన అప్పుల భారం, వాటి చెల్లింపుల కారణంగా రాష్ట్ర ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరిగిందని ఉప ముఖ్యమంత్రి పేర్కొన్నారు. అయినప్పటికీ విద్య, వైద్యం, గ్రామీణ మౌలిక వసతులు, మానవ వనరుల అభివృద్ధి రంగాల్లో ప్రభుత్వం భారీ స్థాయిలో పెట్టుబడులు కొనసాగిస్తోందని తెలిపారు. ప్రత్యేకంగా యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ద్వారా రాష్ట్రంలోని విద్యార్థులకు ప్రపంచస్థాయి విద్య అందించేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని భట్టి విక్రమార్క వివరించారు. జిల్లాల వారీగా కొత్త మెడికల్ కాలేజీలు, గ్రామీణ ఆరోగ్య సేవల విస్తరణ, విద్యా మౌలిక వసతుల బలోపేతం వంటి కార్యక్రమాలు సామాజిక సమానత్వంతో కూడిన సుస్థిర అభివృద్ధికి దోహదపడతాయని తెలిపారు. అదేవిధంగా, విద్యా రంగంలో తమ ప్రభుత్వం చేపడుతున్న భారీ పెట్టుబడులకు సంబంధించి కేంద్ర ఆర్థిక మంత్రికి మరో వినతిపత్రం సమర్పించారు. రాష్ట్ర ప్రభుత్వం విద్యా రంగ రూపాంతరానికి మొత్తం రూ.30 వేల కోట్ల పెట్టుబడుల ప్రణాళిక రూపొందించిందని, ఇందులో రూ.21వేల కోట్లతో 105 యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ క్యాంపస్‌ల నిర్మాణం, మరో రూ.9 వేల కోట్లతో ప్రభుత్వ జూనియర్ కళాశాలలు, డిగ్రీ కళాశాలలు, సాంకేతిక విద్యాసంస్థలు, డిజిటల్ మౌలిక వసతుల అభివృద్ధి చేపడుతున్నట్లు వివరించారు. ఈ క్రమంలో ఆసియన్ డెవలప్‌మెంట్ బ్యాంక్ సహకారంతో రూ.4,049.11 కోట్ల వ్యయంతో



యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ రెసిడెన్షియల్ స్కూల్స్ ప్రాజెక్ట్, ఆసియన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ ఇన్వెస్ట్‌మెంట్ బ్యాంక్ సహకారంతో రూ.4,903.44 కోట్లతో తెలంగాణ ఎడ్యుకేషన్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ అప్‌గ్రేడేషన్ మిషన్ ప్రాజెక్టులకు డిపార్ట్‌మెంట్ ఆఫ్ ఎకనామిక్ అఫైర్స్ ఆమోదం తెలిపినందుకు కేంద్ర ప్రభుత్వానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ రెండు ప్రాజెక్టులకు సంబంధించిన రుణాలను రాష్ట్ర ఎఫ్ఆర్‌బీఎం పరిమితుల నుంచి మినహాయించాలని ఉప ముఖ్యమంత్రి విజ్ఞప్తి చేశారు. ఇవి సాధారణ ఖర్చులు కాకుండా భవిష్యత్ తరాల మానవ వనరుల అభివృద్ధికి, ముఖ్యంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ వర్గాల విద్యా సాధికారతకు దోహదపడే దీర్ఘకాలిక మూలధన పెట్టుబడులని పేర్కొన్నారు. వికసిత భారత్-2047 లక్ష్య సాధనలో రాష్ట్ర ప్రభుత్వం చేపడుతున్న విద్యా, మౌలిక వసతుల పెట్టుబడులు కీలక పాత్ర పోషిస్తాయని, కేంద్ర ప్రభుత్వం నుంచి తగిన మద్దతు లభిస్తే రాష్ట్ర అభివృద్ధి మరింత వేగవంతం అవుతుందని ఉప ముఖ్యమంత్రి తెలిపారు. ఆయన వెంట ఫైనాన్స్ ప్రిన్సిపల్ సెక్రెటరీ సందీప్ కుమార్ సుల్తానియా, ప్లానింగ్ డిపార్ట్మెంట్ సెక్రెటరీ డాక్టర్ గౌరవ ఉప్పల్ ఉన్నారు.

తెలుగు జాతీయ వార్తలు, ప్రత్యేక కథనాలు, ట్రెండింగ్ వీడియోలు కోసం వెబ్‌సైట్ ను సందర్శించండి. తాజా అప్‌డేట్స్ కోసం మా ఛానల్ ను ఫాలో కండి.. అలాగే మా ప్రజాతంత్ర, యూట్యూబ్ చానల్ ను సబ్ స్క్రైబ్ చేసుకోండి.. మీ అభిప్రాయాన్ని కామెంట్ రూపంలో పంచుకోండి. మీ స్నేహితులు, కుటుంబ సభ్యులతో షేర్ చేయడం మర్చిపోవద్దు.

# సంపాదకీయం

## కొత్త ప్రపంచానికి భారత్ ఇటలీ బాట

భారత్ఇటలీ ద్వైపాక్షిక సంబంధాలు కీలక మలుపులో నిలిచిన తరుణమిది. స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలు, భవిష్యత్తుపై సంయుక్త ఆశావహ దృక్పథం ప్రాతిపదికన ఇటీవలి కాలంలో ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంగా అవి రూపాంతరం చెందాయి. అంతర్జాతీయ వ్యవస్థ ప్రగాఢ మార్పులకు లోనవుతున్న ప్రస్తుత సందర్భంలో అత్యున్నత రాజకీయ, సంస్థాగత స్థాయిలలో క్రమబద్ధ ఆదానప్రదానాలు రెండు దేశాల భాగస్వామ్యాన్ని నిర్దేశిస్తున్నాయి. ప్రస్తుత 21వ శతాబ్దంలో ఆయా దేశాల ఆవిష్కరణ సామర్థ్యం, ఇంధన పరివర్తన నిర్వహణ, వ్యూహాత్మక సార్వభౌమత్వ బలోపేతం తదితరాలు ప్రజా శ్రేయస్సు, జాతీయ భద్రత వంటి అంశాలపై ఆధారపడి ఉన్నాయి. ఈ విషయంలో మా ఉమ్మడి అవగాహనను రెండు దేశాల మధ్య సహకారం ప్రస్ఫుటం చేస్తోంది. ఈ దిశగా కొత్త పరస్పర పూరక బలాల ఏకీకరణ సహా ద్వైపాక్షిక బంధాన్ని మరింత పటిష్ఠంగా తీర్చిదిద్దడంపై మా నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాం. అంతర్జాతీయ స్థాయి సూపర్ కంప్యూటర్ల తయారీ నైపుణ్యంతో పారిశ్రామిక కూడలిగా ప్రపంచంలో ఇటలీకి ప్రముఖ స్థానం ఉంది. అదేవిధంగా 100కు పైగా యూనికార్న్ సంస్థలు సహా 2,00,000 అంకుర సంస్థలతో భారత్ శరవేగంగా ఆర్థికవృద్ధిని సాధిస్తోంది. దీంతోపాటు ఇంజనీరింగ్ ప్రతిభవిస్తృతి, ఆవిష్కరణవ్యవస్థాపనావరణ వ్యవస్థలను కలిగి ఉంది. రెండు దేశాలకుగల ఈ సామర్థ్యాల మధ్య శక్తిమంతమైన సమన్వయ సాధన లక్ష్యాన్ని మేము నిర్దేశించుకున్నాం. ఇది మా పారిశ్రామిక బలాలను పరస్పరం బలోపేతం చేసుకునే విలువల వ్యవస్థను సంయుక్తంగా సృష్టిస్తుంది. ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులు ఇనుమడించేందుకు ఐరోపా సమాఖ్యభారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం (ఎఫ్‌టీఏ) బాటలు వేస్తుంది. రక్షణఏరోస్పేస్, కాలుష్య రహిత సాంకేతికతలు, యంత్రాలు, ఆటోమోటివ్ విడిభాగాలు, రసాయనఔషధ, జౌళి, వ్యవసాయఆహార, పర్యాటకం సహా మరిన్ని రంగాలపై 'ఎఫ్‌టీఏ' దృష్టి సారిస్తుంది. తద్వారా 2029 నాటికి ఇటలీభారత్ మధ్య నిర్దేశిత 20 బిలియన్ యూరోల వాణిజ్య లక్ష్యాన్ని చేరడంతో సరిపెట్టకుండా దాన్ని అధిగమించాలన్నది మా ఆకాంక్ష. 'మేడ్ ఇన్ ఇటలీ' అనేది అంతర్జాతీయంగా అత్యుత్తమ నాణ్యతకు పర్యాయ పదబంధం. ఇప్పుడిది 'మేక్ ఇన్ ఇండియా' కార్యక్రమ నిర్దేశిత ఉన్నత నాణ్యత లక్ష్యంతో సహజ సమన్వయం ఏర్పరుచుకుంటుంది. ఈ నేపథ్యంలో భారత్ కోసం ఉత్పాదన దిశగా ఇటలీ వ్యాపార సంస్థలలో ఆసక్తి పెరుగుతోంది. మరోవైపు ఇటలీలో భారత పరిశ్రమల సంఖ్య కూడా పెరగడం (ప్రస్తుతం రెండువైపులా వీటి సంఖ్య 1000కి పైగానే) మా సరఫరా వ్యవస్థల ఏకీకరణను బలోపేతం చేసే సానుకూల సంకేతం. మా భాగస్వామ్యానికి సాంకేతిక ఆవిష్కరణలే పునాది. కృత్రిమ మేధ (ఏఐ), క్వాంటం కంప్యూటింగ్, అత్యాధునిక తయారీ, కీలక ఖనిజాలు, డిజిటల్ సదుపాయాలు వంటి రంగాల్లో నేటి పురోగమన వేగం రాబోయే దశాబ్దాల్లో సాంకేతిక విప్లవంగా రూపుదిద్దుకోగలదు. ఈ క్రమంలో చైతన్యవంతమైన భారత ఆవిష్కరణావరణ వ్యవస్థ, అత్యంత నైపుణ్యంగల వృత్తి నిపుణుల వనరులు, ఇటలీకిగల నవనవీన పారిశ్రామిక సామర్థ్యం మేళవింపుతో పైన పేర్కొన్న రంగాలన్నిటా మా సహకారం వ్యూహాత్మకంగా రూపొందుతుంది. రెండు దేశాల్లోని విశ్వవిద్యాలయాలు, పరిశోధన సంస్థల మధ్య పెరుగుతున్న భాగస్వామ్యం ఈ పరిణామశీలతకు ఇతోధికంగా తోడ్పడుతుంది. ఇక భారత సార్వజనీన డిజిటల్ మౌలిక సదుపాయాలకు ఇప్పటికే అనేక దేశాల్లో, ముఖ్యంగా వర్ధమాన ఆర్థిక వ్యవస్థలలో సానుకూల స్పందన లభిస్తోంది. కృత్రిమ మేధ రంగం.. మా రెండు దేశాలతోపాటు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపైనా ఇప్పటికే తనదైన ముద్ర వేసింది. ఈ ఆధునిక సాంకేతికత పురోగమనం బాధ్యతాయుతంగా, మానవాళి కేంద్రితంగా కొనసాగేలా చూడటంలో భారత్, ఇటలీ కృషి చేస్తున్నాయి. ఈ దృక్కోణంతో 'ఏఐ'ని సార్వజనీన ప్రగతికి.. ప్రత్యేకించి వర్ధమాన దేశాలకు ఒక శక్తిమంతమైన సాధనంగా మేం పరిగణిస్తున్నాం. సాంకేతికత పరిజ్ఞానాలను మానవాళి కేంద్రితంగా ఉంచేందుకు 'మానవ్' పేరిట భారత్ ఒక దార్శనిక విధానం అనుసరిస్తోంది. అదేవిధంగా మానవతావాద సంప్రదాయంలో పాదుకున్న మానవకేంద్రక 'అల్గార్ఎథిక్స్'ను ప్రోత్సహించడంలో ఇటలీ ముందంజ వేసింది. ఈ రెండు దృక్కోణాలు ప్రాతిపదికగా కృత్రిమ మేధ పరిజ్ఞానం సామాజిక సాధికారతను ఉత్తేజితం చేయాలన్నది మా భాగస్వామ్యం నిర్దేశించుకున్న లక్ష్యం. ఈ దిశగా భారత డిజిటల్ స్థాయిని, ఇటలీ నైతిక పారిశ్రామిక నైపుణ్యాన్ని మేళవిస్తూ సాంకేతిక పరిజ్ఞానం మానవాళి ఔన్నత్యానికి సేవలందించేలా భరోసా ఇవ్వడమే మా విధానం. డిజిటల్ సహకారం, సామర్థ్య వికాసం, పటిష్ఠ సైబర్ మౌలిక సదుపాయాల కల్పనలో ఉత్తమ విధానాల ఆదానప్రదానం ద్వారా ప్రతి దేశం 'ఏఐ'ని తీర్చిదిద్దుకోవాలన్నది మా నిశ్చితాభిప్రాయం. తదనుగుణంగా ప్రయోజనం పొందగలిగే సార్వత్రిక, విశ్వసనీయ, సమాన అవకాశాలుగల డిజిటల్ ప్రపంచ సృష్టి మా ధ్యేయం. ఇటలీ జీ7 అధ్యక్షతకు, న్యూఢిల్లీలో నిర్వహించిన 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్2026' సత్ఫలితాలకు మూలం ఈ సంయుక్త దృక్పథమే. కృత్రిమ మేధను మానవాళి కోసం.. మానవ మేధ సృష్టించిన ఉపకరణంగా మాత్రమే భావించాలి. అంటే ఆధునిక సాంకేతికత వ్యక్తులకు స్థానభ్రంశం కలిగించదని లేదా వారి ప్రాథమిక హక్కులకు భంగం కలిగించదని, ప్రజల వాక్స్వాతంత్ర్యాన్ని లేదా ప్రజాస్వామ్య ప్రక్రియలను తారుమారు చేయదని ప్రస్ఫుటం చేయడమే. అంతరిక్ష పరిశోధన, ఉపగ్రహ సాంకేతికతలలో భారత్ ఇప్పటికే అద్భుత ప్రగతి సాధించింది. ఇప్పుడిక ఇటలీ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ నైపుణ్యం తోడ్పాటుతో సంయుక్త కార్యక్రమాలు చేపట్టడం సహా భావితరం సాంకేతిక పరిజ్ఞానాల రూపకల్పనకు

# నీట్ నిర్వహణలో అవే తప్పులు!



జాతీయ స్థాయిలో నిర్వహించే ప్రవేశ పరీక్షల్లో వైద్యవిద్యకు సంబంధించి నేషనల్ ఎలిజిబిలిటీ అండ్ ఎంట్రన్స్ టెస్ట్(నీట్) ఎంతో ప్రత్యేకమైనది. లక్షలాది మంది విద్యార్థులు అహర్నిశలూ కష్టపడుతూ ఉన్నతమైన భవిష్యత్తును ఊహించుకుంటూ దీనికి సన్నద్ధమవుతుంటారు. అలాంటి వారందర్నీ దిగ్భ్రాంతికి గురిచేసిన ప్రశ్నపత్రం లీకేజీ ఉదంతం మూలంగా పరీక్ష రద్దయ్యింది. ఎంతో సున్నితమైన అంశాన్ని ఎన్‌టీఏ తేలిగ్గా తీసుకోవడం వల్లే సమస్యలు పునరావృతం అవుతున్నాయా? గతంలో జరిగిన తప్పిదాలనుంచి ఏమీ నేర్చుకోలేదా? ఇదివరకు జరిగిన లీకేజీ వ్యవహారంపై తీసుకున్న చర్యలేంటి? చేపట్టిన సంస్థాగత మార్పులేంటి? ఇలాంటి ప్రశ్నలెన్నో ఇప్పుడు ఉత్పన్నమవుతున్నాయి. మన దేశంలో వైద్యుల కొరతను తగ్గించడానికి ప్రభుత్వం గత దశాబ్దకాలంగా అనేక సంస్కరణలు చేపట్టింది. సీట్ల సంఖ్యను పెంచి, వైద్యవిద్యను మరింత అందుబాటులోకి తీసుకొచ్చేందుకు ప్రయత్నిస్తోంది. అయినప్పటికీ పోటీ తగ్గడంలేదు. వైద్యవిద్యపై నవతరంలో మక్కువకు కారణం వైద్యుల పట్ల సమాజంలో ఉన్న గౌరవమే. మన వైద్యవిద్య నాణ్యత పట్ల విదేశాల్లో మంచి గుర్తింపూ ఉంది. ప్రపంచ దేశాలతో పోలిస్తే ఇండియాలో వైద్యవిద్యకు పోటీ ఎక్కువగా ఉండటానికి మరికొన్ని కారణాలూ ఉన్నాయి. ముఖ్యంగా భారత్‌లో యువత సంఖ్య ఎక్కువ. కష్టపడేతత్వం ఉన్న మన విద్యార్థులు ఇక్కడ సీట్లు రాకపోవడంతో చైనా, రష్యా, ఫిలిప్పీన్స్ వంటి దూర ప్రాంతాలకు వెళ్లి మరీ వైద్యవిద్యను అభ్యసిస్తున్నారు.

### మధ్యతరగతి విద్యార్థులకు తప్పని భారం

కేంద్ర విద్యాశాఖ పరిధిలోని జాతీయ పరీక్షా సంస్థ(నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ-ఎన్‌టీఏ) 2019 నుంచి ఏటా నీట్‌ను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహిస్తూ వస్తోంది. దేశమంతటా ఒకేసారి జరిగే ఈ పరీక్షలో సుమారు 23లక్షల మంది విద్యార్థులు... ఎనిమిది వందలకు పైగా ఉన్న వైద్య కళాశాలల్లోని దాదాపు లక్షా ముప్పయి వేల సీట్ల కోసం పోటీ పడుతుంటారు. కానీ, వారిలో కేవలం అయిదారు శాతం మందే విజయం సాధించగలుగుతున్నారు. స్వయంప్రతిపత్తి కలిగిన ఎన్‌టీఏ నీట్‌ను పకడ్బందీగా, పారదర్శకంగా, వివాదరహితంగా నిర్వహించాలని యావద్దేశం కోరుకుంటోంది. అయితే 2024 నీట్ పరీక్షలో చోటుచేసుకున్న అవకతవకలు పూర్తిగా మరచిపోకముందే, అంతకన్నా తీవ్రమైన తప్పిదం ఈ ఏడాది నిర్వహించిన పరీక్షలో జరిగింది. 2026 నీట్ పరీక్ష పత్రం లీకైనట్లు మొదట రాజస్థాన్‌లో వెలుగుచూసింది. తదుపరి హరియాణా, మహారాష్ట్ర, బిహార్, కేరళ రాష్ట్రాలకూ ఆ నెట్‌వర్క్ విస్తరించినట్లు తెలిసింది. ఒకే కుటుంబంలో అనేకమంది అరెస్టు కావడం, ఆ కుటుంబానికి సంబంధించిన పలువురు వైద్యవిద్యను అభ్యసించడం విస్మయం కలిగిస్తోంది. ఎన్నో ఏళ్లుగా ఈ తరహా నేరాలు జరుగుతున్నాయని దర్యాప్తులో వెల్లడైతే, మన వ్యవస్థలపై సామాన్యులకు నమ్మకం తగ్గిపోయే ప్రమాదముంది. ప్రాథమిక ఆధారాలు బలంగా ఉండటంతో ఎన్‌టీఏ నీట్ పరీక్షను పూర్తిగా రద్దు చేసింది. కానీ, ఈ ఉదంతం ఎన్నో ప్రశ్నలను లేవనెత్తుతోంది. లక్షల మంది విద్యార్థులు ఎన్నో వ్యయ ప్రయాసలకోర్చి ఏటా పరీక్షకు హాజరవుతుంటారు. దూరప్రాంతాలు ప్రయాణించి పరీక్ష కేంద్రాలకు చేరుకుంటారు. అంతకుముందు శిక్షణ కోసమూ భారీగా డబ్బులు వెచ్చిస్తారు. ఈ క్రమంలో ప్రయాణ, వసతి ఖర్చులు పేద, మధ్యతరగతి విద్యార్థులకు తలకు మించిన భారమవుతున్నాయి. పెద్దయెత్తున ప్రజాధనాన్ని వెచ్చించి మళ్లీ పరీక్ష నిర్వహించడం వల్ల ప్రభుత్వంపైనా పెనుభారం పడుతుంది. ఇదంతా ఆశావహులైన విద్యార్థులతో పాటు వారి తల్లిదండ్రులకూ తీవ్రమైన నిరాశ, మానసిక ఒత్తిళ్లకు కారణమవుతుంది. లీకేజీ వ్యవహారం సీబీఐకి అప్పగించడం సరైన నిర్ణయమే అయినప్పటికీ, దర్యాప్తు త్వరితగతిన పూర్తిచేసి విద్యాసంవత్సరం నష్టపోకుండా చూడటం అత్యంత కీలకం. ఒకసారి నిజానిజాలు నిర్ధారణ అయిన తరవాత కఠిన చర్యలు తీసుకుని, ఇకముందెప్పుడూ ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. ప్రశ్నపత్రం ముద్రణకు స్వస్తి చెప్పి ఆన్‌లైన్‌లో పరీక్షలు నిర్వహించే సాంకేతిక పరిజ్ఞానాన్ని అభివృద్ధి చేసుకోవాలి. దేశవ్యాప్తంగా ఒకేసారి కాకుండా అంచెలంచెలుగా పరీక్షలు నిర్వహించే విధానంపైనా దృష్టి పెట్టాలి. ఇందుకోసం ప్రతి పరీక్ష పత్రంలోని ప్రశ్నలు సమాన స్థాయిలో ఉండేలా జాగ్రత్త వహించాలి.

### అమెరికాలో పటిష్ఠ విధానం

జాతీయస్థాయి ప్రవేశ పరీక్షల నిర్వహణకు అమెరికాలోని మెడికల్ లైసెన్సింగ్ ఎగ్జామినేషన్ విధానాన్ని అనుసరించవచ్చు. ఈ విధానంలో విద్యార్థులు తమకు అనుకూలమైన సమయంలో, అనుకూలమైన ప్రదేశంలో కంప్యూటర్ ఆధారిత పరీక్ష రాస్తారు. ఏరోజుకు ఆరోజు అన్ని పరీక్ష కేంద్రాల్లో కలిపి విద్యార్థుల సగటు తీసుకుని శతాంశాల వారీగా(పర్సంటైల్) ఫలితాలను ప్రకటిస్తారు. మూల్యాంకనం సహేతుకంగా ఉంటుంది కాబట్టి విమర్శలకు ఆస్కారమన్నదే ఉండదు. ప్రతి వారం ప్రకటించే మార్కుల ఆధారంగా సీట్ల కేటాయింపు జరుగుతుంది. ఈ విధానం అవలంబించాలంటే దేశవ్యాప్తంగా అనేకచోట్ల సంవత్సరం పొడవునా పనిచేసే పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసుకోవాలి. నిత్యం అనేక పోటీ పరీక్షలు నిర్వహించే భారతదేశంలో ఇలాంటి మౌలిక సదుపాయాలు అందుబాటులోకి తీసుకురావడం ఎంతైనా అవసరం. ప్రశ్నపత్రాల రూపకల్పన కూడా కీలకమే. విస్తృతమైన ప్రశ్నల బ్యాంకును ఏర్పాటు చేయాలి. సాధారణ ప్రశ్నలు, క్లిష్టమైనవి, అతి క్లిష్టమైనవి సరైన నిష్పత్తిలో ఉండేలా జాగ్రత్త వహించాలి. ఇందుకోసం కంప్యూటర్ పరిజ్ఞానాన్ని ఉపయోగించుకోవాలి. ప్రశ్నపత్రాల రూపకల్పన, పరీక్షల నిర్వహణపై ఎప్పటికప్పుడు సమీక్షలు, విశ్లేషణలు, పరిశోధనలు జరగాలి. పటిష్ఠ విద్యావిధానంతో మన పరీక్ష విధానాన్ని సంస్కరించుకుని ప్రపంచ స్థాయిలో మన ప్రతిష్ఠను పునరుద్ధరించుకోవాలి. ఎన్‌టీఏలో అన్ని స్థాయుల్లో నిజాయతీతో కూడిన అధికారులను నియమించి ప్రజల విశ్వాసాన్ని పొందాలి. ప్రస్తుత సంఘటనను సవాలుగా తీసుకుని గట్టి చర్యలతో పరీక్షల నిర్వహణలో లోపాలు పునరావృతం కాకుండా చూడాలి.

# భారత్-ఇటలీ వ్యూహాత్మక భాగస్వామ్యంలో మలుపు

భారత్-ఇటలీ ద్వైపాక్షిక సంబంధాలు నేడొక కీలక మలుపులో నిలిచాయి. స్వేచ్ఛ, ప్రజాస్వామ్య విలువలు, భవిష్యత్తుపై సంయుక్త ఆశావహ దృక్పథం ప్రాతిపదికన ఇటీవలి కాలంలో అసాధారణ వేగంతో విస్తరిస్తూ ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంగా రూపాంతరం చెందాయి. ముఖ్యంగా అంతర్జాతీయ వ్యవస్థ ప్రగాఢ మార్పులకు లోనవుతున్న తరుణంలో అత్యున్నత రాజకీయ, సంస్థాగత స్థాయిలలో క్రమబద్ధ ఆదాన ప్రదానాలు రెండు దేశాల భాగస్వామ్యాన్ని నిర్దేశిస్తున్నాయి. అనాదిగా సంక్రమిస్తున్న నాగరికతా జ్ఞానం మేళవింపుతో మా ఆర్థిక చైతన్యం, సామాజిక సృజనాత్మకత ఈ పరిణామానికి కొత్త కోణాన్ని ఆపాదిస్తున్నాయి. ప్రస్తుత 21వ శతాబ్దంలో ఆయా దేశాల ఆవిష్కరణ సామర్థ్యం, ఇంధన మార్పిడి నిర్వహణ, వ్యూహాత్మక సార్వ భౌమత్వ బలోపేతం తదితరాలు ప్రజా శ్రేయస్సు, జాతీయ భద్రత వంటి అంశాలపై ఆధారపడి ఉన్నాయి. ఈ దిశగా కొత్త సంకల్పాల సాకారానికి, పరస్పర పూరక బలాల ఏకీ కరణ సహా ద్వైపాక్షిక బంధాన్ని మరింత పటిష్ఠంగా, వైవిధ్యభరితంగా తీర్చిదిద్దడంపై మా నిబద్ధతను పునరుద్ఘాటిస్తున్నాం. డిజైన్, తయారీ నైపుణ్యం, అంతర్జాతీయ స్థాయి సూపర్ కంప్యూటర్లతో పారిశ్రామిక కూడలిగా ప్రపంచంలో ఇటలీకి ప్రముఖ స్థానం ఉంది. అదే విధంగా 100కు పైగా యూనికార్న్ సంస్థలు సహా 2,00,000 అంకుర సంస్థలతో భారత్ శరవేగంగా ఆర్థిక వృద్ధిని సాధిస్తోంది. రెండు దేశాలకు గల ఈ సామర్థ్యాల మధ్య శక్తిమంతమైన సమన్వయ సాధన లక్ష్యాన్ని మేం నిర్దేశించుకున్నాం.

### మేడ్ ఇన్ ఇటలీ.. మేక్ ఇన్ ఇండియా..

ద్వైపాక్షిక వాణిజ్యం, పెట్టుబడులు ఇనుమడించేందుకు ఐరోపా సమాఖ్య-భారత్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం ( ఎఫ్‌టీఏ) బాటలు వేస్తుంది. తద్వారా 2029 నాటికి ఇటలీ-భారత్ మధ్య నిర్దేశిత 20 బిలియన్ యూరోల వాణిజ్య లక్ష్యాన్ని అధిగమించాలన్నది మా ఆకాంక్ష. "మేడ్ ఇన్ ఇటలీ" అనేది అంతర్జాతీయంగా అత్యుత్తమ నాణ్యతకు పర్యాయ పదబంధం. ఇప్పుడిది "మేక్ ఇన్ ఇండియా" కార్యక్రమ నిర్దేశిత ఉన్నత నాణ్యత లక్ష్యంతో సహజ సమన్వయం ఏర్పరుచుకుంటుంది. ఇటలీలో భారత పరిశ్రమల సంఖ్య కూడా పెరగడం (ప్రస్తుతం రెండువైపులా వీటి సంఖ్య 1000కి పైగానే) మా సరఫరా వ్యవస్థల ఏకీకరణను బలోపేతం చేసే సానుకూల సంకేతం.

### కృత్రిమ మేధ.. సాంకేతిక విప్లవం..

ఏఐ, క్వాంటం కంప్యూటింగ్, అత్యాధునిక తయారీ, కీలక ఖనిజాలు, డిజిటల్ మౌలిక సదుపాయాలు వంటి రంగాల్లో నేటి పురోగమన వేగం రాబోయే దశాబ్దాల్లో అసాధారణ పరిధిగల సాంకేతిక విప్లవంగా రూపుదిద్దుకోగలదు. ఈ క్రమంలో చైతన్యవంతమైన భారత ఆవిష్కరణావరణ వ్యవస్థ, అత్యంత నైపుణ్యం గల వృత్తి నిపుణుల వనరులు, ఇటలీకి గల అత్యధునాతన పారిశ్రామిక సామర్థ్యం మేళవింపుతో పైన పేర్కొన్న రంగాలన్నిటా మా సహకారం





సహజసిద్ధమైనదిగా, వ్యూహాత్మకంగా రూపొందుతుంది.

### కృత్రిమ మేధ రంగం..

మానవ కేంద్రక సాంకేతిక అభివృద్ధి కోసం భారత్, ఇటలీ కలిసి పనిచేస్తున్నాయి. 'ఏఐ'ను ముఖ్యంగా వర్ధమాన దేశాల ప్రగతికి ఉపయోగపడే సాధనంగా భావిస్తూ, భారత్ 'మానవ్' విధానాన్ని, ఇటలీ మానవ-కేంద్రక 'అల్గార్-ఎథిక్స్'ను ప్రోత్సహిస్తున్నాయి. కృత్రిమ మేధ పరిజ్ఞానం సామాజిక సాధికారతను ఉత్తేజితం చేయాలన్నది మా భాగస్వామ్యం నిర్దేశించుకున్న లక్ష్యం.

### మానవ మేధ సృష్టించిన ఉపకరణం.. ఏఐ

డిజిటల్ సహకారం, సైబర్ మౌలిక సదుపాయాల బలోపేతంతో ప్రతి దేశం 'ఏఐ'ను అభివృద్ధి చేసుకోవాలని భారత్, ఇటలీ భావిస్తున్నాయి. ఇటలీ జి7 అధ్యక్షతకు, న్యూఢిల్లీలో నిర్వహించిన 'ఏఐ ఇంపాక్ట్ సమ్మిట్-2026' సత్ఫలితాలకు మూలం ఈ సంయుక్త దృక్పథమే. కృత్రిమ మేధను మానవాళి కోసం.. మానవ మేధ సృష్టించిన ఉపకరణంగా మాత్రమే భావించాలి. అంతరిక్ష పరిశోధన, ఉపగ్రహ సాంకేతికతలలో భారత్ ఇప్పటికే అద్భుత ప్రగతి సాధించింది. ఇప్పుడిక ఇటలీ ఏరోస్పేస్ ఇంజనీరింగ్ నైపుణ్యం తోడ్పాటుతో సంయుక్త కార్యక్రమాలు చేపట్టడం సహా భవిష్యత్తరం సాంకేతిక పరిజ్ఞానాల రూపకల్పనకు గణనీయ అవకాశాలు అందివస్తాయి.

### పునరుత్పాదక రంగంలో సహకారం..

గ్రీన్ హైడ్రోజన్ ఎగుమతుల కూడలిగా మారడం కోసం భారత్ కృషి ఫలితంగా మా భాగస్వామ్యానికి అసాధారణ సామర్థ్యం సమకూరుతోంది. పునరుత్పాదక మౌలిక సదుపాయాల కల్పనలో ఇటలీకిగల అత్యాధునిక సాంకేతికతతోపాటు ఐరోపాకు ఇంధన ముఖద్వారంగా దాని వ్యూహాత్మక పాత్రకు ఇది సంపూర్ణంగా తోడ్పడుతుంది. ఈ నేపథ్యంలో భారత్ నేతృత్వాన ఏర్పడిన అంతర్జాతీయ సౌర కూటమి (ఐఎస్ఏ), విపత్తు పునరుత్థాన మౌలిక సదుపాయాల కూటమి (సీడీఆర్ఐ), అంతర్జాతీయ జీవఇంధన కూటమి (జీబీఏ) వంటి సంకీర్ణ సంస్థల కృషిలో ఇతర దేశాలతోపాటు మా సహకారం కూడా కీలకం.

### ఒక ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యం

అంతర్జాతీయ ఆర్థిక వ్యవస్థకు కీలక కేంద్రాలైన ఇండో-పసిఫిక్, మధ్యధరా ప్రాంతాల నడిబొడ్డున భారత్, ఇటలీ ఉన్నాయి. హిందూ మహాసముద్రాన్ని ఐరోపాతో ముడిపెట్టే వాణిజ్య, సాంకేతిక, ఇంధన, డేటా సహా సమాలోచనలకు కీలక మార్గమైన భారత-మధ్యధరా ప్రాంతం ఆవిర్భావానికి మా రెండు దేశాలే ప్రత్యక్ష సాక్షులు.. సరిగ్గా ఈ పరస్పర సంధాన క్రమంలోనే మన స్నేహబంధం సహజ రీతిలో ఒక ప్రత్యేక వ్యూహాత్మక భాగస్వామ్యంగా పరిఢవిల్లుతూ- రెండు ఖండాలను కలిపి, కొత్త ప్రపంచ గమనానికి రూపుదిద్దుతుంది. నేటి పరస్పర సంధాన డిజిటల్ యుగంలోనూ 'వసుధైవ కుటుంబకం' సూత్రం మానవాళి మొత్తాన్నీ ముడివేయడంలో శక్తిమంతంగా పనిచేస్తుంది. పునరుజ్జీవన పథంలో పయనించే ఇటలీ మానవతావాద సంప్రదాయం కూడా ఈ విలువలను సహజంగా ప్రతిబింబిస్తుంది. అందుకే, రెండు దేశాల ప్రజలకు కేంద్ర స్థానమిస్తూ బలమైన, భవిష్యత్ దృక్కోణ సహిత భారత్-ఇటలీ వ్యూహాత్మక భాగస్వామ్యానికి పునాది వేయాలని మా సంయుక్త దార్శనిక లక్ష్యనిర్దేశం చేసుకుంది.

# బాలికలకు భరోసా అందరి బాధ్యత

సమాజం పురోగతికి నిజమైన కొలమానం మహిళలకు, ముఖ్యంగా బాలికలకు లభించే భద్రత, గౌరవం, న్యాయంలోనే ఉంటుంది. ఇటీవల వెలుగులోకి వచ్చిన మన రాష్ట్రానికి చెందిన కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి కుమారుడిపై పోక్సో కేసు నమోదు కావటం ఒక చేదు నిజాన్ని బట్టబయలు చేసింది. చట్టాలు ఎన్నో ఉన్నా, సెక్షన్లు ఎన్నెన్ని ఉన్నా, పోరాటాలు ఎన్ని జరిగినా..అధికార బలం, అంగబలం, ఆర్థిక బలం ఉన్నవారి ఎదుట బాధితులు ఇంకా న్యాయం కోసం పోరాడాల్సిన పరిస్థితి పూర్తిగా మారలేదని ఈ ఘటన స్పష్టం చేసింది. చట్టం లక్ష్యం ఏమిటి? వాస్తవం ఏమిటి? పోక్సో చట్టం ఒక స్పష్టమైన లక్ష్యంతో రూపొందింది. 18 ఏండ్లలోపు బాలికలను లైంగిక నేరాల నుంచి రక్షించటం, నేరస్థులపై కఠిన శిక్షలు విధించటం, మైనర్లకు అనుకూలమైన విచారణ వాతావరణాన్ని కల్పించటం, వారి గోప్యతను కాపాడటం, త్వరితగతిన న్యాయం అందించటం. తాజాగా పోక్సో కేసు వెలుగుచూసిన తర్వాత ప్రజల మనసులో మెదిలే ప్రశ్న ఒక్కటే..చట్టాలు పుస్తకాల్లో ఉన్నంత బలంగా క్షేత్రస్థాయిలో అమలవుతున్నాయా? మైనర్ బాలికపైనే విచారణ ఎందుకు? ఒక బాలిక ధైర్యంగా తనకు జరిగిన అన్యాయాన్ని బయటపెట్టినప్పుడు, సమాజం ఆమెకు అండగా నిలబడాలి. కానీ మనం చూస్తున్నది దానికి పూర్తి విరుద్ధం. ఆమె వయస్సును ప్రశ్నించటం, కుటుంబాన్ని అవమానించటం, వ్యక్తిత్వ హననానికి దిగజారటం వంటి చర్యలు అమానుషం. అంతకంటే బాధాకరమైన విషయం ఏమిటంటే, కొంతమంది రాజకీయ నేతల అనుచరులు, డబ్బులు తీసుకుని పనిచేసే సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్లు ఆ బాలిక, ఆమె కుటుంబం గురించి తప్పుడు కథనాలను వ్యాప్తి చేస్తూ, ఆరోపణల తీవ్రతను తగ్గించే ప్రయత్నం చేయటం. ఆమె విశ్వసనీయతను దెబ్బతీయడానికి ప్రత్యామ్నాయ కథనాలు సృష్టించటం సమాజం సిగ్గుపడాల్సిన విషయం. పోక్సో చట్టం మైనర్ల గౌరవాన్ని కాపాడటమే లక్ష్యంగా పెట్టుకున్నది. అలాంటప్పుడు అదే గౌరవాన్ని బహిరంగంగా దెబ్బతీయటం మరింత ఆందోళనకరం. ఈ కేసులో ఆరోపణల తీవ్రత




ఉన్నప్పటికీ, ఎఫ్ఐఆర్ ఆలస్యంగా నమోదు కావటం, నిందితుడిని వెంటనే అరెస్టు చేయకపోవటం తీవ్ర ఆందోళన కలిగిస్తున్నది. ఇదే స్థానంలో ఒక సాధారణ వ్యక్తి ఉంటే ఇదే విధానం ఉండేదా? అనే ప్రశ్న అనివార్యంగా తలెత్తుతున్నది. ఈ సంఘటన బయటపెట్టిన చేదునిజాలు కొన్ని సందర్భాల్లో ప్రధాన మీడియా పూర్తిగా మౌనం వహించగలదు. రాజకీయ పలుకుబడి, అధికారం దర్యాప్తులను ప్రభావితం చేసే ప్రమాదం ఉన్నది. న్యాయవ్యవస్థపై ప్రజల విశ్వాసం దెబ్బతింటే, అది ప్రజాస్వామ్యానికే ముప్పు. న్యాయం కోరుతున్న ఒక బాలికపై వేసిన నిందలు, రకరకాల వేధింపులు మన సామాజిక బాధ్యతారాహిత్యానికి నిదర్శనంగా నిలుస్తున్నాయి. వ్యవస్థలు మౌనం వహించిన ఈ చీకటిలో ఆశ చూపింది ఒక్కటే..ప్రజల గొంతు. సామాజిక మాధ్యమాల వేదికగా సామాన్య పౌరులు చేసిన నిరంతర పోరాటం, ప్రశ్నించటం, ఒత్తిడి తేవటం వల్లే ఈ కేసు ముందుకు సాగింది. ఈ విషయాన్ని ప్రజా చర్చలో సజీవంగా ఉంచింది ప్రజలే. ఈ ఒత్తిడి లేకపోతే కేసు ఇంత దూరం వచ్చేదా? అరెస్టులు జరిగేవా? అనే ప్రశ్నలు ప్రజల్లో సహజంగానే తలెత్తుతున్నాయి. ఇది రాజకీయ అధికార దుర్వినియోగంపై ప్రజల ఐక్యత సాధించిన విజయం. న్యాయంపై నమ్మకం నిలవాలంటే నిందితుడి అరెస్టు కేవలం ఆరంభం మాత్రమే; అంతిమ న్యాయం కాదు. కేసు ఇంకా కొనసాగుతున్నది. పలుకుబడి ఉన్న రాజకీయ కుటుంబానికి చెందిన వ్యక్తి ఆరోపణలు ఎదుర్కొంటున్నప్పుడు, దర్యాప్తు పూర్తిగా పారదర్శకంగా, ఎలాంటి జోక్యం లేకుండా జరగాలి. ఈ నేపథ్యంలో సంబంధిత కేంద్ర మంత్రి నైతిక బాధ్యత వహించి తన పదవికి రాజీనామా చేయాలి. ఇది రాజకీయ డిమాండ్ కాదు; న్యాయ ప్రక్రియపై ప్రజల విశ్వాసాన్ని నిలబెట్టటానికి అవసరమైన చర్య. ఆ వ్యక్తి అధికారంలో ఉన్నంతకాలం దర్యాప్తు పూర్తిగా స్వతంత్రంగా జరుగుతుందని ప్రజలకు నమ్మకం కల్పించటం కష్టం. ఒక బాలికకు న్యాయం జరిగేలా చూడటానికి, దర్యాప్తుపై ప్రత్యక్షంగా గానీ, పరోక్షంగా గానీ ఎలాంటి ప్రభావం ఉండకూడదు. పదవి కంటే న్యాయం గొప్పది. అధికారం కంటే చట్టం గొప్పది. ముగింపు: ఇది కేవలం ఒక బాలిక వ్యక్తిగత విషయం కాదు. ఇది మన కుమార్తెల భవిష్యత్తు, భద్రతకు సంబంధించిన ప్రశ్న. 'నువ్వు ఒంటరివి కావు, నీ వెనుక సమాజం ఉన్నది' అనే నమ్మకాన్ని ప్రతి బాలికకు కల్పించాల్సిన బాధ్యత మనందరిది. న్యాయం కోసం పక్షపాతాలకు అతీతంగా ఐక్యంగా నిలబడటం మనందరి సామాజిక బాధ్యత. బాలికకు దక్కాల్సిన గౌరవం, రక్షణ, న్యాయం..ఇవి రాజకీయ నినాదాలు కాదు; రాజ్యాంగం కల్పించిన హక్కులు.

# మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పై చేసిన అవినీతి ఆరోపణలను ఖండించిన మార్కాపురం జనసేన పార్టీ ఇంచార్జ్ ఇమ్మడి కాశీనాథ్




మార్కాపురం **ఆంధ్రజననాడు,మే 20 :** మార్కాపురం పట్టణం స్థానిక ప్రెస్‌క్లబ్ నందు జనసేన పార్టీ మార్కాపురం నియోజకవర్గ ఇన్‌ఛార్జ్ శ్రీ ఇమ్మడి కాశీనాథ్ గారు మీడియా సమావేశం నిర్వహించి, పార్టీకి చెందిన ప్రచార కోఆర్డినేటర్‌గా ఉన్న జడ బాలనాగేంద్ర గారు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి పై చేసిన అవినీతి ఆరోపణలను తీవ్రంగా ఖండించారు. ఈ సందర్భంగా ఇమ్మడి కాశీనాథ్ గారు మాట్లాడుతూ, ఇటీవల ఒంగోలులో జరిగిన మీడియా సమావేశంలో బాల నాగేంద్ర, మాజీ మంత్రి వర్యులు శ్రీ, జనసేన నాయకులు బాలినేని శ్రీనివాసరెడ్డి గారిని మరియు వారి కుటుంబ సభ్యులపై అవినీతి ఆరోపణలు చేయడం దురదృష్టకరమని , ఇలాంటి ఆరోపణలు పార్టీ ప్రతిష్టను దెబ్బతీసే విధంగా ఉన్నాయని, గతంలో బాలినేని శ్రీనివాసరెడ్డి గారిని ప్రశంసించిన బాల నాగేంద్ర, కొద్ది రోజుల్లోనే తన వైఖరిని మార్చుకోవడం అనుమానాస్పదంగా ఉందన్నారు. ఎవరో ప్రభావం వల్ల లేదా ఇతర ప్రయోజనాల కోసం ఈ విధంగా ఆరోపణలు చేస్తున్నారనే సందేహం వ్యక్తం చేశారు. అదేవిధంగా, జనసేన పార్టీకి ఇటీవల కొత్త ఉత్సాహం వచ్చిందని, ముఖ్యంగా ఒంగోలు మరియు పశ్చిమ ప్రాంతాల్లో పార్టీ బలపడుతుందని తెలిపారు. జనసేన పార్టీ అధినేత శ్రీ పవన్ కళ్యాణ్ గారి మార్గ దర్శకత్వంలో కొత్త కమిటీలను ఏర్పాటు చేసి, పార్టీని మరింత బలోపేతం చేయాలని ప్రయత్నాలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ సమావేశంలో శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి దేవస్థాన కమిటీ సభ్యులు విజయరావు నరసింహరావు, తర్లుపాడు మండల అధ్యక్షులు చేతుల శ్రీనివాసులు, జిల్లా కార్యదర్శి శిరిగిరి శ్రీనివాసరావు, మార్కాపురం ఏఎంసీ డైరెక్టర్ పిన్నెబోయిన లక్ష్మీ రాజ్యం, శ్రీ లక్ష్మీ చెన్నకేశవ స్వామి వారి దేవస్థాన కమిటీ సభ్యులు మండ్ల వెంకటయ్య, జనసేన నాయకులు పిన్నెబోయిన శ్రీనివాసులు, ఉమ్మడి రవీంద్ర, కంబం వెంకట రమణ, బెల్లంకొండ గోపి, ఎం.ఎన్. రెడ్డి, కృష్ణవేణి, వాసవి ప్రియ, మట్టం శ్రీనివాసులు, జిల్లా ప్రోగ్రామ్ కమిటీ సభ్యులు వీరిశెట్టి శ్రీనివాసులు, జనసేన నాయకులు మరియు కార్యకర్తలు పాల్గొన్నారు.

# శెట్టూరులో వైయస్ఆర్ కాంగ్రెస్ పార్టీ 'రాజకీయ పాఠశాల' విజయవంతం

## బూత్ ఏజెంట్లలో నూతన ఉత్సాహం నింపిన డాక్టర్ తలారి రంగయ్య




శెట్టూరు,**ఆంధ్రజననాడు,మే 20 :** శెట్టూరు మండల కేంద్రంలోని వైసీపీ నాయకుడు చాటాకుల రామాంజినేయులు గారి తోటలో "రాజకీయ పాఠశాల" పేరుతో పై బూత్ లెవల్ ఏజెంట్లకు నిర్వహించిన అవగాహన సమావేశం విజయవంతమైంది. ఈ సమావేశానికి కళ్యాణదుర్గం నియోజకవర్గ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ సమన్వయకర్త, మాజీ పార్లమెంట్ సభ్యులు, డాక్టర్ తలారి రంగయ్య గారు ముఖ్య అతిథిగా హాజరై బూత్ లెవల్ ఏజెంట్లకు భరోసా కల్పించారు ఈ సందర్భంగా డాక్టర్ తలారి రంగయ్య గారు బూత్ ఏజెంట్లను ఉద్దేశించి మాట్లాడుతూ... పార్టీకి క్షేత్రస్థాయిలో మీరే బలమని, ఎన్నికల సంఘం నిర్వహించే ာజూవఎఋశ్రీ ప్రక్రియలో మీ పాత్ర కీలకమని కొనియాడారు. 2025 ఓటరు జాబితా పరిశీలన, కొత్తగా 18 ఏళ్లు నిండిన యువతను ఓటరుగా చేర్పించడం, డబుల్ ఎంట్రీలు, నకిలీ ఓట్లను గుర్తించి తొలగించేలా చూడాలని సూచించారు ప్రతి బూత్ ఏజెంట్ తమ బూత్‌లో ఉన్న ప్రతి ఓటరు వివరాలపై పూర్తి స్పష్టతతో ఉండాలని, దీూా నియామకం నుండి ఖీఅఋశ్రీ ఓటరు లిస్టు వరకు అప్రమత్తంగా పనిచేయాలని పిలుపునిచ్చారు. డాక్టర్ తలారి రంగయ్య గారి స్పష్టమైన దిశానిర్దేశంతో బూత్ ఏజెంట్లలో నూతన ఉత్సాహం నెలకొంది వైఎస్ జగన్ మోహన్ రెడ్డి గారి నాయకత్వంలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు క్షేత్రస్థాయిలో ఇలాంటి శిక్షణా తరగతులు ఎంతగానో ఉపయోగపడతాయని పాల్గొన్న నాయకులు అభిప్రాయపడ్డారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గంలోని వివిధ మండలాల కన్వీనర్లు, బూత్ లెవల్ ఏజెంట్లు,ూ=జూ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

# ఎర్రగొండపాలెం లో దారుణ హత్య

ఎర్రగొండపాలెం **ఆంధ్రజననాడు,మే 20 :** ఎర్రగొండపాలెం గ్రామంలోని దిగుడు ఆంజనేయులు అనే వ్యక్తి ఈ నెల 13వ తేదీ నుండి కనిపించడం లేదని వారి బంధువులు స్థానిక ఎర్రగొండపాలెం పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేశారు. ఫిర్యాదు స్వీకరించిన పోలీసులు అదృశ్యం అయిన వ్యక్తి కోసం గాలింపు చర్యలు చేయగా దిగుడు ఆంజనేయులు హత్య చేయబడినట్లుగా బుధవారం పోలీసులు గుర్తించారు. ఎర్రగొండపాలెం గ్రామంలోని ఇందిరమ్మ కాలనీలో ఉంటున్న వెంకట్ నారాయణ అతని భార్య తన కుమార్తెతో దిగుడు ఆంజనేయులు అనే వ్యక్తి అక్రమ సంబంధం పెట్టుకొని మరియు బ్లాక్ మెయిల్కు పాల్పడుతున్నారని భావించి పథకం ప్రకారం ఆంజనేయులును హత్య చేసి మృతదేహాన్ని ముక్కలు ముక్కలు చేసి బోరుబావిలో పడేసినట్లు పోలీసులు గుర్తించారు. నిందితులను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు.

# మే21 మరియు 22వ తేదీలలో అనంతపురం జిల్లాలో ఆం.ప్ర రాష్ట్ర మైన్స్ అండ్ జియాలజి మరియు ఎక్సైజ్ శాఖ మంత్రి కొల్లు రవీంద్ర పర్యటన



అనంతపురము, **ఆంధ్రజననాడు,మే 20 :** ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గనులు మరియు భూగర్భ శాఖ, ఎక్సైజ్ శాఖ మంత్రి వర్యులు కొల్లు రవీంద్ర గారు ఈ నెల21 సాయంత్రం 6.30 గం.లకు అనంతపురం జిల్లాకు చేరుకుని రాత్రి బస చేసి, 22న కలెక్టరేట్ లో ఉదయం 10 గం.ల నుండి 11:00 వరకు గనులు మరియు భూగర్భ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం, ఉదయం 11 నుండి మధ్యాహ్నం 12 వరకు ప్రొహిబిషన్ మరియు ఎక్సైజ్ శాఖ అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహిస్థారని, మధ్యాహ్నం భోజనం అనంతరం 03 గం.ల కు అనంతపురము నుండి రోడ్డు మార్గం ద్వారా బెంగళూరుకు తిరుగు ప్రయాణం అవుతారనీ అనంతపురము జిల్లా కలెక్టర్ ఓ.ఆనంద్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

# టిడిపిలో విశేష సేవలు అందించిన వడ్డే వెంకటేశులుకు "శ్రమశక్తి పురస్కారం" ప్రదానం




అనంతపురం, **ఆంధ్రజననాడు,మే 20 :** తెలుగుదేశం పార్టీ టిఎన్టియుసి ఆధ్వర్యంలో కార్మిక సంక్షేమం, పార్టీ బలోపేతం కోసం విశేషంగా సేవలందించిన టిఎన్టియుసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కుంచపు వడ్డే వెంకటేశులు కు ఉత్తమ యాజమానుల పురస్కారాల ప్రధాన దినోత్సవం సందర్భంగా "శ్రమశక్తి పురస్కారం 2026" ను ఘనంగా ప్రదానం చేశారు. విజయవాడ తుమ్మల పల్లి కళాక్షేత్రం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కార్మిక శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన "శ్రమశక్తి పురస్కారాల ప్రదానోత్సవం 2026" కార్యక్రమంలో ఈ అవార్డు అందజేయడం జరిగింది. కార్మికుల సమస్యల పరిష్కారం, సంక్షేమ పథకాల అమలు, పార్టీ అభివృద్ధికి చేసిన కృషిని గుర్తించి ఈ పురస్కారం అందించినట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ పురస్కార అవార్డు జ్ఞాపికను ముఖ్య అతిథికార్మిక శాఖ మంత్రి,శ్రీ వాసంశెట్టి సుభాష్, అదేవిధంగా ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర భవన, ఇతర కార్మికుల సలహా కమిటీ చైర్మన్ గొట్టుముక్కల రఘురామరాజు, కార్మిక బోర్డు చైర్మన్ వెంకట శివుడు యాదవ్, శేషగిరి రావు (ఐఏఎస్), కార్మిక శాఖ కమీషనర్ గంధం చంద్రుడు చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా పలువురు టిడిపి నాయకులు, టిఎన్టియుసి ప్రతినిధులు, పారిశ్రామిక వేత్తలు మాట్లాడుతూ.. రాష్ట్ర వ్యాప్తంగా కార్మిక హక్కుల పరిరక్షణలో ఆయన చేసిన సేవలు అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో కార్మికులకు అండగా నిలవాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో టీడీపీ పార్టీ నాయకులు, కార్మిక సంఘాల ప్రతినిధులు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఫ్యాక్షన్‌కు దూరంగా ఉండి ప్రశాంత జీవనం గడపాలి

## ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాల్లో జిల్లా ఎస్పీ పర్యటన




రామగిరి, **ఆంధ్రజననాడు,మే 20 :** అందరూ ఐక్యంగా జీవించాలి యువత నేరాలకు దూరంగా ఉంటేనే ఉజ్వాల భవిష్యత్తు ప్రజల భాగస్వామ్యంతో ప్రధాన కూడలిలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోండి దేవాలయాల భద్రత మన అందరి బాధ్యత ప్రశాంత వాతావరణమే కుటుంబాల అభివృద్ధికి పునాది శ్రీ సత్య సాయి జిల్లా ఎస్పీ ఎస్ సతీష్ కుమార్ ఐపీఎస్ శ్రీ సత్యసాయి జిల్లా కనగానపల్లి మండలంలోని ఫ్యాక్షన్ ప్రభావిత గ్రామాలైన తగరకుంట, బద్దలాపురం గ్రామాల్లో మంగళవారం రాత్రి జిల్లా ఎస్పీ శ్రీ ఎస్. సతీష్ కుమార్ ఐపీఎస్ గారు పోలీసు అధికారులతో కలిసి పర్యటించారు. ముందుగా కనగానపల్లి పోలీస్ స్టేషన్‌ను సందర్శించిన జిల్లా ఎస్పీ గారు, శాంతి భద్రతల పరిస్థితులపై అధికారులతో సమీక్షించారు. నంతరం, తగరకుంట, బద్దలాపురం గ్రామాల్లోని ప్రధాన వీధులు, కాలనీలు, దేవాలయాలను పరిశీలించి గ్రామస్తులు, యువతతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ, పాత కక్షలు, కుటుంబ విభేదాలు, ఫ్యాక్షన్ గొడవలు గ్రామాల అభివృద్ధికి ఆటంకమని తెలిపారు. యువత నేరాలకు, చెడు స్నేహాలకు, మద్యం వంటి వ్యసనాలకు దూరంగా ఉండాలని సూచించారు. కేసులు నమోదైతే భవిష్యత్తులో ఉద్యోగ, విద్యావకాశాలు కోల్పోయే ప్రమాదం ఉంటుందని హెచ్చరించారు.తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తనపై శ్రద్ధ పెట్టి విద్యకు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు. గ్రామాల్లో ప్రజలు ఐక్యంగా జీవిస్తూ శాంతియుత వాతావరణాన్ని కొనసాగించాలని సూచించారు. ప్రధాన కూడళ్లలో ప్రజల భాగస్వామ్యంతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసుకోవాలని, దేవాలయాల భద్రత మన అందరి బాధ్యతగా భావించి అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. నగదు, బంగారం, వెండి వస్తువులను బ్యాంకుల్లో భద్రపరచాలని సూచించారు. అనుమానాస్పద వ్యక్తులు లేదా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే ఘటనలు గమనించిన వెంటనే పోలీసులకు సమాచారం ఇవ్వాలని ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ప్రజల రక్షణకు పోలీసు శాఖ ఎల్లప్పుడూ కట్టుబడి ఉంటుందని జిల్లా ఎస్పీ గారు తెలిపారు.గ్రామాల్లో ప్రతి ఒక్కరూ కలిసి మెలిసి ఐక్యమత్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో రామగిరి సీఐ మహమ్మద్ అలీ, ఎస్సై రిజ్వాన్, పోలీసు సిబ్బంది, గ్రామ పెద్దలు, గ్రామస్తులు పాల్గొన్నారు

# మాతృ మరణాలు శిశు మరణాలు పై సమీక్ష సమావేశం




అనంతపురం, **ఆంధ్రజననాడు,మే 20 :** అనంతపురంలో డిఎం అండ్ హెచ్ ఓ కార్యాలయంలో డాక్టర్ శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన జిల్లాలో జరిగిన మాతృ మరణాలు శిశు మరణాలు పై సమీక్ష సమావేశం నిర్వహించడం జరిగినది. ఇందులో , 6 శిశు మరణాలు పై సమీక్ష నిర్వహించడం జరిగింది. గ్రామస్థాయిలో పనిచేసినటువంటి ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు ముఖ్యంగా మాత శిశు సేవలపై శ్రద్ధ వహించి భవిష్యత్తులో జిల్లాలో ఎలాంటి మాత శిశు మరణములు జరగకుండా చూడాలని చెప్పడం జరిగినది. ముఖ్యముగా గర్భవతులకు మరియు బాలింతలకు ప్రభుత్వము నుంచి ఇచ్చు సేవలు పకడ్బందీగా నిర్వహించాలని గ్రామస్థాయిలో ప్రతి ఇంటిని సందర్శించి ఆ ఇంటిలో ఉన్న గర్భవతులు గాని బాలింతలు గాని చిన్న పిల్లలకు తగిన పరీక్షలు నిర్వహించి ప్రమాదకరమైన లక్షణములు కనిపించిన వెంటనే సంబంధిత వైద్యాధికారి వద్దకు తీసుకువెళ్లి పరీక్షలు చేయించి మందులు ఇప్పించి వాటిని క్రమం తప్పకుండా వాడేలా చూడాలని చెప్పడం జరిగింది. గ్రామస్థాయిలో ముఖ్యముగా వ్యాధి నిరోధక టీకాలు కార్యక్రమం చేపట్టినప్పుడు పిల్లలు వారి వయస్సు తగ్గ బరువు ఉన్నదా లేదా అని బరువులు చూడాలని మరియు వారి ఎత్తుకు తగ్గ బరువు కొలతలను ఎం సి హెచ్ కార్డు నందు నమోదు చేయాలని సూచించడం జరిగింది మరియు గర్భవతులు బాలింతలు మహిళా శిశు సంక్షేమ శాఖకు సంబంధించిన అంగనవాడి కేంద్రం నుండి పోషకాహారము తీసుకోవాలని అలాగే కాన్పు అయిన తర్వాత 180 రోజులు ఐరన్ మరియు క్యాల్షియం మాత్రలు వాడాలని చెప్పడం జరిగినది ప్రతి నెల 9వ తేదీ మరియు 10వ తేదీ పిఎంఎస్ఎంఏ ప్రోగ్రామ్ నందు కచ్చితంగా పీహెచ్ స్థాయిలో ఉన్న గర్భిణులకు వైద్య అధికారులకు తప్పక పరీక్ష చేయాలని మరియు అవసరమైన వారికి టిఫ స్కానింగ్ కు రిఫర్ చేయాలని దీని ద్వారా జన్యుపరమైన లోపములో గల పుట్టే పిల్ల లను నివారించవచ్చునని తెలియజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ డేవిడ్ సెల్వరాజ్ డిసిహెచ్ ఎస్ డాక్టర్ నవీన్ కుమార్ , మత్తుమందు వైద్యులు, డాక్టర్ దినకర్, చిన్నపిల్లల వైద్యులు, డాక్టర్ ప్రత్యూష, డాక్టర్ సౌజన్య ప్రమీల దేవి, హేమలత పాల్గొన్నారు.

## ఉరవకొండ నియోజకవర్గం...

# వజ్రకరూరు మండల కేంద్రం

## మహిళలు, చిన్నారుల భద్రతపై అవగాహన కార్యక్రమం అస్త్రస్త్ర

## స్త్రీరక్ష పోర్టల్, శక్తి టీమ్ & అత్యవసర సేవల వినియోగంపై అవగాహన




వజ్రకరూరు, **ఆంధ్రజననాడు,మే 20 :** జిల్లా ఎస్పీ పి. జగదీష్ గారిలి ఆదేశాల మేరకు... గుంతకల్లు డీఎస్పీ ఏ. శ్రీనివాస్ ఆధ్వర్యంలో వజ్రకరూరులో ఈరోజు మహిళల భద్రతపై విస్తృత అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న మహిళలను ఉద్దేశించి గుంతకల్లు డీఎస్పీ మాట్లాడారు. మహిళలపై జరుగుతున్న వివిధ రకాల నేరాలు, ముఖ్యంగా గృహహింస, వేధింపులు, సైబర్ మోసాలు, బాల్య వివాహాల వంటి అంశాలపై అధికారులు వివరంగా అవగాహన కల్పించారు. అలాగే, శక్తి టీమ్ సేవలు, మహిళల కోసం అందుబాటులో ఉన్న హెల్ప్‌లైన్ నంబర్లు, పోలీస్ స్టేషన్‌లో అందించే సేవల గురించి కూడా తెలియజేశారు. మహిళలు ఎలాంటి సమస్యలు ఎదుర్కొన్నా భయపడకుండా వెంటనే పోలీసులను సంప్రదించాలని, చట్టం వారికి పూర్తి రక్షణ కల్పిస్తుందని అధికారులు హితవు పలికారు. కుటుంబ మరియు సామాజిక స్థాయిలో మహిళల భద్రతకు అందరూ బాధ్యత వహించాలని సూచించారు. మహిళలు ప్రయాణాల్లో లేదా కొత్త ప్రదేశాల్లో ఉన్నప్పుడు అప్రమత్తంగా ఉండాలి. వేధింపులు లేదా అసభ్య ప్రవర్తన ఎదురైనప్పుడు భయపడకుండా వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయాలి. పోక్సో, తదితర చట్టాలు మరియు ఆస్తి హక్కుల వంటి చట్టపరమైన అంశాలపై కనీస అవగాహన పెంచుకోవాలి. అపరిచితుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్ లేదా మెసేజ్‌ల పట్ల జాగ్రత్తగా ఉండాలి. ముఖ్యంగా బ్యాంక్ వివరాలు లేదా వ్యక్తిగత సమాచారాన్ని పంచుకోకూడదని వివరించారు.బాల్య వివాహాలపై ప్రతి ఒక్కరూ అవగాహన కలిగి ఉండాలన్నారు. మహిళలు తమ హక్కులపై అవగాహన పెంపొందించుకుని, సురక్షితమైన సమాజ నిర్మాణంలో భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. అనంతపురం జిల్లా పోలీస్ శాఖ మహిళల భద్రతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందని... ఏదైనా సమస్యలు వచ్చినప్పుడు వెంటనే పరిధిలోని పోలీస్ స్టేషన్ కి లేదా ౹ 112 కి సమాచారం అందించాలని, తక్షణ సహాయం చేయడానికి పోలీస్ శాఖ ముందుంటుందని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సి.ఐ లు మహనంది, వెంకటేశ్వర్లు, ఎస్సైలు నాగస్వామి, ఖాజా, జణూూ శ్రీదేవి ,వజ్రకరూరు తహసీల్దార్ నరేష్ , వీ.జు.ాలు ఎర్రిస్వామి ,తిమ్మప్ప,ూౢా ాఎ్ష్రశీశీశ్రీ ఎవీ స్వర్ణలత ,జనూా లక్ష్మీదేవి, బ్రాంచ్ మేనేజర్ మోహన్ తదితరులు పాల్గొన్నారు.

# అనుమతులు లేని ఎన్.ఆర్.ఐ, రక్షంద జూనియర్ కళాశాలలపై చర్యలు తీసుకోవాలి: పీడీఎస్‌యూ.








అనంతపురం బ్యూరో , **ఆంధ్రజననాడు,మే 20 :** గుంతకల్ పట్టణంలో అనుమతులు లేకుండా నడుస్తున్న ఎన్.ఆర్.ఐ, రక్షంద జూనియర్ కళాశాలలపై తక్షణమే చర్యలు తీసుకోవాలని ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం (పీడీఎస్‌యూ) డిమాండ్ చేసింది. ఈ మేరకు బుధవారం ఆర్డీఓ కార్యాలయం చాంబర్ ఎదుట ధర్నా నిర్వహించి, డిప్యూటీ తహసీల్దార్ లక్ష్మీనారాయణకు వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా పీడీఎస్‌యూ నియోజకవర్గ కార్యదర్శి వి. వినోద్ మాట్లాడుతూ, అకాడమిక్ సంవత్సరం ప్రారంభం కాకముందే కొన్ని ప్రైవేట్ జూనియర్ కళాశాలలు ముందస్తు అడ్మిషన్లు చేపడుతూ విద్యార్థులు, తల్లిదండ్రులను తప్పుదారి పట్టిస్తున్నాయని ఆరోపించారు. సోషల్ మీడియా, పాంప్లెట్ల ద్వారా ఒక కళాశాల మరొక కళాశాలపై విమర్శలు చేస్తూ ప్రచారం నిర్వహిస్తున్నాయని తెలిపారు. పట్టణంలోని పేద ప్రజల ఇళ్లకు వెళ్లి మాయమాటలు చెప్పి విద్యార్థులను చేర్పించుకునే ప్రయత్నాలు జరుగుతున్నాయని అన్నారు. ఎన్.ఆర్.ఐ, రక్షంద జూనియర్ కళాశాలల్లో సరైన మౌలిక సదుపాయాలు కూడా లేవని, అయినప్పటికీ అనుమతులు మంజూరు కావడం అనుమానాలకు తావిస్తోందని విమర్శించారు. అనంతపురం జిల్లా ఆర్ఐఓ అధికారులు ఈ కళాశాలలపై ప్రత్యేక ప్రేమ చూపిస్తూ అనుమతులు ఇచ్చారని ఆరోపించిన ఆయన, వెంటనే విచారణ జరిపి అక్రమంగా నడుస్తున్న కళాశాలలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు. లేదంటే వందలాది మంది విద్యార్థులతో కలిసి ఆర్డీఓ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పీడీఎస్‌యూ నాయకులు రాజేష్, సాయి, అరవింద్, కమల్, ప్రభాస్, ఫిరోజ్, మనోజ్, సంతోష్, వినయ్, పవన్ తదితరులు పాల్గొన్నారు.

# "కాక్రోచ్ జనతా పార్టీ" పేరిట కొత్త పార్టీ ఏర్పాటు చేసిన నిరుద్యోగి

**ఆంధ్రజననాడు,మే 20 :** నిరుద్యోగులు బొద్దింకల్లా తయారయ్యారని సుప్రీం కోర్టు సీజేఐ చేసిన వ్యాఖ్యలకు వ్యతిరేకంగా ఈ పార్టీ ఏర్పాటు చేసినట్లు ప్రకటించిన 30 ఏళ్ల యువకుడు అభిజీత్ దీప్కే సెక్యులర్, సోషలిస్ట్, డెమోక్రటిక్, లేజి తమ నినాదమని, ప్రజల సొమ్ము ఎటు పోతుందో నిలదీసేందుకే పార్టీ పెట్టామని ప్రకటన ఈ పార్టీలో చేరాలంటే నిరుద్యోగం, సోమరితనం, సోషల్ మీడియాకు అతుక్కొని ఉండటం, వ్యవస్థపై ఆగ్రహాన్ని అద్భుతంగా ఎత్తిచూపే నైపుణ్యం కలిగి ఉండడం లాంటి అర్హతలు కావాలని ప్రకటన పార్టీ ప్రకటించిన అతికొద్ది రోజులకే దాదాపు లక్షకు పైగా సభ్యత్వాలు నమోదు కావడం గమనార్హం సీజేపీ పార్టీలో చేరడానికి టీఎంసీ ఎంపీ మహువా మొయిత్రా, మరో టీఎంసీ నేత(మాజీ క్రికెటర్), సామాజిక కార్యకర్త అంజలి భరద్వాజ్ లాంటి పలువురు ప్రముఖులు పార్టీలో చేరేందుకు సిద్ధంగా ఉన్నామని ట్వీట్ చేయడంతో అందరినీ స్వాగతిస్తామని తెలిపిన సీజేపీ అయితే ఈ పార్టీ నిజంగానే రాజకీయ పార్టీగా మారి దేశంలో జెన్జీ ఉద్యమంగా ఉద్భవిస్తుందా అని చర్చించుకుంటున్న రాజకీయ నిపుణులు ఎలా పనిచేయాలి అనే దానిపై త్వరలో ఆన్ లైన్ సదస్సు నిర్వహిస్తామని చెప్పారు.

# జి పి ఎల్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ ఫైనల్ మ్యాచ్ లకు ముఖ్యఅతిథిగా హాజరైన యువనేత గుమ్మనూరు ఈశ్వర్




గుత్తి **ఆంధ్రజననాడు,మే 20 :** గుత్తి పట్టణం గాంధీ సర్కిల్ దగ్గర ఉన్న ఫుట్బాల్ గ్రౌండ్ లో జిపిఎల్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ ఫైనల్ మ్యాచ్కు ముఖ్యఅతిథిగా హాజరైన గుంతకల్లు నియోజకవర్గం శాసనసభ్యులు గుమ్మనూరు జయరాం తనయుడు గుత్తి మరియు పామిడి ఇంచార్జ్ యువనేత గుమ్మనూరు ఈశ్వర్ ముందుగా యువనేతకు జి పి ఎల్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ ఆర్గనైజర్స్ ఘన స్వాగతం పలికారు యువనేత ఈశ్వర్ మ్యాచ్ ను తిలకించారు ఫైనల్ మ్యాచ్లో గుత్తి ఎల్లో స్టార్స్ వర్సెస్ రజాపురం కింగ్స్ రెండు టీములు తలబడడం జరిగింది ఫైనల్ మ్యాచ్ లో ముందుగా బ్యాటింగ్ చేసిన ఎల్లో స్టార్స్ టీం 92/7 రెండో బ్యాటింగ్ దిగిన రాజాపురం కింగ్స్ 75/9 నష్టపోయి ఎల్లో స్టార్ టీమ్ విన్నర్స్ గా నిలవడం జరిగినది రన్నర్సా రాజాపురం కింగ్స్ టీం నిలిచినది జిపిఎల్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ కు మొదటి బహుమతి గుత్తి పట్టణ అధ్యక్షులు ఎం.కె చౌదరి 50,000 రూపాయలు, రెండో బహుమతి గుత్తి ప్రభుత్వాసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు చికెన్ శీనా యాదవ్ 25,000 రూపాయలు అందించడం జరిగినది అలాగే ట్రోపి స్పాన్సర్స్ గుత్తి ప్రభుత్వ ఆసుపత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు యర్రగుడి రమేష్, ఆర్ఎస్ యువ నాయకుడు రాజా జిపిఎల్ క్రికెట్ ప్రీమియర్ లీగ్ కు టోర్నమెంట్ ఆర్గనైజర్స్ గా గుత్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ జక్కల చెరువు ప్రతాప్ , చెరుకూరి లక్ష్మణ్ చౌదరి, డాక్యుమెంట్ రైటర్ రామకృష్ణ, బండగేరి రవి, శశి వెంకట్ బోయ బాలకృష్ణ హెచ్ ఎం జిలాన్, వంశీ అందీయడం జరిగినది యువనేత ఈశ్వర్ మాట్లాడుతూ క్రీడలు ప్రోత్సహించడంలో మా గుమ్మనూరు ఫ్యామిలీ ముందు ఉంటుందని అలాగే గెలుపు ఓటములు సహజమని తెలియజేశారు ఇంకా ఇలాంటి క్రికెట్ టోర్నమెంటులో ఎన్నో పెట్టి యువతను ప్రోత్సహిస్తామని తెలియజేశారు గెలిచినవారు ఎక్కువ ఓడిన వారు తక్కువ కాదని అందరూ సమానులని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్రీడాకారులు మరియు గుత్తి పట్టణం మరియు మండలం కూటమి నాయకులు కార్యకర్తలు అనుబంధ కమిటీ సభ్యులు పెద్ద ఎత్తున హాజరు కావడం జరిగినది.

# జూనియర్ ఎన్టీఆర్ జన్మదిన సందర్భంగా 300 మందికి భోజనం ఏర్పాటు



గుత్తి **ఆంధ్రజననాడు,మే 20 :** గుత్తి పట్టణంలో నందమూరి తారక రామారావు 43వ జన్మదిన సందర్భంగా గుత్తి జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్ అసోసియేషన్ పట్టణ, మండల అధ్యక్షులు రాజు ,సాధిక, ఆధ్వర్యంలో గుత్తి అన్నా క్యాంటీన్ లో 300 మందికి ఉచితంగా భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో చిన్నంశెట్టి దేవేంద్ర, స్టోర్ డీలర్ ఈరన్న గౌడ్, బోయ బాలకృష్ణ ,హెచ్ ఎం నయుం, ఆల్ఫా మొన్న, రామ్ మోహన్, మస్తాన్, శ్రీనివాసులు, బాలకృష్ణ, అశోక్, నరేష్, బోర్ వెల్స్ నాగరాజు ,కరిటికొండ సుధాకర్, అంజన్ ప్రసాద్, బాచుపల్లి గాంధీ, విరాట్ సాయి, నాగేష్ రియాజ్, విశ్వ, పెద్దవడుగూరు శివ , ఫోటో స్టూడియో విజయ్, రాముడు, కళ్యాణ్, సూరి, రాజు, తదితరులు పాల్గొన్నారు.

# మజ్జిగ పంపిణీ చేసిన జూనియర్ ఎన్టీఆర్ ఫ్యాన్స్



గుత్తి **ఆంధ్రజననాడు,మే 20 :** గుత్తి పట్టణంలోని జూనియర్ ఎన్టీఆర్ 43వ జన్మదిన సందర్భంగా ఫుట్బాల్ గ్రౌండ్ నందు జిపిఎల్ క్రికెట్ టోర్నమెంట్ ఫైనల్ మాచ్ కి రా ఎన్టీఆర్ ఫ్యాన్స్ ఫోటో స్టూడియో రమేష్ మరియు వారి మిత్రబృందంతో కలిసి మ్యాచ్ చూడటానికి వచ్చిన ప్రేక్షకులకు రమేష్ వరి మిత్రబృందం కలిసి మజ్జిగ పంపిణీ చేశారు.

# యాడికిలో మెడికల్ షాపుల బంద్




యాడికి : ఆలిండియా మెడికల్ అసోసియేషన్ పిలుపుమేరకు యాడికి మెడికల్ రిటైల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో బుధవారం యాడికి లోని దాదాపు అన్ని మెడికల్ షాపులు బంద్ నిర్వహించారు. ఆన్‌లైన్‌లో డూప్లికేట్ మందులు, అధిక డిస్కౌంట్ విక్రయాలను వెంటనే నిలిపివేయాలని, కార్పొరేట్ మెడికల్ దోపిడీని అరికట్టాలని వారు డిమాండ్ చేశారు. తమ డిమాండ్లు నెరవేరకపోతే నిరవధిక సమ్మెకు దిగుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో పవన్, ఫణి, అర్జున్, ప్రకాష్, రమేష్, రంగనాయకులు, సురేంద్ర, శంకర్, హరి తదితరులు పాల్గొన్నారు. చిన్న చిన్న మెడికల్ షాపులను బ్రతకనివ్వాలని వారు ప్రభుత్వాన్ని కోరారు.

## గోరంట్ల మండలంలో కెమిస్టుల సమ్మె విజయవంతం



గోరంట్ల : గోరంట్ల మండలంలో ఆన్‌లైన్‌లో మందుల విక్రయాలను వ్యతిరేకిస్తూ నిర్వహించిన దేశవ్యాప్త సమ్మె విజయవంతంగా జరిగింది. అఖిల భారత కెమిస్టుల సమాఖ్య పిలుపు మేరకు చేపట్టిన ఈ సమ్మెకు శ్రీ సత్యసాయి జిల్లా కెమిస్ట్స్ అండ్ డ్రగ్గిస్ట్స్ అసోసియేషన్ సంపూర్ణ మద్దతు ప్రకటించింది. ఈ సందర్భంగా గోరంట్ల మండల మెడికల్ షాప్ అసోసియేషన్ ఆధ్వర్యంలో స్థానిక కెమిస్టులు ర్యాలీ నిర్వహించి తమ నిరసనను వ్యక్తం చేశారు. పట్టణంలోని ప్రధాన వీధుల గుండా ర్యాలీ సాగి అనంతరం మండల తహసీల్దార్ కార్యాలయం వద్దకు చేరుకుంది. అక్కడ మండల రెవెన్యూ అధికారి (ఎంఆర్వో)కు వినతిపత్రం సమర్పించారు. ఆన్‌లైన్ ద్వారా నియంత్రణ లేకుండా మందుల విక్రయాలు జరగడం వల్ల ప్రజల ఆరోగ్యానికి ప్రమాదం ఏర్పడే అవకాశముందని, అలాగే చిన్న మెడికల్ షాపుల జీవనోపాధిపై తీవ్ర ప్రభావం పడుతోందని కెమిస్టులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆన్‌లైన్‌లో మందుల విక్రయాలను తక్షణమే నిలిపివేయాలని, ఫార్మసీ రంగాన్ని రక్షించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో గోరంట్ల మండల మెడికల్ షాప్ అసోసియేషన్ అధ్యక్షుడు, కార్యదర్శి, సభ్యులు మరియు పలువురు కెమిస్టులు పాల్గొన్నారు

## పన్ను వసూళ్ల పెంపుపై సమీక్ష సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్



పుట్టపర్తి : పుట్టపర్తి కలెక్టరేట్ లో జిల్లాలో జీఎస్టీ, వృత్తి పన్ను (ప్రొఫెషనల్ టాక్స్) వసూళ్లను మరింత సమర్థవంతంగా పెంచాలని, ఇందుకు ప్రభుత్వంలోని అన్ని శాఖలు వాణిజ్య పన్నుల శాఖ (సిటి డిపార్ట్మెంట్) కు పూర్తి స్థాయిలో సహకరించాలని జిల్లా కలెక్టర్ శ్యాం ప్రసాద్ ఆదేశించారు. బుధవారం వాణిజ్య పన్నుల శాఖకు చెందిన ఉన్నతాధికారులు మరియు జిల్లా అధికారులతో కలిసి "సెంట్రల్ కో-ఆర్డినేషన్ కమిటీ" ప్రత్యేక సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశంలో కలెక్టర్ మాట్లాడుతూ ముఖ్యమైన ఆదేశాలు జారీ చేశారు. సీసీఎస్‌టీ ఉన్నతాధికారుల సూచనల ప్రకారం జిల్లాలో జీఎస్టీ రెవెన్యూను గణనీయంగా పెంచేందుకు జిల్లా స్థాయి అధికారులు మరియు వాణిజ్య పన్నుల శాఖ అధికారులు సమన్వయంతో ప్రత్యేక ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. జిల్లాలో బకాయి ఉన్న ప్రొఫెషనల్ టాక్స్ వసూళ్లను వేగవంతం చేయాలని, కలెక్షన్ల లక్ష్యాలను సకాలంలో పూర్తి చేయాలని స్పష్టం చేశారు. పన్నుల వసూళ్లు కేవలం ఒక్క శాఖకే పరిమితం కాకుండా, ప్రభుత్వంలోని అన్ని విభాగాలు వాణిజ్య పన్నుల శాఖకు అవసరమైన సమాచారాన్ని అందిస్తూ తగిన సహకారం అందించాలని కలెక్టర్ కోరారు. ఈ కార్యక్రమం లో అసిస్టెంట్ కమీషనర్ (ఎఫ్ఎసి డిప్యూటీ కమీషనర్)-స్వర్ణ లత, అసిస్టెంట్ కమీషనర్(పుట్టపర్తి సర్కిల్)-ఎం.చందు, సహాయకమిషనర్ (హిందూపూర్ సర్కిల్)-వై.కృష్ణవేణి, డివై.సహాయ కమీషనర్లు-ఎస్,గనులు శాఖ ఎడి అమీర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

## రాష్ట్ర క్రీడా పాఠశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పుట్టపర్తి : వైఎస్సార్ కడప జిల్లా పుట్లంపల్లిలోని రాష్ట్ర క్రీడా పాఠశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను 4 నుండి 9వ తరగతుల్లో ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి అర్హులైన విద్యార్థుల నుండి ఆన్‌లైన్ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి బి. కిషోర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. అర్హత శ్రీ సత్యసాయి జిల్లాకు చెందిన 4 నుండి 9వ తరగతి చదువుతున్న ఆసక్తి గల విద్యార్థులు ఎంపిక విధానం 4 నుండి 6వ తరగతి విద్యార్థులకు జిల్లా, రాష్ట్ర స్థాయిల్లో 7 నుండి 9వ తరగతి విద్యార్థులకు రాష్ట్ర స్థాయిలో ఎంపికలు ఉంటాయన్నారు. చివరి తేదీ జూన్ 02, 2026 లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. వెబ్‌సైట్ పూర్తి వివరాలకు https://apsportsschool.ap.gov.in/ సందర్శించగలరు.

## టీ కప్పుతో బలపడిన బంధం



యాడికి :యాడికి మండల కేంద్రంలోని నారాయణస్వామి కాలనీలో అంతర్జాతీయ టీ దినోత్సవం సందర్భంగా ఓ అరుదైన స్నేహబంధం అందరి దృష్టిని ఆకర్షిస్తోంది. వయసులు వేర్వేరు పనులు వేర్వేరు బాధ్యతలు వేర్వేరు అయినప్పటికీ ప్రతిరోజూ ఒకే సమయానికి కలిసి టీ తాగుతూ స్నేహానికి కొత్త అర్థం చెబుతున్నారు ఏడుగురు మిత్రులు. చింతా ఓబుల కొండయ్య ఆధ్వర్యంలో 75 సంవత్సరాల వయసు నుంచి 48 సంవత్సరాల వయసు గల ఈ బృందం దాదాపు ఆరు సంవత్సరాలుగా ప్రతిరోజూ ఉదయం 11 గంటలకు తప్పకుండా కలుసుకుంటున్నారు. చింతా ఓబుల కొండయ్య స్వయంగా తయారు చేసే టీతో మొదలయ్యే ఈ సమావేశం అరగంట పాటు నవ్వులు, సరదా సంభాషణలు, ఆత్మీయ పలకరింపులతో సందడిగా సాగుతుంది. రోజువారీ జీవితంలో ఎంత బిజీగా ఉన్నా ఈ టీ సమయాన్ని మాత్రం ఎవరూ మిస్ కావడం లేదని వారు చెబుతున్నారు. టీ అనేది కేవలం పానీయం మాత్రమే కాదని, మనుషుల మధ్య అనుబంధాలను మరింత దగ్గర చేసే మాధ్యమమని అభిప్రాయపడుతున్నారు. ప్రతిరోజూ కలిసి మాట్లాడుకోవడం వల్ల మానసిక ప్రశాంతతతో పాటు ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని తెలిపారు. ఆధునిక కాలంలో మనుషులు మనుషులకు దూరమవుతున్న తరుణంలో ఈ ఏడుగురు మిత్రుల ఆత్మీయత స్థానికులకు ఆదర్శంగా నిలుస్తోంది. వారి స్నేహబంధాన్ని చూసి కాలనీవాసులు అభినందనలు తెలుపుతున్నారు. ఈ బృందంలో చింతా ఓబుల కొండయ్య, దాసరి కృష్ణ, లింగం చంద్రశేఖర్, చారుగుండ్ల చెన్నప్ప, చింతా వెంకటయ్య, కాల్వ శ్రీనివాసులు, కుండా లక్ష్మీనారాయణ ఉన్నారు.

# వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ విజయవంతంపై హర్షం పలువురికి సన్మానం




ఓ డి చెరువు : మండల కేంద్రంలోని జాతీయ రహదారి సమీపంలో ఆదివారం తొలి తరం స్వాతంత్ర సమరయోధుడు, రేనాటి వీరుడు వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ విజయవంతమైన సందర్భంగా హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శులు దేవల్ల మురళి, సామకోటి ఆదినారాయణ, జిల్లా వడ్డెర సాధికారిత కమిటీ కన్వీనర్ పల్లపు రవీంద్ర, వడ్డెర్ల సంఘం జిల్లా అధ్యక్షులు వెంకటేష్ జిల్లా టిడిపి కార్యాలయం పుట్టపర్తిలో మంగళవారం విలేకరుల సమావేశం నిర్వహించారని తెలిపారు. వడ్డే ఓబన్న విగ్రహం ఏర్పాటు చేసేందుకు వడ్డెర సోదరులు ఎన్నో సవాళ్లు, ఆటుపోట్లు ఎదుర్కొని విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేసినందుకు రాష్ట్ర వడ్డెర కార్పొరేషన్ డైరెక్టర్ ఒలిపి శ్రీనివాసులు కమిటీకి అధికారులతో, ఎమ్మెల్యే పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డితో సమన్వయం చేసుకొని భూమి పూజ చేసిన చోటే విగ్రహం ఏర్పాటు చేసేందుకు అన్ని విధాలుగా అండగా ఉండి ప్రధాన భూమిక పోషించారని, నేషనల్ హైవే అధికారులు, రెవెన్యూ అధికారులు ఓబన్న విగ్రహం తొలగించాల్సిందేనని ఒత్తిళ్లకు గురిచేసిన ఒలిపి శ్రీనివాసులు, పల్లపు రవీంద్రలు ఉండగా నిలిచారన్నారు. విగ్రహం తొలగించాల్సి వస్తే ఎంతవరకైనా పోరాడుతామంటూ న్యాయస్థానానికి వెళ్లి హైకోర్టు న్యాయవాది వడ్డెర్ల ఆడపడుచు వేముల బేబీ రాణి స్టే తీసుకురావడం జరిగిందన్నారు. రాష్ట్ర టిడిపి కార్య నిర్వాహక కార్యదర్శులు ఎల్ఐసి నరసింహులు, జిల్లా టిడిపి ప్రధాన కార్యదర్శి హనుమప్ప, రాష్ట్ర వడ్డెర సంఘం నాయకులు సంజీవరాయుడు, బీసీ రమణ, ఓర్సు వీరభాస్కర్, డాబా గంగయ్య, తాడిపత్రి శ్రీరాములు, రామాంజనేయులు తదితరులు వెన్నంటే ఉండి వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణ కార్యక్రమాన్ని విజయవంతం చేశారు. పుట్టపర్తి శాసనసభ్యులు పల్లె సింధూర రెడ్డి, మాజీ మంత్రి పల్లె రఘునాథ్ రెడ్డి లక్ష రూపాయలు విరాళం అందించి తమ దాతృత్వాన్ని చాటుకున్నారని కొనియాడారు. వడ్డే ఓబన్న విగ్రహావిష్కరణలో పాలుపంచుకున్న విగ్రహ దాత దేరంగుల రవీంద్ర కల్పన దంపతులు, అన్నదాత బత్తల శ్రీనివాసులు, టైల్స్ దాత కుంచపు వీరభద్రతో పాటు ప్రతి ఒక్కరికి పేరుపేరునా ధన్యవాదాలు తెలిపారు. వడ్డెర్ల ఆత్మగౌరవం చాటుకునేలా ఈ కార్యక్రమాన్ని నిర్వహించిన కమిటీ సభ్యులకు శ్రీనివాసులు, దండగల చెన్నకేశవులు, మార్కెట్ యార్డ్ డైరెక్టర్ మస్తానమ్మ, ఆవుల గంగులప్ప, ఆర్టీసీ డ్రైవర్ కుంచపు జయచంద్ర, అడ్వకేట్ మంజునాథ్, కుంచపు విజయ్ కుమార్, దేరంగుల చలపతి, గోగుల వెంకటనారాయణ, జెరిపిటి వెంకటనారాయణ, దండగల వెంకటేశులు, పూజారి రంగనాయకులు, దామోదర్, బ్యాంకు శీనా, విడగొట్ట వీరాంజనేయులు, మల్లెల ఆంజనేయులు, పందిబోటు వెంకటేష్, వైభవి ఆంజనేయులు, చంద్ర, సుమన్ టీవి రాజు, నవాబు కోట నాగరాజు, జెరిపిటి వెంకటేష్ తో పాటు వడ్డెర కుల బంధువులకు అభినందనలు తెలిపారన్నారు.

# జిల్లాను ప్రగతి పథంలో నిలపాలి - జిల్లా కలెక్టర్ శ్యామ్ ప్రసాద్



పుట్టపర్తి : శ్రీ సత్య సాయి జిల్లాను ప్రగతి పథంలో ని లపాలని జిల్లా కలెక్టర్ శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ లో జిల్లాలోని 32 మండలాలకు సంబంధించి ఏప్రిల్ నెలకు గాను స్వచ్ఛ భారత్ మిషన్ (గ్రామీణ) 'సస' ప్రగతి ర్యాంకులను జిల్లా యంత్రాంగం వెల్లడించింది. గ్రామీణ ప్రాంతాల్లో పారిశుధ్యం, చెత్త సేకరణ, మరుగుదొడ్ల నిర్వహణ వంటి అంశాల ఆధారంగా ఈ ర్యాంకులు కేటాయించారు. 84 పాయింట్లతో మడకశిర, అమరాపురం మండలాలు సంయుక్తంగా మొదటి స్థానంలో నిలిచాయన్నారు. రొల్లా (83 పాయింట్లు) తర్వాతి స్థానంలో ఉందన్నారు. కేవలం 65 పాయింట్లతో హిందూపురం జిల్లాలోనే చివరి స్థానంలో (32వ ర్యాంకు) నిలిచిందన్నారు. జిల్లా మొత్తం 467 గ్రామ పంచాయతీల పరిధిలో సగటున 76 పాయింట్ల ప్రగతి నమోదయిందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఓడిఎఫ్ ప్లస్ 100 శాతం సాధించగా, ఇంటింటికీ చెత్త సేకరణ (డి 2 డి) 59.62 శాతంగా నమోదయిందన్నారు. వెనుకబడిన మండలాలు మరింత వేగంగా పనిచేయాలని కలెక్టర్ అధికారులను ఆదేశించారు. వ్యక్తిగత గృహ మరుగుదొడ్ల నిర్మాణం (ఐ హెచ్ హెచ్ ఎల్) 15 మార్కులు, కమ్యూనిటీ శానిటరీ కాంప్లెక్స్‌లు (సామూహిక మరుగుదొడ్లు) 15 మార్కులు,100 శాతం ఇంటింటికీ చెత్త సేకరణ (డి 2 డి) 20 మార్కులు,100 శాతం మూలాల్లోనే చెత్త వర్గీకరణ 20 మార్కులు, ఓడిఎఫ్ ప్లస్ మోడల్ సాధన 30 మార్కులు, అర్బన్ లోకల్ బాడీస్ పరిధిలో ముమ్మరంగా ప్రజల ఫీడ్‌బ్యాక్ జిల్లా పరిధిలోని పట్టణ ప్రాంతాలలో (యు ఎల్ బి) ప్రభుత్వ నిబంధనలు, అభివృద్ధి కార్యక్రమాలపై ప్రజల నుండి ఫీడ్‌బ్యాక్ సేకరణ ముమ్మరంగా సాగుతోందన్నారు. జిల్లా వ్యాప్తంగా ఇప్పటివరకు మొత్తం 17,159 ఫీడ్‌బ్యాక్‌లు నమోదయాయన్నారు. హిందూపురం 8,332 (మొదటి స్థానం) ధర్మవరం 4,499, కదిరి 2,047, పుట్టపర్తి 1,168, మడకశిర 707, పెనుకొండ: 406, పీఎం సూర్య ఘర్ (ఉచిత సౌర విద్యుత్ పథకం) ప్రగతి సమీక్ష జిల్లాలో 'పీఎం సూర్య ఘర్ ముఫ్త్ బిజ్లీ యోజన' కింద సోలార్ రిజిస్ట్రేషన్ల ప్రక్రియ అత్యంత వేగంగా కొనసాగుతోందన్నారు. అధికారులు ఈ పథకం పురోగతిపై నిరంతర సమీక్ష నిర్వహించారు. జిల్లా పరిధిలో మొత్తం 45,428 దరఖాస్తులు నమోదు కాగా, రికార్డు స్థాయిలో 45,407 దరఖాస్తులకు ఫీజిబిలిటీ అనుమతులు లభించాయన్నారు. కేవలం 21 దరఖాస్తులు మాత్రమే పెండింగ్‌లో ఉన్నాయన్నారు. ఇప్పటివరకు 13,356 మంది లబ్ధిదారులు సోలార్ ప్యానెళ్ల ఏర్పాటు కోసం వెండార్లను ఎంచుకున్నారన్నారు. మిగిలిన వారు కూడా త్వరగా ఎంచుకునేలా అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. జిల్లాలో ఇప్పటివరకు 3,366 సౌర విద్యుత్ ప్రాజెక్టుల సంస్థాపన పూర్తి అయిందన్నారు. అందులో 1,108 దరఖాస్తులకు సంబంధించి సబ్సిడీ మొత్తం లబ్ధిదారుల ఖాతాల్లో జమ అయిందన్నారు. తుది తనిఖీల్లో ఉన్న 243 దరఖాస్తులను యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రతికూల వార్తలపై అలసత్వం వద్దని, పత్రికలు, సామాజిక మాధ్యమాలలో వచ్చే ప్రతికూల (అడ్వర్స్) వార్తలపై జిల్లా అధికారులు తక్షణమే స్పందించి, క్షేత్రస్థాయిలో విచారణ జరిపి నివేదికలు సమర్పించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. ప్రజా సమస్యలపై వచ్చే వార్తలను నిర్లక్ష్యం చేయకుండా, వాటి పరిష్కారానికి తీసుకున్న చర్యలను మీడియాకు కూడా వివరించాలని సూచించారు. ప్రభుత్వ ప్రతిష్టకు భంగం కలగకుండా, ప్రజా సంక్షేమమే ధ్యేయంగా అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు.

# పాలకుల విలాసాలకు నిధులెక్కడివో?

'విదేశాలకు వెళ్లి వీళ్లు టాయిలెట్లు కడిగి సంపాదిస్తారు. ఇంగ్లిష్‌లో మాట్లాడుతూ పోజులు కొడతారు' విదేశాల్లో ఐటీ కంపెనీల్లో పనిచేస్తూ మన దేశానికి విదేశీ మారకద్రవ్యం పంపిస్తున్న యువతను ఉద్దేశించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఇటీవల చేసిన వ్యాఖ్యలు ఇవి. క్రూడ్ ఆయిల్ ధర రెట్టింపై ప్రపంచ దేశాలు అతలాకుతలం అవుతున్న తరుణంలో మన దేశాన్ని కాపాడుతున్నది ఆ యువత పంపే నిధులే. వారు పంపే నిధులే లేకపోయి ఉంటే అమెరికా-ఇజ్రాయిల్-ఇరాన్ యుద్ధంతో క్రూడ్ ఆయిల్ ధరలు రెట్టింపు అయినప్పుడు మన దేశం మిగిలిన దేశాల కన్నా ఎక్కువ గడ్డు పరిస్థితి ఎదుర్కొని ఉండేది. క్రూడ్ ఆయిల్‌కు మనం చెల్లించే విదేశీ మారకద్రవ్యం కంటే విదేశాల నుంచి మనవాళ్లు పంపే కరెన్సీ విలువ చాలా ఎక్కువ. బీఆర్ఎస్ పాలనలో ఐటీ మంత్రిగా పనిచేసిన కేటీఆర్ తెలంగాణ ఐటీ రంగంలో గణనీయమైన ప్రభావం చూపించారు. రాష్ట్రానికి ప్రపంచ స్థాయి ఐటీ కంపెనీలను తీసుకువచ్చారు. ఆయనకు విషయ పరిజ్ఞానం ఉన్నది. విద్యావంతుల, ఐటీ జనరేషన్ అభిమానాన్ని ఎంతో సంపాదించారు. వివిధ భాషల్లో అనర్గళంగా మాట్లాడతారు. అదే సమయంలో ముఖ్యమంత్రికి ప్రత్యర్థులను బూతులు తిట్టడంలో నైపుణ్యం తప్ప ఇంగ్లిష్, తెలుగు భాషల్లో నైపుణ్యం లేనే లేదు. విషయ పరిజ్ఞానం అసలే లేదు. దాంతో ఎదుటివారిని చిన్నచూపు చూడాలనే ఉద్దేశంతో ఇంగ్లిష్‌లో మాట్లాడుతారు. విదేశాల్లో టాయిలెట్లు కడిగి సంపాదిస్తారని నోటికి వచ్చినట్టు మాట్లాడటం ద్వారా ఎదుటివారి ప్రతిభను తగ్గించామని ఆయన అనుకుంటారు. కానీ అలాంటి మాటల ద్వారా తనను తానే మరింత చులకన, తక్కువ చేసుకుంటున్నారు.తెలంగాణ సమాచారం అమెరికా-ఇరాన్ యుద్ధం తరువాత క్రూడ్ ఆయిల్ ధరలు పెరిగి ప్రపంచంలో అనేక దేశాలు అతలాకుతలం అవుతున్నాయి. యుద్ధం ఒకటి రెండు వారాల్లో ఆగిపోతుందని అంతా అనుకున్నారు. అయితే, ఆగే సూచనలు ఏకోశానా కనిపించటం లేదు. హైదరాబాద్‌లో ఇటీవల బీజేపీ నిర్వహించిన బహిరంగ సభలో ప్రధాన మంత్రి మోదీ పొదుపు సూత్రాలు ప్రజలకు సూచించారు. పెట్రోల్, డీజిల్ పొదుపుగా వాడాలని, ఏడాది పాటు బంగారం కొనవద్దని సూచించారు. అయితే, మన విదేశీ మారకద్రవ్యాన్ని మింగేసే వాటిలో ఈ రెండే ప్రధానమైనవి. వైశ్య కార్పొరేషన్ రాష్ట్ర చైర్‌పర్సన్, కాంగ్రెస్ మహిళా నాయకురాలు 'బంగారం కొనవద్దని చెప్పడానికి నువ్వెవరు' అంటూ ప్రధాని మీద వ్యాఖ్యలు చేశారు. ఇలాంటి వారికి మార్గదర్శకం చేసే నాయకునికే విదేశీ మారకద్రవ్యం గురించి అవగాహన లేదు. టాయిలెట్లు కడిగేవారంటూ దేశాన్ని ఆర్థికంగా ఆదుకుంటున్న వారిని చిన్నచూపు చూస్తే..బూతులతోనే రాజకీయంగా ఎదగవచ్చునని నమ్మేవాళ్లు అంతకన్నా ఏంమాట్లాడుతారు? యుద్ధానికి ముందు క్రూడ్ ఆయిల్ 60 డాలర్లకు బ్యారెల్ ఉంటే..యుద్ధం మొదలయ్యాక ఇప్పుడు 100 నుంచి 115 డాలర్ల మధ్య ఊగిసలాడుతున్నది. అంటే దాదాపు రెట్టింపు ధర అయింది. ఇదే ధర, ఇవే పరిస్థితులు ఇంకొన్నాళ్లు కొనసాగితే మన దేశం కూడా తీవ్ర ఆర్థిక సంక్షోభంలో కూరుకుపోవడం ఖాయంగా కనిపిస్తున్నది. మన దేశం దాదాపు 88 శాతం క్రూడ్ ఆయిల్‌ను దిగుమతి చేసుకుంటున్నది. 2026 ఆర్థిక సంవత్సరం ప్రథమార్థంలోనే క్రూడ్ ఆయిల్ దిగుమతి బిల్లు 134.7 బిలియన్ డా లర్లు. బంగారం దిగుమతి విలువ 72 బిలియన్ డాలర్లు. ఈ రెండింటికే 216 బిలియన్ డాలర్ల విదేశీ మారకద్రవ్యం వ్యయం అవుతున్నది. ప్రపంచంలో దాదాపు అన్ని దేశాల్లో భారతీయులు ఉద్యోగాలు చేస్తున్నారు. ఉద్యోగం ద్వారా వారు పంపే నిధులను చూస్తే ప్రపంచంలో అతి పెద్ద రెమిటెన్స్ గ్రహీత మన దేశమే. 2024లో 118.7 బిలియన్ డాలర్లు 2025లో 135.4 బిలియన్ డాలర్లు పంపారు. మన జీడీపీలో ఇది 3.5 శాతం. ఈ నిధుల్లో అమెరికా నుంచి 27 శాతం (వైట్ కాలర్ ఉద్యోగాలు), యూఏఈ నుంచి 19 శాతం వస్తుంటే..కెనడా, ఆస్ట్రేలియా, ఇంగ్లాండ్‌తో పాటు అనేక దేశాల నుంచి మిగిలిన నిధులు వస్తున్నాయి. 2026లో మన క్రూడ్ ఆయిల్ దిగుమతి బిల్లు 134.7 బిలియన్ డాలర్లు. అయితే మన ఉద్యోగులు విదేశాల నుంచి 2025లో పంపిన నిధులు 135.4 బిలియన్ డాలర్లు. అంటే మన క్రూడ్ ఆయిల్ బిల్లు ఎంతో.. విదేశాల్లో పనిచేస్తూ మన దేశానికి తమ శ్రమను డాలర్ల రూపంలో పంపుతున్న నిధులు కూడా దాదాపు అంతే మొత్తం. మనవాళ్లు విదేశాల్లో ఉద్యోగాలు చేస్తూ 135 బిలియన్ డాలర్లు పంపుతున్నారంటే మన కరెన్సీలో చెప్పాలంటే రూ.13 లక్షల కోట్లు. ఇదంతా తమ కుటుంబానికి, బంధువులకు, స్నేహితులకు, పుట్టిన ప్రాంతానికి దూరంగా బతుకుతూ వారు పంపుతున్న నిధుల విలువ. కానీ మన రాష్ట్ర పాలకులు వారికి ఇస్తున్న విలువ విదేశాల్లో టాయిలెట్‌లు కడుగుతూ సంపాదిస్తారనే చీదరింపు వ్యాఖ్యానం. దేశం సంక్షోభంలో ఉన్నా పాలకుల విలాసాలకు లోటేమీ లేదు.

## బాల పురస్కార్ కు దరఖాస్తులు ఆహ్వానం - ఐసిడిఎస్ పిడి ప్రమీల

పుట్టపర్తి : ప్రధానమంత్రి రాష్ట్రీయ బాల పురస్కార్కు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నామని జిల్లా స్త్రీ శిశు సంక్షేమ శాఖ సాధికారత అధికారి ప్రమీల బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. ప్రతిభావంతులైన పిల్లలను సత్కరించే ఉద్దేశంతో ఈ అవార్డు లను ప్రధానం చేస్తున్నట్లు చెప్పారు. సామాజిక సేవ, సాంకేతిక పరిజ్ఞానం, విద్య, ధైర్య సాహసాలు, క్రీడలు, పర్యావరణం, కలలు, సంగీతం, నృత్యం, పెయింటింగ్, నూతన ఆవిష్కరణలు, నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలు తదితర విభాగాలులో రాష్ట్రీయ అంతర్జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరుస్తూ వారికి ఈ అవార్డులు అందించినట్లు తెలిపారు. ఆసక్తిగల వారు జులై 31 తేదీలోగా దరఖాస్తులను ఆన్లైన్ ద్వారా పంపించాలని సూచించారు. కేంద్రం నియమించే కమిటీ ద్వారా పరిశీలించి ఎంపికైన వారికి రాష్ట్రపతి చేతుల మీదుగా వచ్చే ఏడాది జనవరిలో ఈ అవార్డులను ప్రధానం చేస్తారని వెల్లడించారు. దరఖాస్తులను https://awards.gov.in వెబ్సైట్లో నమోదు చేయాలని సూచించారు.

## ట్రైన్ ఇంజిన్ ధర తెలిస్తే షాక్ అవుతారు.! పూర్తిస్థాయి రైలు తయారు చేయడానికి ఇన్ని కోట్లా.?



భారతీయ రైల్వేలో పట్టాలపై పరుగులు తీసే ఎలక్ట్రిక్ ఇంజిన్ల శక్తి అపారం. సాధారణంగా ఒక ఎలక్ట్రిక్ లోకోమోటివ్ తయారీకి 25 నుండి 30 కోట్ల రూపాయల ఖర్చవుతుంది. ఇవి వేల టన్నుల బరువును సునాయాసంగా లాగగలవు. టెక్నాలజీ పెరిగేకొద్దీ వీటి ధర కూడా పెరుగుతోంది. ఆ వివరాలు ఇలా.. మన దేశంలో ప్రతిరోజూ లక్షలాది మంది ప్రయాణించే భారతీయ రైల్వేల గురించి మనకు తెలియని విషయాలు చాలా ఉన్నాయి. ముఖ్యంగా ఒక రైలు ఇంజిన్ ధర ఎంత ఉంటుంది? లేదా మనం కూర్చునే ఒక్కో కోచ్ తయారు చేయడానికి ఎంత ఖర్చవుతుంది? అనే ప్రశ్నలు చాలా మందికి తలెత్తుతుంటాయి. ఈ ధరలు వింటే మీరు ఖచ్చితంగా ఆశ్చర్యపోతారు. ఒక రైలు ఇంజిన్ కొనే డబ్బుతో ఒక చిన్న ఊరినే దత్తత తీసుకోవచ్చు అంటే నమ్ముతారా? అవును, రైల్వే పరికరాల తయారీకి భారీగా ఖర్చవుతుంది. సాధారణంగా ఒక రైలు ఇంజిన్(లోకోమోటివ్) ధర అనేది దాని సామర్థ్యం, టెక్నాలజీపై ఆధారపడి ఉంటుంది. ప్రస్తుతం మనం వాడుతున్న ఎలక్ట్రిక్ లోకోమోటివ్ ధర సుమారు 25 నుండి 30 కోట్ల రూపాయల వరకు ఉంటుంది. భారతీయ రైల్వేలోనే అత్యంత శక్తివంతమైన లోకోమోటివ్ అయిన 12దీ' ధర దాదాపు 35 కోట్ల రూపాయలు. ఇక డీజిల్ ఇంజిన్ల విషయానికి వస్తే, వీటి ధర 15 నుండి 20 కోట్లు ఉంటుంది, అయితే పర్యావరణ కారణాల వల్ల ప్రస్తుతం వీటి తయారీని రైల్వే శాఖ తగ్గించింది. ఇక మనం ప్రయాణించే కోచ్‌ల విషయానికి వస్తే, ఎల్హెచ్‌బి(లాఎదీ) జనరల్ క్లాస్ కోచ్ ధర 1.5 నుండి 2 కోట్ల రూపాయల వరకు ఉంటుంది. అదే స్లీపర్ క్లాస్ కోచ్ అయితే 2 నుండి 2.5 కోట్ల రూపాయల ఖర్చు అవుతుంది. ఏసీ కోచ్‌ల ధరలు ఇంకా ఎక్కువగా ఉంటాయి; థర్డ్ ఏసీ కోచ్‌కు 2.8 నుండి 3 కోట్లు, సెకండ్ ఏసీ లేదా ఫస్ట్ ఏసీ కోచ్ తయారీకి 3.2 నుండి 3.5 కోట్ల రూపాయల వరకు ఖర్చవుతుంది. అంటే మనం ప్రయాణించే ఒక్క ఏసీ కోచ్ విలువ కొన్ని ఖరీదైన విల్లాల కంటే ఎక్కువే! ప్రస్తుతం దేశవ్యాప్తంగా క్రేజ్ సంపాదించుకున్న 16 కోచ్‌ల 'వందే భారత్' రైలు తయారీ ఖర్చు సుమారు 115 కోట్ల రూపాయలు. దీన్ని బట్టి చూస్తే, ఒక పూర్తి స్థాయి ఎక్స్‌ప్రెస్ రైలు పట్టాల మీదకు రావాలంటే సగటున 85 నుండి 100 కోట్ల రూపాయల వరకు ఖర్చవుతుంది. ఇంత భారీ వ్యయంతో తయారైన ఈ రైల్వే ఆస్తులను కాపాడుకోవడం మనందరి బాధ్యత.

## ఇక్కడి ఇసుకను తెల్ల బంగారంగా పిలుస్తారు ఎందుకో తెలిస్తే అవునా.. నిజమా.? అంటూ నోరెళ్ల బెట్టాల్సిందే!




భారతదేశంలోని ఉత్తరప్రదేశ్ రాష్ట్రం కేవలం వ్యవసాయానికే కాదు, అద్భుతమైన ఖనిజ సంపదకు కూడా నిలయం. ఇక్కడి నేలల్లో లభించే సిలికా శాండ్ ను స్థానికులు తెల్ల బంగారం అని పిలుస్తారు. దీనికి కారణం ఈ ఇసుక ద్వారానే కోట్లాది రూపాయల విలువైన గాజు పరిశ్రమ నడుస్తోంది. ముఖ్యంగా యూపీలోని ఫిరోజాబాద్ నగరం గ్లాస్ క్యాపిటల్ ఆఫ్ ఇండియాగా పేరుగాంచింది. ఫిరోజాబాద్ గాజు పరిశ్రమ, ఇక్కడి తెల్ల బంగారానికి సంబంధించిన ఆసక్తికరమైన అంశాల్లోకి వెళితే.. ఉత్తరప్రదేశ్ భూగర్భంలో దాగి ఉన్న సిలికా శాండ్‌ను అక్కడి ప్రజలు తెల్ల బంగారం (ఔప్త్రఙవ +శీశ్రీ‌ు) అని పిలుస్తారు. ముఖ్యంగా ఫిరోజాబాద్ నగరం భారతదేశపు గాజు రాజధానిగా (+శ్రీఖంం ఝుజూఞుశ్రీ) ప్రపంచ ప్రఖ్యాతి గాంచింది. ఫిరోజాబాద్‌లో గాజు తయారీ సంప్రదాయం శతాబ్దాల నాటిది. మొఘల్ కాలంలో, ముఖ్యంగా అక్బర్ చక్రవర్తి పాలనలో పర్షియా, మధ్య ఆసియా నుండి నిపుణులైన గాజు కళాకారులను ఇక్కడికి రప్పించారు. వారు స్థానిక మట్టిలోని ప్రత్యేకతను గుర్తించి గాజు వస్తువుల తయారీకి పునాది వేశారు. పురావస్తు ఆధారాల ప్రకారం, బస్తీ జిల్లాలోని కోపియాలో జరిపిన త్రవ్వకాల్లో క్రీస్తుపూర్వం 3వ శతాబ్దానికి చెందిన గాజు అవశేషాలు లభించడం గమనార్హం. యూపీలోని ప్రయాగ్‌రాజ్ (శంకర్గఢ్), మీర్జాపూర్, సోన్‌భద్ర, చిత్రకూట్, బాందా వంటి జిల్లాల్లో అత్యున్నత నాణ్యత కలిగిన సిలికా ఇసుక లభిస్తుంది. శంకర్గఢ్ నుండి సేకరించిన ఇసుక దేశవ్యాప్తంగా ఉన్న గాజు కర్మాగారాలకు సరఫరా చేయబడుతుంది. ఇందులో ఐరన్ ఆక్సైడ్ తక్కువగా ఉండటం వల్ల ఇది గాజు తయారీకి అత్యంత అనువైనదిగా పరిగణించబడుతుంది. ఈ సిలికా ఇసుకను ఉపయోగించి కేవలం అలంకరణ వస్తువులే కాకుండా, ఆధునిక కాలంలో అత్యంత అవసరమైన సోలార్ ప్యానెల్ గ్లాస్, కిటికీ అద్దాలు, ఔషధాల సీసాలను తయారు చేస్తున్నారు. దాదాపు 200 ఏళ్లుగా ఫిరోజాబాద్ గాజు గాజులతయారీలో ప్రపంచ ప్రసిద్ధి చెందింది. ఇక్కడ తయారయ్యే రంగురంగుల గాజులు విదేశాలకు కూడా ఎగుమతి అవుతుంటాయి. యూపీ నేలల్లో ఉన్న ఈ సహజ సంపద లక్షలాది మందికి ఉపాధిని కల్పిస్తోంది. నాణ్యమైన ముడిసరుకు, తరతరాలుగా వస్తున్న కళాకారుల నైపుణ్యం కలగలిసి ఉత్తరప్రదేశ్‌ను గాజు పరిశ్రమలో ప్రపంచ పటంలో నిలబెట్టాయి. ఒక సామాన్యమైన ఇసుక రేణువును అద్భుతమైన గాజు శిల్పంగా మార్చే ఈ ప్రయాణం నిజంగా ఆశ్చర్యకరం.

## రూపాయి విలువ పడిపోతున్నా టెన్షన్ అక్కర్లేదు! RBI మాజీ గవర్నర్ కీలక వ్యాఖ్యలు




భారత రూపాయి విలువ క్షీణత ఆందోళన కలిగించినా, అతిగా భయపడాల్సిన అవసరం లేదని మాజీ ఆర్‌బీఐ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు అన్నారు. బలహీన రూపాయి ఎగుమతులకు ఊతమిస్తుందని, 2013తో పోలిస్తే భారత ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు బలంగా ఉందని ఆయన వివరించారు. అవసరమైనప్పుడు మాత్రమే ఆర్‌బీఐ జోక్యం చేసుకోవాలని సూచించారు. భారతీయ రూపాయి విలువ ఇటీవల అమెరికా డాలర్‌తో పోలిస్తే భారీగా క్షీణించిన నేపథ్యంలో భారత రిజర్వ్ బ్యాంక్ మాజీ గవర్నర్ దువ్వూరి సుబ్బారావు కీలక వ్యాఖ్యలు చేశారు. రూపాయి బలహీనపడటం ఆందోళన కలిగించే అంశమే అయినప్పటికీ, దానిపై అతిగా భయపడాల్సిన అవసరం లేదని ఆయన అభిప్రాయపడ్డారు. డాలర్‌తో పోలిస్తే రూపాయి విలువ ఇంట్రాడే ట్రేడింగ్‌లో 95.80 వరకు పడిపోయి, చివరకు 95.71 వద్ద ముగియడం మార్కెట్లలో చర్చనీయాంశమైంది. అయితే కరెన్సీ మార్పిడిలో కొంత స్థాయి ఒత్తిడి సహజమని, మార్కెట్ పరిస్థితుల ప్రకారం రూపాయి తన నిజమైన విలువను కనుగొనే అవకాశం ఇవ్వాలని సుబ్బారావు సూచించారు. ఆయన అభిప్రాయం ప్రకారం బలహీనమైన రూపాయి ప్రతికూలతలతో పాటు కొన్ని ప్రయోజనాలను కూడా కలిగిస్తుంది. ముఖ్యంగా, దిగుమతి అయ్యే ముడి చమురు ఖర్చు పెరగడం వల్ల దేశంలో చమురు వినియోగం కొంత తగ్గవచ్చు. అదే సమయంలో భారతీయ ఎగుమతులు అంతర్జాతీయ మార్కెట్లో మరింత పోటీ సామర్థ్యాన్ని పొందే అవకాశం ఉందని చెప్పారు. రూపాయి విలువ తగ్గడంతో విదేశీ కొనుగోలుదారులకు భారత ఉత్పత్తులు తక్కువ ధరలకు లభిస్తాయి కాబట్టి, ఎగుమతులకు ఊతం లభించవచ్చని ఆయన వివరించారు. 2013లో జరిగిన ఆర్థిక సంక్షోభంతో ప్రస్తుత పరిస్థితిని పోల్చిన సుబ్బారావు, ప్రస్తుతం భారత ఆర్థిక వ్యవస్థ గతంతో పోలిస్తే మరింత బలంగా ఉందని పేర్కొన్నారు. ముఖ్యంగా విదేశీ మారక నిల్వలు, ద్రవ్యలోటు నియంత్రణ, బ్యాంకింగ్ వ్యవస్థ స్థిరత్వం వంటి అంశాల్లో భారత్ మంచి స్థితిలో ఉందన్నారు. 2013 టేపర్ టాంట్రమ్ సమయంలో విదేశీ పెట్టుబడుల భారీ ఉపసంహరణ కారణంగా రూపాయి తీవ్ర ఒత్తిడిని ఎదుర్కొంది. అయితే ఇప్పుడు పరిస్థితులు అంతగా ప్రమాదకరంగా లేవని ఆయన భావిస్తున్నారు. అయితే ప్రపంచ ఆర్థిక పరిస్థితి మాత్రం ఇంకా అనిశ్చితంగానే ఉందని హెచ్చరించారు. మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, పెరుగుతున్న ముడి చమురు ధరలు, అమెరికా వడ్డీ రేట్ల విధానం, గ్లోబల్ మార్కెట్లలో అస్థిరత వంటి అంశాలు రూపాయిపై ఒత్తిడిని కొనసాగించవచ్చని ఆయన అభిప్రాయపడ్డారు. రూపాయిని కృత్రిమంగా ఒక స్థాయిలో నిలబెట్టేందుకు భారీగా జోక్యం చేసుకోవడం కంటే, అవసరమైనప్పుడు మాత్రమే ఆర్‌బిఐ జోక్యం చేసుకోవడం మంచిదని సుబ్బారావు సూచించారు. దీర్ఘకాలంలో మార్కెట్ ఆధారిత మారకపు విలువ వ్యవస్థే ఆర్థిక వ్యవస్థకు ఆరోగ్యకరమని ఆయన అభిప్రాయపడ్డారు.

## ఈవీ కొనుగోలుదారులకు సర్కార్ గుడ్ న్యూస్ రూ. లక్ష సబ్సిడీ 50% టాక్స్ తగ్గింపు..!



దేశవ్యాప్తంగా కాలుష్య నియంత్రణ, పెరుగుతున్న ఇంధన ధరల భారాన్ని తగ్గించడంపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఇందులో భాగంగానే పర్యావరణహిత రవాణా వ్యవస్థను ప్రోత్సహించడానికి ఎలక్ట్రిక్ వాహనాల (జుఎ) వినియోగాన్ని పెంచేలా సరికొత్త వ్యూహాలను అమలు చేస్తున్నాయి. పర్యావరణ పరిరక్షణతో పాటు మహిళా సాధికారతను ప్రోత్సహించే దిశగా సర్కార్ ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. దేశవ్యాప్తంగా కాలుష్య నియంత్రణ, పెరుగుతున్న ఇంధన ధరల భారాన్ని తగ్గించడంపై ప్రభుత్వాలు ప్రత్యేక దృష్టి సారించాయి. ఇందులో భాగంగానే పర్యావరణహిత రవాణా వ్యవస్థను ప్రోత్సహించడానికి ఎలక్ట్రిక్ వాహనాల (జుఎ) వినియోగాన్ని పెంచేలా సరికొత్త వ్యూహాలను అమలు చేస్తున్నాయి. తాజాగా బీహార్ ప్రభుత్వం పర్యావరణ పరిరక్షణతో పాటు మహిళా సాధికారతను ప్రోత్సహించే దిశగా ఒక చారిత్రాత్మక నిర్ణయం తీసుకుంది. ముఖ్యమంత్రి సామ్రాట్ చౌదరి అధ్యక్షతన జరిగిన మంత్రివర్గ సమావేశంలో 'బీహార్ ఎలక్ట్రిక్ వాహనాల (సవరణ) విధానం 2026' కు ఆమోదం లభించింది. ఈ కొత్త ఈవీ విధానం ప్రకారం, రాష్ట్రంలో ఎలక్ట్రిక్ కార్లను (ఫోర్ వీలర్స్) కొనుగోలు చేసే మహిళలకు ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యత ఇస్తోంది. మహిళలు ఈవీ కార్లను కొనుగోలు చేస్తే ఏకంగా రూ. 1 లక్ష వరకు నేరుగా సబ్సిడీ రూపంలో ప్రభుత్వం అందించనుంది. ఇది మహిళలు స్వయం సమృద్ధి సాధించడానికి, పర్యావరణహిత ప్రయాణాన్ని ఎంచుకోవడానికి ఎంతో దోహదపడుతుంది. ఈ కొత్త విధానం కేవలం కార్లకే పరిమితం కాకుండా, ద్విచక్ర, త్రిచక్ర వాహనాల కొనుగోలుదారులకు కూడా భారీ ఉపశమనాన్ని కలిగిస్తోంది. వాహనాల కేటగిరీని బట్టి సబ్సిడీ విధానం మారుతుంది. సాధారణ వర్గానికి చెందిన వ్యక్తులు ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను కొనుగోలు చేయడానికి 10,000 రూపాయల వరకు, షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన వ్యక్తులు 12,000 రూపాయల వరకు సబ్సిడీని పొందుతారు. ఎలక్ట్రిక్ కార్గో త్రిచక్ర వాహనాల కోసం, సాధారణ వర్గానికి 50,000 రూపాయల వరకు, ఎస్సీ, ఎస్టీ వర్గాలకు 60,000 రూపాయల వరకు సబ్సిడీ లభిస్తుంది. దీంతో పాటు, బీహార్‌లో ఈవీ వాహనాలను కొనుగోలు చేసి, రిజిస్ట్రేషన్ చేయించుకునే ప్రతి ఒక్కరికీ మోటారు వాహన పన్నులో (వీశీశీ ఎవప్త్రఅఎశ్రీవ ఖుఇ) ఏకంగా 50 శాతం వరకు రాయితీ ఇవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. కేంద్ర ప్రభుత్వ స్క్రాపేజ్ విధానానికి అనుగుణంగా, పాత పెట్రోల్, డీజిల్ వాహనాలను స్క్రాప్ చేసి కొత్త ఈవీలను కొనే వారికి అదనపు ప్రయోజనాలు కూడా అందుతాయి. రాష్ట్రంలో కాలుష్యాన్ని తగ్గించి, స్వచ్ఛమైన గాలిని అందించడమే లక్ష్యంగా బీహార్ ప్రభుత్వం పని చేస్తోంది. 2030 నాటికి రాష్ట్రంలో నమోదయ్యే మొత్తం కొత్త వాహనాలలో కనీసం 30 శాతం ఎలక్ట్రిక్ వాహనాలే ఉండాలనే ప్రతిష్టాత్మక లక్ష్యాన్ని నిర్దేశించుకుంది. ఈ లక్ష్యం గనుక నెరవేరితే, రాష్ట్రంలో ప్రతి ఏటా సుమారు 100 మిలియన్ లీటర్ల పెట్రోల్, డీజిల్ ఆదా అవుతుందని అధికారులు అంచనా వేస్తున్నారు. ఇది సామాన్యుడి జేబుకు రవాణా ఖర్చులను తగ్గించడమే కాకుండా, పర్యావరణాన్ని ఎంతగానో కాపాడుతుంది. ఎలక్ట్రిక్ వాహనదారులకు ఛార్జింగ్ ఇబ్బందులు లేకుండా చూసేందుకు ప్రభుత్వం విస్తృత ఏర్పాట్లు చేస్తోంది. ప్రభుత్వ, ప్రైవేట్ భాగస్వామ్యంతో భారీగా ఛార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నారు. నగరాల్లోని షాపింగ్ మాల్స్, హోటళ్లు, పెట్రోల్ పంపులు, పెద్ద నివాస సముదాయాలలో ఈవీ ఛార్జింగ్ పాయింట్లను ఏర్పాటు చేసే నిర్వాహకులకు ప్రత్యేక ప్రోత్సాహకాలను కూడా అందించనున్నారు. బీహార్ ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం రాష్ట్ర రవాణా రంగాన్ని సరికొత్త హరిత మార్గం వైపు నడిపిస్తుందనడంలో ఎలాంటి సందేహం లేదు.

## డబ్బే డబ్బును సంపాదించే దిమ్మతిరిగే ఐడియా.. ఇప్పుడే ప్రారంభించండి.! సీక్రెట్ టిప్స్..

మన జీవితంలో డబ్బు కంటే సమయమే అత్యంత విలువైనది. చాలా మంది గంటల కొద్దీ చిన్న చిన్న బేరసారాల కోసం సమయాన్ని వృథా చేస్తుంటారు. కానీ అదే సమయాన్ని తమ నైపుణ్యాలను పెంచుకోవడానికి కేటాయిస్తే ఆదాయం కొన్ని రెట్లు పెరుగుతుంది. అంబానీకైనా, వారెన్ బఫెట్‌కైనా మనకైనా రోజుకు ఉండేది 24 గంటలే.. డబ్బు సంపాదించడం ఎలా? ఈ ప్రశ్న మనలో చాలామందికి నిత్యం మెదలుతూనే ఉంటుంది. కానీ, ఆదాయాన్ని కేవలం సంపాదించడం మాత్రమే కాదు, దాన్ని సరిగ్గా వృద్ధి చేసుకోవడం కూడా ఒక గొప్ప కళేనని ఆర్థిక నిపుణులు బలంగా చెబుతున్నారు. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో ఆర్థిక నిపుణులు ఒకరు సంపాదన, సంపదకు సంబంధించిన కొన్ని అత్యంత ఆసక్తికరమైన, ప్రాక్టికల్ విషయాలను పంచుకున్నారు. మన జీవితంలో ఆర్థిక ప్రణాళిక అనేది కేవలం పొదుపుకే పరిమితం కాకుండా, సమయాన్ని, డబ్బును మనం ఏ విధంగా మేనేజ్ చేస్తామనే దానిపైనే పూర్తిగా ఆధారపడి ఉంటుంది. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో ఆర్థికంగా స్థిరపడాలని కోరుకుంటారు, కానీ దానికి సరైన మార్గం ఏంటో చాలా మందికి తెలియదు. ఇక్కడ మనిషి ఆలోచనా దృక్పథం అనేది చాలా కీలకంగా మారుతుంది. ముందుగా సమయానికి, డబ్బుకు మధ్య ఉన్న లోతైన తేడాను గుర్తించడం చాలా అవసరం. సాధారణంగా మనం సమయమే అన్నింటికంటే విలువైనది అని మాటల్లో చెప్తాం కానీ, మన నిత్య జీవితంలో మాత్రం డబ్బుకే ఎక్కువ ప్రాముఖ్యత ఇస్తూ ఉంటాం. డబ్బు మళ్లీ సంపాదించుకోవచ్చు కానీ గడిచిన సమయం ఎప్పటికీ తిరిగి రాదు. ఈ చిన్న లాజిక్ మన బ్రెయిన్‌కు అర్థమైతే సంపాదన మార్గాలు ఆటోమేటిక్‌గా మెరుగుపడతాయి. అనవసరమైన బేరసారాలు చేస్తూ గంటల కొద్దీ మన విలువైన సమయాన్ని వృథా చేసే బదులు, అదే సమయాన్ని కొత్త విషయాలు నేర్చుకోవడానికి లేదా మనం చేసే వృత్తిలో మరింతగా రాణించడానికి ఉపయోగిస్తే మన ఆదాయం ఖచ్చితంగా పెరుగుతుంది. మన ప్రతి నిమిషం ఒక ఇన్వెస్ట్‌మెంట్ లాంటిది. డబ్బును వృద్ధి చేసుకోవాలంటే కేవలం ఏదో ఒక చోట పెట్టుబడులు పెడితే సరిపోదు, దానికంటూ ఒక క్రమశిక్షణ కలిగిన పద్ధతి ఉండాలి. లోకంలో 'రిచ్ పీపుల్ పూర్ పీపుల్' ఉండరు, కేవలం 'రిచ్ థింకింగ్ పూర్ థింకింగ్' మాత్రమే ఉంటుంది. మన ఆదాయంలో కొంత



భాగాన్ని మొదట సెక్యూరిటీ కోసం అంటే ఇన్సూరెన్స్ వంటి వాటి కోసం కేటాయించాలి. ఏదైనా అనారోగ్యం పాలైనప్పుడు మన కష్టార్జితం మొత్తం ఆసుపత్రి పాలవ్వకుండా ఉండాలంటే ఇన్సూరెన్స్ చాలా ముఖ్యం. ఆ తర్వాత అత్యవసర నిధి ఏర్పాటు చేసుకోవాలి. ఇది మనకు ఉద్యోగం పోయినా లేదా అనుకోని కష్టాలు ఎదురైనా అండగా నిలుస్తుంది. ఇలాంటి చిన్న చిన్న జాగ్రత్తలు మనల్ని పెద్ద ఆర్థిక సంక్షభాల నుండి రక్షిస్తాయి. చివరగా, మన ప్రతి రూపాయిని ట్రాక్ చేయడం అలవాటు చేసుకోవాలి. మనకు వచ్చే ఆదాయం ఎంత? మనం చేసే ఖర్చులు ఏమిటి? ఆస్తులు, అప్పుల మధ్య సమతుల్యత ఎలా ఉంది? అనే విషయాలను ఒక ఎక్సెల్ షీట్‌లో లేదా బుక్‌లో రాసుకోవాలి. దీన్నే 'రియల్ స్టేట్మెంట్' అంటారు. కేవలం విలాసాల కోసం ఎంత ఖర్చు పెడుతున్నామో తెలిస్తేనే, అనవసర ఖర్చులను అరికట్టగలం. సంపద సృష్టించడం అనేది ఒక్క రోజులో లేదా ఒక్క రాత్రిలో జరిగేది కాదు. దీనికి ఓపిక, పట్టుదల, నిరంతర పర్యవేక్షణ ఎంతైనా అవసరం. మనం సంపాదన పట్ల ఎంత శ్రద్ధ చూపిస్తామో, మన సమయం పట్ల కూడా అంతే గౌరవం చూపినప్పుడే ఆర్థికంగా ఉన్నత స్థానానికి చేరుకోగలం. ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తే వచ్చే ఐదేళ్లలో మన ఆర్థిక స్థితిగతుల్లో స్పష్టమైన మార్పును గమనించవచ్చు. తెలివిగా ఆలోచించండి, మీ సమయాన్ని గౌరవించండి, అద్భుతమైన సంపదను సృష్టించండి. మన ఆలోచనా విధానమే మన భవిష్యత్తును నిర్ణయిస్తుంది కాబట్టి ఎప్పుడూ పాజిటివ్‌గా ఉండండి. మీ విజయానికి మీరే బాధ్యులు అన్న విషయాన్ని మర్చిపోకండి. క్రమశిక్షణతో కూడిన పెట్టుబడి, కాలంపై అవగాహన మీ జీవితాన్ని సంపన్నం చేస్తాయి. మీ జీవితంలో ఆర్థిక లక్ష్యాలను నిర్దేశించుకోండి. ఆ లక్ష్యాల దిశగా ప్రతిరోజూ అడుగులు వేయండని నిపుణులు అంటున్నారు.

## కేంద్ర ప్రభుత్వం సంచలన నిర్ణయం.. చక్కెర ఎగుమతులపై నిషేధం! ఎందుకంటే?




భారత ప్రభుత్వం చక్కెర ఎగుమతులను తక్షణమే నిలిపివేసింది, ఈ నిషేధం 2026 సెప్టెంబర్ 30 వరకు అమల్లో ఉంటుంది. దేశీయ మార్కెట్‌లో చక్కెర ధరలను స్థిరీకరించడం, ఆహార ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడమే దీని వెనుక ప్రధాన ఉద్దేశ్యం. దేశీయ ఉత్పత్తి తగ్గుదల, వాతావరణ అనిశ్చితి ఈ నిర్ణయానికి దారితీశాయి. భారత ప్రభుత్వం చక్కెర ఎగుమతులపై కీలక నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. తాజా నివేదికల ప్రకారం ముడి, శుద్ధి చేసిన చక్కెర ఎగుమతులను తక్షణమే నిలిపివేస్తూ కేంద్రం ఆదేశాలు జారీ చేసింది. ఈ నిషేధం 2026 సెప్టెంబర్ 30 వరకు లేదా తదుపరి ఆదేశాలు వెలువడే వరకు అమల్లో ఉండనుంది. దేశీయ మార్కెట్లో చక్కెర ధరలు అదుపు తప్పకుండా చూడడం, ఆహార ద్రవ్యోల్బణాన్ని నియంత్రించడమే ఈ చర్య వెనుక ప్రధాన ఉద్దేశ్యమని తెలుస్తోంది. అయితే ఇప్పటికే రవాణా ప్రక్రియలో ఉన్న కొన్ని సరుకులకు మినహాయింపులు ఇవ్వనున్నట్లు సమాచారం. నిషేధానికి ముందు లోడింగ్ ప్రారంభమైన సరుకులు, భారత ఓడరేవుల వద్ద ఇప్పటికే లంగరు వేసిన నౌకలు, లేదా కస్టమ్స్‌కు ముందుగానే అప్పగించిన నిల్వలకు ఎగుమతి అనుమతి కొనసాగనుంది. దీంతో విదేశీ కొనుగోలుదారులతో ఇప్పటికే కుదిరిన ఒప్పందాలకు కొంత ఉపశమనం లభించే అవకాశం ఉంది. ఈ నిర్ణయం విధానపరంగా పెద్ద మార్పుగా భావిస్తున్నారు. ఈ ఏడాది ప్రారంభంలో దేశీయ ఉత్పత్తి అవసరాలకు మించి ఉంటుందని అంచనా వేసిన కేంద్రం, 1.59 మిలియన్ టన్నుల చక్కెర ఎగుమతికి అనుమతి ఇచ్చింది. కానీ ప్రధాన ఉత్పత్తి రాష్ట్రాల్లో చెరకు దిగుబడులు తగ్గడం, వాతావరణ అనిశ్చితి పెరగడం పరిస్థితిని మార్చేశాయి. పరిశ్రమ వర్గాల అంచనాల ప్రకారం, వరుసగా రెండో ఏడాది కూడా భారత్ వినియోగించే మొత్తానికి తక్కువ చక్కెరనే ఉత్పత్తి చేసే అవకాశాలు కనిపిస్తున్నాయి. వాతావరణ నిపుణులు అభివృద్ధి చెందుతున్న ఎల్‌నినో ప్రభావంపై కూడా హెచ్చరిస్తున్నారు. పశ్చిమ, దక్షిణ భారతదేశాల్లో చెరకు సాగుకు కీలకమైన నైరుతి రుతుపవనాలు బలహీనపడే అవకాశం ఉండటంతో, భవిష్యత్ ఉత్పత్తిపై మరింత అనిశ్చితి నెలకొంది. బలహీనమైన వర్షాలు వస్తే సరఫరా ఒత్తిడి మరింత పెరిగే ప్రమాదం ఉందని వ్యాపారులు భావిస్తున్నారు. ఇప్పటికే ఆమోదించిన ఎగుమతి కోటాలో దాదాపు 8 లక్షల టన్నుల సరుకులకు ఒప్పందాలు కుదిరాయి. అందులో 6 లక్షల టన్నులకు పైగా సరుకు విదేశాలకు తరలిపోయినట్లు సమాచారం. ఇప్పుడు మిగిలిన సరఫరాలను ఎలా నిర్వహించాలన్న దానిపై వ్యాపారులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. భారత్ ప్రపంచంలో రెండో అతిపెద్ద చక్కెర ఉత్పత్తిదారుగా ఉండటంతో, ఈ నిర్ణయం అంతర్జాతీయ మార్కెట్లపై కూడా ప్రభావం చూపుతోంది. ఆసియా, ఆఫ్రికా దేశాలు ఇప్పుడు సరఫరాల కోసం బ్రెజిల్, థాయిలాండ్‌ల వైపు మొగ్గు చూపే అవకాశం ఉందని మార్కెట్ వర్గాలు చెబుతున్నాయి. ఈ ప్రకటన తర్వాత అంతర్జాతీయ మార్కెట్లో ముడి చక్కెర, తెల్ల చక్కెర ఫ్యూచర్స్ ధరలు పెరిగాయి. ప్రస్తుతం మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, పెరుగుతున్న ముడి చమురు ధరలు, గ్లోబల్ సరఫరా గొలుసు అంతరాయాల మధ్య భారత్ తీసుకుంటున్న ఈ రక్షించే ప్రయత్నంగానే కనిపిస్తున్నాయి.

## పాతకాలం నాటి సమ్మర్ పోలం పండు జ్యూస్..

## బాడీ మొత్తం కూల్ కూల్.. ఆ రోజుల్లో తాతలు, నానమ్మలు తాగేవాళ్ళు..

ఎండలు మండిపోతున్నాయి ఈ భయకరమైన వేడిని తగ్గించి శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచి, ఒంటికి చలువ చేసే ఈ పుచ్చకాయ సబ్జా జ్యూస్ ప్రతి ఒక్కరూ తాగాల్సిందే. దీనినే కొందరు పల్లెటూరిలో పొలం పండు డ్రింక్ అని కూడా పిలుస్తారు. అయితే, వీటిని కేవలం 15 నిమిషాల్లోనే చేసుకుని తాగొచ్చు. ఒక పుచ్చకాయ ఉంటే ఎక్కడికి వెళ్లకుండా ఇంట్లోనే సులభంగా తయారు చేసుకుని కూల్ కూల్ గా తాగొచ్చు.





ఓ వైపు ఎండలు మండిపోతున్నాయి ఇలాంటి భయకరమైన వేడిని తగ్గించి శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచి, ఒంటికి చలువ చేసే ఈ పుచ్చకాయ సబ్జా జ్యూస్ ప్రతి ఒక్కరూ తాగాల్సిందే. దీనినే కొందరు పల్లెటూరిలో పొలం పండు డ్రింక్ అని కూడా పిలుస్తారు. అయితే, వీటిని కేవలం 15 నిమిషాల్లోనే చేసుకుని తాగొచ్చు. ఒక పుచ్చకాయ ఉంటే ఎక్కడికి వెళ్లకుండా ఇంట్లోనే సులభంగా తయారు చేసుకుని కూల్ కూల్ గా తాగొచ్చు. ఓ వైపు ఎండలు మండిపోతున్నాయి ఇలాంటి భయకరమైన వేడిని తగ్గించి శరీరాన్ని హైడ్రేట్‌గా ఉంచి, ఒంటికి చలువ చేసే ఈ పుచ్చకాయ సబ్జా జ్యూస్ ప్రతి ఒక్కరూ తాగాల్సిందే. దీనినే కొందరు పల్లెటూరిలో పొలం పండు డ్రింక్ అని కూడా పిలుస్తారు. అయితే, వీటిని కేవలం 15 నిమిషాల్లోనే చేసుకుని తాగొచ్చు. ఒక పుచ్చకాయ ఉంటే ఎక్కడికి వెళ్లకుండా ఇంట్లోనే సులభంగా తయారు చేసుకుని కూల్ కూల్ గా తాగొచ్చు.దపుచ్చకాయ సబ్జా జ్యూస్ కు కావాల్సిన పదార్థాలు : ఒక కప్పు పుచ్చకాయ ముక్కలు, రెండు టేబుల్ స్పూన్స్ నానబెట్టిన సబ్జా గింజలు, ఒక టేబుల్ స్పూన్ నిమ్మరసం, 10 పుదీనా ఆకులు, రుచికి సరిపడా ఉప్పు, ఇంకా ఒక టేబుల్ స్పూన్ తేనె లేదా పంచదారను తీసుకోవాలి, ఒక కప్పు ఐస్ ముక్కలు కూడా తీసుకోవాలి. దీనిని కూల్ కూల్ గా తాగితే ఆ మజానే వేరు. మీరు కూడా ట్రై చేయండి. పుచ్చకాయ సబ్జా జ్యూస్ కు కావాల్సిన పదార్థాలు : ఒక కప్పు పుచ్చకాయ ముక్కలు, రెండు టేబుల్ స్పూన్స్ నానబెట్టిన సబ్జా గింజలు, ఒక టేబుల్ స్పూన్ నిమ్మరసం, 10 పుదీనా ఆకులు, రుచికి సరిపడా ఉప్పు, ఇంకా ఒక టేబుల్ స్పూన్ తేనె లేదా పంచదారను తీసుకోవాలి, ఒక కప్పు ఐస్ ముక్కలు కూడా తీసుకోవాలి. దీనిని కూల్ కూల్ గా తాగితే ఆ మజానే వేరు. మీరు కూడా ట్రై చేయండి. పుచ్చకాయ సబ్జా జ్యూస్ తయారీ విధానం : ముందుగా ఒక గిన్నెలో సబ్జా గింజలు తీసుకుని వాటిని నీటిలో బాగానానబెట్టుకోవాలి. ఇంకా దీనిలో సరిపడా నీళ్లు పోసి కనీసం 30 నిమిషాల పాటు నానాబెట్టి పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత ఒక పెద్ద పుచ్చకాయను తీసుకుని దానిని బాగా కడిగి ముక్కలుగా చేసుకుని ఒక ప్లేట్ లేదా గిన్నెలో పెట్టుకోవాలి. పుచ్చకాయ సబ్జా జ్యూస్ తయారీ విధానం : ముందుగా ఒక గిన్నెలో సబ్జా గింజలు తీసుకుని వాటిని నీటిలో బాగానానబెట్టుకోవాలి. ఇంకా దీనిలో సరిపడా నీళ్లు పోసి కనీసం 30 నిమిషాల పాటు నానాబెట్టి పక్కన పెట్టుకోవాలి. ఆ తర్వాత ఒక పెద్ద పుచ్చకాయను తీసుకుని దానిని బాగా కడిగి ముక్కలుగా చేసుకుని ఒక ప్లేట్ లేదా గిన్నెలో పెట్టుకోవాలి. ఇప్పుడు మిక్సీ జార్ తీసుకుని దానిలో ఒక కప్పు పుచ్చకాయ ముక్కలు, 10 కడిగిన పుదీనా ఆకులు, తగినంత ఉప్పు, ఒక టేబుల్ స్పూన్ నిమ్మరసం, ఇంకా కొద్దిగా పంచదార కూడా వేసి వాటిని మెత్తగా మిక్సీ పట్టుకోవాలి. ఇప్పుడు ఒక గ్లాస్ తీసుకుని దానిలో నానబెట్టుకున్న సబ్జా గింజలు, కట్ చేసిన పుచ్చకాయ ముక్కలు కూడా వేసి గ్రైండ్ చేసుకున్న ఈ జ్యూస్ ను వడపోసి, అలాగే దీనిలో ఐస్ క్యూబ్స్ కూడా వేసి కలుపుకుని తాగడమే. ఇప్పుడు మిక్సీ జార్ తీసుకుని దానిలో ఒక కప్పు పుచ్చకాయ ముక్కలు, 10 కడిగిన పుదీనా ఆకులు, తగినంత ఉప్పు, ఒక టేబుల్ స్పూన్ నిమ్మరసం, ఇంకా కొద్దిగా పంచదార కూడా వేసి వాటిని మెత్తగా మిక్సీ పట్టుకోవాలి. ఇప్పుడు ఒక గ్లాస్ తీసుకుని దానిలో నానబెట్టుకున్న సబ్జా గింజలు, కట్ చేసిన పుచ్చకాయ ముక్కలు కూడా వేసి గ్రైండ్ చేసుకున్న ఈ జ్యూస్ ను వడపోసి, అలాగే దీనిలో ఐస్ క్యూబ్స్ కూడా వేసి కలుపుకుని తాగడమే. ఈ జ్యూస్ తాగడం వలన ప్రయోజనాలు ఇవే.. ఇది శరీర వేడిని ఈజీగా తగ్గిస్తుంది. ఇంకా వేసవిలో వచ్చే వడదెబ్బ నుంచి కూడా ఇది కాపాడుతుంది.ఇంకా డీహైడ్రేషన్ సమస్యకు ను కూడా ఇది నివారిస్తుంది. ఎందుకంటే, పుచ్చ పండులో నీటి శాతం అధికంగా ఉంటుంది. ఇంకా ఎక్కువగా దీనిని తినడం వలన ఉండటం వల్ల బాడీని కూల్ గా ఉంచుతుంది. జీర్ణక్రియను కూడా ఇది మెరుగుపరుస్తుంది. సబ్జా గింజలు కడుపు మంటకు చెక్ పెట్టి జీర్ణక్రియ పనితీరుకు ఇది సహాయపడుతుంది. ఈ జ్యూస్ తాగడం వలన ప్రయోజనాలు ఇవే.. ఇది శరీర వేడిని ఈజీగా తగ్గిస్తుంది. ఇంకా వేసవిలో వచ్చే వడదెబ్బ నుంచి కూడా ఇది కాపాడుతుంది.ఇంకా డీహైడ్రేషన్ సమస్యకు ను కూడా ఇది నివారిస్తుంది. ఎందుకంటే, పుచ్చ పండులో నీటి శాతం అధికంగా ఉంటుంది. ఇంకా ఎక్కువగా దీనిని తినడం వలన ఉండటం వల్ల బాడీని కూల్ గా ఉంచుతుంది. జీర్ణక్రియను కూడా ఇది మెరుగుపరుస్తుంది. సబ్జా గింజలు కడుపు మంటకు చెక్ పెట్టి జీర్ణక్రియ పనితీరుకు ఇది సహాయపడుతుంది.

## మజ్జిగ తాగితే 'బీపీ' తగ్గుతుందా?

# అధ్యయనాలు ఏం చెబుతున్నాయంటే!

**మజ్జిగలో ఎన్ని పోషకాలో! - నిమిషాల్లో నిస్సత్తువ మాయం అంటున్న నిపుణులు!!**



పాలు, పెరుగు, వెన్న, నెయ్యి ఇలా పాల పదార్థాలేవైనా కావాల్సినన్ని పోషకాలు అందిస్తాయి. కానీ, వాటన్నింటిలో మజ్జిగ ఇచ్చే ప్రయోజనాలే ఎక్కువగా ఉంటాయట. ఎండల్లో జావ, కొబ్బరినీళ్లు, పండ్లరసాల్లాంటివి ఎంతో మేలు చేస్తాయని తెలిసిందే. అయితే, మజ్జిగ ప్రత్యేకతే వేరు. ఇది చల్లచల్లగా దాహం తీరుస్తూనే, నిమిషాల్లో నిస్సత్తువను మాయం చేస్తుందంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో మజ్జిగ తాగడం వల్ల ఎలాంటి ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయో ఇప్పుడు తెలుసుకుందాం! బెస్ట్ రీ హైడ్రేట్ డ్రింక్ గా పేరున్న మజ్జిగ నేచురల్ కూలింగ్ ఫుడ్ గానూ పేరొందింది. దీంట్లో బి12 విటమిన్, పొటాషియం, క్యాల్షియం, ప్రొటీన్లు అధిక మొత్తంలో ఉంటాయి. జీర్ణ సంబంధిత సమస్యలతో బాధపడే వారికి మజ్జిగ దివ్యౌషధంలా పనిచేస్తుందట. ఇందులోని లాక్టోబాసిల్లస్ బ్యాక్టీరియా పొట్ట ఆరోగ్యానికి మంచిదని నిపుణులు చెబుతున్నారు. అజీర్తి, కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటివి చాలా వరకూ తగ్గుతాయంటున్నారు. అంతేకాదు, పెద్దపేగు క్యాన్సర్, స్టమక్ ఇన్ ఫెక్షన్లు దరిచేరవని పలు అధ్యయనాల్లో తేలింది. మజ్జిగ తాగడం వల్ల పొట్టలోని హానికరమైన వైరస్, బ్యాక్టీరియాలతో పాటు ఇతర వ్యర్థాలూ శరీరం నుంచి తొలగిపోతాయి. దీని వల్ల లివర్ ఆరోగ్యంగా ఉంటుంది. బీపీలో తేడా ఉన్నవాళ్లు ఉప్పు లేకుండా మజ్జిగని తీసుకోవడం చాలా మంచిదని పరిశోధనల్లోనూ తేలింది. మజ్జిగ తీసుకోవడం సిస్టోలిక్ రక్తపోటు, సగటు ధమనుల రక్తపోటును గణనీయంగా తగ్గించిందని ంఎఱవఅఎవంఱతీవష్ పేర్కొంది. వేసవిలో చెమట రూపంలో బాడీ నుంచి నీరు, ముఖ్యమైన ఖనిజ లవణాలు బయటకు వెళ్లిపోతాయి. అలాంటప్పుడు మజ్జిగలో ఉండే ఖనిజాలు ఆ లోటును భర్తీ చేసి శరీరాన్ని డీ హైడ్రేషన్ నుంచి కాపాడతాయట ఇందులో పోషకాలు సమృద్ధి ఉంటాయి. దీనివల్ల తక్షణ శక్తి వస్తుంది. మజ్జిగలో యాంటీ ఇన్ ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. ఇవి నోటి సమస్యలను దరిచేరనీయవు. చెడు కొలెస్ట్రాల్ ని తగ్గించి గుండెను ఆరోగ్యంగా ఉంచడంలోనూ మజ్జిగ అద్భుతంగా పనిచేస్తుంది. మజ్జిగ తాగడం వల్ల పురుషులు, మహిళలలో కొలెస్ట్రాల్ తగ్గే అవకాశం ఉందని పేర్కొంది. తక్కువ క్యాలరీలూ, ఎక్కువ పోషకాలతో ఉండే ఈ డ్రింక్- బరువు తగ్గాలని ప్రయత్నించే వారికీ సూపర్ ఫుడ్ అని చెప్పాలి. ఇందులో అధికంగా ఉండే క్యాల్షియం ఎముకల్నీ, దంతాల్నీ దృఢంగా ఉంచుతుంది. ఇందులోని ప్రొబయోటిక్స్ వల్ల వ్యాధినిరోధక శక్తి కూడా పెరుగుతుందని నిపుణులు చెబుతున్నారు. మజ్జిగలోని లాక్టిక్ ఆమ్లం చర్మాన్ని ప్రకాశవంతంగా, మృదువుగా ఉంచుతుంది. ఇందులోని ట్రిప్టోఫాన్ ఒత్తిడిని తగ్గించి, ప్రశాంతంగా నిద్రపోయేలా చేస్తుందట. ఒక్క మాటలో చెప్పాలంటే మజ్జిగను తాగడం వల్ల అనేక రకాల రోగాలు తగ్గిపోయాయి. కాస్త జాగ్రత్త : కొత్తిమీర, పుదీనా, అల్లం, జీలకర్ర తదితర పదార్థాల్ని వేస్తూ ఒక్కోచోట ఒక్కోరకంగా ఈ మజ్జిగను తయారు చేసుకుంటారు. కొంతమంది పెరుగును చిలికి వెన్న తీయకుండా చక్కెర కలిపి చేసే లస్సీనీ ఇష్టపడుతుంటారు. అయితే, వీటిలో కొవ్వు శాతాల్లో తేడా ఉంటుందట. అందుకే, ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకుని ఎంచుకోవాలంటున్నారు నిపుణులు. ఇంకో విషయం ఏంటంటే, మజ్జిగ ఆరోగ్యానికి మంచిదే! కానీ, ఎక్కువ భాగం నీటితో ఉండే ఈ పానీయాన్ని ఎక్కడ పడితే అక్కడ తాగడం వల్ల ఆరోగ్య సమస్యలు వచ్చే ప్రమాదం ఉందని హెచ్చరిస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# ప్రసవానంతరం ఏం జరుగుతుంది? - వైద్యులు ఏమంటున్నారంటే!

**ప్రసవానంతరం ఆరోగ్యంపై ప్రభావం - ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో తెలుసా?**



ప్రసవానంతరం మహిళల శరీరంలో ఎన్నో రకాల మార్పులు కనిపిస్తుంటాయి. బరువు తగ్గడం లేదా పెరగడం, మూడ్ స్వింగ్స్ వంటివి చాలామందిలో కనిపించడం సహజం. అయితే, కొంతమంది వీటి మాదిరిగానే కొన్ని ఇతర లక్షణాలు, సమస్యల్ని సర్వసాధారణమే అనుకొని నిర్లక్ష్యం చేస్తుంటారు. ఇది దీర్ఘకాలంలో ఆరోగ్యాన్ని దెబ్బతీస్తుందంటున్నారు నిపుణులు. అందుకే, బాలింతల్లో ఈ సమస్యలు, లక్షణాలు కనిపిస్తే అశ్రద్ధ చేయద్దని, వెంటనే డాక్టర్ ను సంప్రదించాలని సూచిస్తున్నారు. ఈ క్రమంలో ఇంతకీ ఏంటా సమస్యలు? ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలి? లాంటి విషయాల గురించి ఇప్పుడు తెలుసుకుందాం!

**అలసట, నీరసం :**

బిడ్డకు జన్మనిచ్చే క్రమంలో శరీరం శక్తిని కోల్పోయి నీరసించి పోతుంది. ఆ తర్వాతా ఐదారు వారాల పాటు ఈ నీరసం, అలసట అలాగే ఉంటుంది. ప్రసవానంతరం తీసుకునే ఆహారం, విశ్రాంతితో ఈ సమస్య క్రమంగా దూరమవుతుంది. కానీ, కొంతమందిలో ఈ లక్షణాలు వారాల తరబడి అలాగే వేధిస్తుంటాయట. అయితే, ప్రసవం తర్వాత ఆరువారాలు దాటినా, చక్కగా విశ్రాంతి తీసుకున్నా, శరీరంలో అలసట, నీరసం కనిపిస్తే అది ఎనీమియా, థైరాయిడ్, విటమిన్ లోపం వల్ల అయి ఉండచ్చని నిపుణులు చెబుతున్నారు. అందుకే, దీన్ని నిర్లక్ష్యం చేయకుండా డాక్టర్ ని సంప్రదించి తగిన చికిత్స తీసుకుంటే, ఇటు తల్లికి, అటు బిడ్డకూ మంచిదని సూచిస్తున్నారు. అకస్మాత్తుగా చాలా అలసిపోయి, నీరసంగా ఉండటం, ఇది దీర్ఘకాలిక అలసట లాంటిది కాదని పేర్కొంది.

**బ్లీడింగ్ ఆగట్లేదా? :**

నార్మల్ లేదా సిజేరియన్ డెలివరీ అయినా తర్వాత కూడా బ్లీడింగ్ సహజమే. అయితే, క్రమంగా తగ్గుతూ కొన్ని వారాల తర్వాత ఆగిపోతుంది. అయితే, కొందరిలో ఇది వారాల తరబడి కొనసాగుతూనే ఉంటుందట. ఇంకొంతమందిలో గడ్డల మాదిరిగా రక్తస్రావం అవుతుందని నిపుణులు చెబుతున్నారు. ఈ లక్షణాలు కనిపిస్తే నిర్లక్ష్యం చేయద్దంటున్నారు. ముఖ్యంగా, ఆరు వారాల తర్వాత కూడా బ్లీడింగ్, స్పాటింగ్ కనిపిస్తే అది ఇన్ఫెక్షన్, హార్మోన్ల అసమతుల్యత వంటి సమస్యలకు సూచన కావచ్చని హెచ్చరిస్తున్నారు. కాబట్టి, డాక్టర్ ని సంప్రదించి అసలు సమస్య ఏంటో తెలుసుకొని త్వరితగతిన చికిత్స తీసుకోవడం మంచిదట. అధిక రక్తస్రావం, రక్తపోటు, గుండె వైఫల్యం, రక్తపు గడ్డలు, డిప్రెషన్ ప్రసవానంతర సమస్యలు తీవ్రమైన అనారోగ్యానికి లేదా మరణానికి కారణం కావచ్చని పేర్కొంది.

**మంటగా అనిపించడం :**

డెలివరీ తర్వాత కొంతమందిలో మూత్ర విసర్జన చేస్తున్నప్పుడు మంట రావడం, మూత్రనాళ సంబంధిత ఇన్ఫెక్షన్లు మామూలే! అయితే, కోలుకునే కొద్దీ ఇవి తగ్గిపోవడానికి బదులు తీవ్రమవుతాయని నిపుణులు చెబుతున్నారు. ఈ క్రమంలో సుదీర్ఘ ప్రసవం, ఈ సమయంలో ఉపయోగించే క్యాథెటర్ వల్ల మూత్రాశయానికి గాయమవడం వంటివీ మూత్ర విసర్జన సమయంలో మంట తగ్గకపోవడానికి కారణాలుగా పేర్కొంటున్నారు. కాబట్టి, రోజులు గడిచే కొద్దీ మంట తీవ్రమైతే డాక్టర్ ని సంప్రదించి తగిన చికిత్స తీసుకోవాలని సూచిస్తున్నారు. అలాగే, కొంతమందిలో ప్రసవం తర్వాత తుమ్మినా, దగ్గినా మూత్రం పడుతుంటుంది. డెలివరీ టైంలో కటి వలయపు కండరాలు బలహీన పడడం వల్ల ఇలా జరుగుతుందని పేర్కొంది. ఈ సమస్యను దూరం చేసుకోవాలంటే, కటి వలయపు కండరాల్ని తిరిగి దృఢంగా చేసుకోవడం ముఖ్యమంటున్నారు. ఇందుకోసం డాక్టర్ సమక్షంలో ఫిజియోథెరపీ తీసుకోవడం మంచిదని సూచిస్తున్నారు.

**ఆ నొప్పులు తగ్గకపోతే :**

ప్రసవం తర్వాత ఒంటి నొప్పులూ సర్వ సాధారణమే! అయితే, కోలుకునే కొద్దీ ఇవి తగ్గిపోతాయి. అలాకాకుండా, నెలల తరబడి నడుం నొప్పి, కీళ్ల నొప్పులు, కటి భాగంలో నొప్పి కొనసాగితే నిర్లక్ష్యం చేయవద్దంటున్నారు నిపుణులు. ఈ క్రమంలో ప్రసవం వల్ల కోర్ కండరాలు బలహీనపడడం, కటి భాగంపై పడే ఒత్తిడి, బిడ్డకు పాలిచ్చే సమయంలో సరైన భంగిమలో కూర్చోకపోవడం వంటివి ఈ నొప్పులు దీర్ఘకాలం పాటు కొనసాగడానికి కారణమవుతాయని చెబుతున్నారు. అందుకే, ఆలస్యం చేయకుండా డాక్టర్ ని సంప్రదించి ఫిజియోథెరపీ, ఇతర చికిత్సలు తీసుకోవడం మంచిదంటున్నారు.

**డిప్రెషన్ లోకి వెళ్లకుండా :**

డెలివరీ తర్వాత హార్మోన్ల స్థాయిల్లో హెచ్చుతగ్గుల వల్ల మూడ్ స్వింగ్స్ వస్తుంటాయి. ఫలితంగా, డల్ గా కనిపించడం, కోపం, చిరాకు వంటి లక్షణాలు కనిపిస్తాయి. అయితే, రోజులు గడిచే కొద్దీ ఇవి క్రమంగా దూరమవుతుంటాయట. అలాకాకుండా, ఈ ఒత్తిడి దీర్ఘకాలం పాటు కొనసాగితే అది పోస్ట్ పార్టమ్ డిప్రెషన్ గా పరిగణించాలని నిపుణులు చెబుతున్నారు. వాస్తవానికి, దీనివల్ల తల్లిపైనే కాదు, బిడ్డ ఆరోగ్యంపైనా ప్రతికూల ప్రభావం పడుతుందని హెచ్చరిస్తున్నారు. కాబట్టి, డాక్టర్ల సహాయం తీసుకుంటూ, ఈ సమస్య నుంచి ఎంత త్వరగా బయటపడితే అంత మంచిదని సూచిస్తున్నారు. ఇలా ఈ సమస్యలు, లక్షణాల్ని నిర్లక్ష్యం చేయకుండా చక్కటి పోషకాహారం తీసుకోవాలంటున్నారు నిపుణులు. అలాగే, కొన్ని వారాలు గడిచాక డాక్టర్ సలహా మేరకు చిన్నపాటి వ్యాయామాల్ని రోజువారీ జీవనశైలిలో భాగం చేసుకుంటే, ప్రసవానంతర సమయాన్ని పూర్తిగా ఆస్వాదించచ్చని సలహా ఇస్తున్నారు. ఇక్కడ మీకు అందించిన ఆరోగ్య సమాచారం, సూచనలు అన్నీ మీ అవగాహన కోసం మాత్రమే. శాస్త్ర పరిశోధనలు, అధ్యయనాలు, వైద్య, ఆరోగ్య, మానసిక నిపుణుల సూచనల ప్రకారమే మేము ఈ సమాచారాన్ని అందిస్తున్నాం. వీటిని పాటించే ముందు కచ్చితంగా మీ వ్యక్తిగత వైద్యుల సలహాలు తీసుకోవడమే మంచిది.

# డేంజర్ బెల్స్ మోగిస్తోన్న ఎబోలా.. వేగంగా వ్యాపిస్తోన్న కొత్తరకం

**డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో అరుదైన ఎబోలా వైరస్ కొత్తరకం తీవ్రకలకలం రేపుతోంది.**




డెమొక్రాటిక్ రిపబ్లిక్ ఆఫ్ కాంగోలో అరుదైన ఎబోలా వైరస్ కొత్తరకం తీవ్రకలకలం రేపుతోంది. ఈ ప్రాణాంతక వైరస్ బారిన పడి మరణించిన వారి సంఖ్య 131కి చేరింది. దీంతో ప్రపంచ ఆరోగ్య సంస్థ.. ఎబోలా వైరస్ కొత్త స్ట్రెయిన్ ను ఇప్పటికే పబ్లిక్ హెల్త్ ఎమర్జెన్సీగా ప్రకటించింది. కాంగో తూర్పు ప్రాంతంలో ఈ అరుదైన 'బుండిబుగ్యో' వేరియంట్ బారిన పడి 513 మంది వైద్యం తీసుకుంటున్నట్లు వైద్యులు చెప్తున్నారు. అక్కడ ఈ ప్రాణాంతక వైరస్ బారిన పడిన ఒక అమెరికా పౌరుడిని అత్యవసర చికిత్స నిమిత్తం జర్మనీకి తరలిస్తున్నట్లు అమెరికా వ్యాధి నియంత్రణ, నివారణ కేంద్రం మంగళవారం ప్రకటించింది. బాధితుడిని 'సెర్జ్ క్రిస్టియన్ మిషన్' అనే సంస్థకు చెందిన మెడికల్ మిషనరీ పీటర్ స్టాఫోర్డ్‌గా గుర్తించారు. అమెరికా అధికారుల అభ్యర్థన మేరకు బెర్లిన్‌లోని ప్రముఖ 'చారిటీ యూనివర్శిటీ హాస్పిటల్' లో ఉన్న ప్రత్యేక ఐసోలేషన్ వార్డులో ఆయనకు చికిత్స అందించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు జర్మనీ ఆరోగ్య మంత్రిత్వ శాఖ ధృవీకరించింది. అత్యంత ప్రమాదకరమైన అంటువ్యాధుల నిర్వహణలో జర్మనీకి చెందిన నిపుణుల బృందం నిరంతరం పర్యవేక్షిస్తుందని అక్కడి అధికార ప్రతినిధి తెలిపారు. అయితే.. అమెరికా విధించిన ఈ ప్రయాణ ఆంక్షలపై ఆఫ్రికా సిడిసి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేసింది. కేవలం సరిహద్దులను మూసివేయడం వల్ల గ్లోబల్ హెల్త్ సెక్యూరిటీని సాధించలేమని, వ్యాధి మూలాలను అణచివేయడానికి అంతర్జాతీయంగా దూకుడుగా మద్దతు ఇవ్వడమే ఏకైక మార్గమని ఆఫ్రికా సిడిసి డైరెక్టర్ జనరల్ డాక్టర్ జీన్ కసేయా అభిప్రాయపడ్డారు. ఇదిలావుండగా, ప్రెసిడెంట్ డోనాల్డ్ ట్రంప్ పరిపాలనలో యుఎస్ సిడిసి నిధులలో కోతలు విధించడం, ఈ ఏడాది ప్రపంచ ఆరోగ్య సంస్థ (ఔూా) నుండి అమెరికా అధికారికంగా వైదొలగడం వంటి పరిణామాలు, ప్రస్తుత ఎబోలా సహాయక చర్యలపై, అంతర్జాతీయ సమన్వయంపై తీవ్ర ప్రభావం చూపుతాయని ప్రజారోగ్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

# ఈస్ట్రోజెన్ సమస్యలతో బాధపడుతున్నారా? ఆ రెండు ప్రాబ్లమ్స్ సాల్వ్ చేయకపోతే డేంజరే

**శరీరంలో పేరుకుపోయే అదనపు ఈస్ట్రోజెన్‌ను ప్రాసెస్ చేసి, వ్యర్థాల రూపంలో బయటకు పంపే ప్రధాన బాధ్యత లివర్‌దే. మొదట లివర్ ఈస్ట్రోజెన్‌ను విచ్ఛిన్నం చేసి, ఆపై శరీరం నుండి బయటకు వెళ్లేలా ప్యాక్ చేస్తుంది. ఒకవేళ లివర్ పనితీరు మందగిస్తే ఈస్ట్రోజెన్ పూర్తిగా బయటకు వెళ్లకుండా మళ్లీ శరీరంలోనే తిరుగుతుంది. దీనినే వైద్య పరిభాషలో 'ఈస్ట్రోజెన్ డామినెన్స్' అని పిలుస్తారు. దీనివల్ల మహిళల్లో పీరియడ్స్ సమస్యలు, మూడ్ స్వింగ్స్, బరువు పెరగడం వంటి లక్షణాలు కనిపిస్తాయి.**



ఆధునిక కాలంలో హార్మోన్ల అసమతుల్యత సమస్యతో బాధపడే మహిళల సంఖ్య రోజురోజుకీ పెరిగిపోతోంది. మారిన జీవన విధానం, సమయం కాని సమయంలో తినడం, పోషకాహార లోపం వంటి చెడు అలవాట్లే ఈ పరిస్థితికి ప్రధాన కారణాలుగా మారుతున్నాయి. అయితే, హార్మోన్ల సమస్యలు ఎదుర్కొంటున్న చాలా మంది మహిళలు వెంటనే మార్కెట్లో దొరికే సప్లిమెంట్స్ లేదా హార్మోన్ బ్యాలెన్సింగ్ ప్రొడక్ట్స్ వైపు మొగ్గు చూపుతుంటారు. కానీ, శరీరం లోపల నుండి సిద్ధంగా లేనప్పుడు ఇలాంటి ప్రయత్నాలు ఎలాంటి ఫలితాన్ని ఇవ్వకపోగా, సమస్యలను మరింత పెంచే ప్రమాదం ఉందని పోషకాహార నిపుణులు హెచ్చరిస్తున్నారు. ముఖ్యంగా శరీరంలో ఈస్ట్రోజెన్ హార్మోన్ స్థాయిలు పెరిగినప్పుడు వచ్చే లక్షణాలను తగ్గించాలంటే, అన్నింటికంటే ముందుగా కాలేయం (లివర్), గట్ (జీర్ణవ్యవస్థ) పనితీరును మెరుగుపరచడం అత్యంత అవసరం.

**గట్ ఆరోగ్యమే ముఖ్యం..**

ఈ హార్మోన్ల లోపాన్ని సరిచేయడానికి ముందుగా గట్ హెల్త్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని నిపుణులు సూచిస్తున్నారు. ప్రతిరోజూ ఆహారంలో 25 నుండి 35 గ్రాముల ఫైబర్ (పీచు పదార్థం) తీసుకోవడం ద్వారా జీర్ణవ్యవస్థను అద్భుతంగా మెరుగుపరచవచ్చు. ఇందుకోసం అరటి పండ్లు, మునగ ఆకులు, మెంతులు, అవిసె గింజలు వంటి సహజసిద్ధమైన ఆహారాలను రోజువారీ డైట్‌లో భాగం చేసుకోవాలి. అయితే, శరీరం ఎంతవరకు ఫైబర్‌ను తట్టుకోగలదో దాన్ని బట్టి మాత్రమే మోతాదును నిర్ణయించుకోవాలి. వీటితో పాటు పెరుగు, కాంజీ, ఇంట్లో తయారుచేసిన పచ్చళ్ళ వంటి ఫెర్మెంటెడ్ ఫుడ్స్ (పులియబెట్టిన ఆహారాలు) కూడా పొట్టలోని మంచి బ్యాక్టీరియాను పెంచి గట్ ఆరోగ్యానికి మేలు చేస్తాయి.దజీర్ణవ్యవస్థ సాఫీగా మారిన తర్వాత లివర్‌కు అవసరమైన పోషకాలను అందించడం ముఖ్యం. గుడ్లు, షిటాకే మష్రూమ్స్‌లో ఉండే కొలిన్ అనే పోషకం లివర్ పనితీరును మెరుగుపరుస్తుంది. అలాగే ఉల్లిపాయ, వెల్లుల్లిలో ఉండే సల్ఫర్ సమ్మేళనాలు కాలేయంలోని డిటాక్సిఫికేషన్ (కల్మషాలను తొలగించే) ప్రక్రియకు మద్దతిస్తాయి. ఆకుకూరలు, ఉడికించిన పప్పుల్లో ఉండే సహజ ఫోలేట్, సన్‌ఫ్లవర్ గింజల్లో లభించే విటమిన్ బి6 హార్మోన్ల సమతుల్యతకు ఎంతగానో తోడ్పడతాయి.

**ఈస్ట్రోజెన్ పునఃశోషణను అడ్డుకోవడం ఎలా?**

శరీరం ప్యాక్ చేసిన ఈస్ట్రోజెన్ వ్యర్థాలు గట్ నుండి మళ్లీ రక్తంలోకి శోషించబడకుండా అడ్డుకోవడం మరొక ముఖ్యమైన ఘట్టం. నారింజ, యాపిల్ వంటి పండ్లలో ఉండే గ్లూకారిక్ యాసిడ్ ఈ ప్రక్రియలో అద్భుతంగా సహాయపడుతుంది. ఇది గట్‌లో ఉండే కొన్ని హానికరమైన ఎంజైమ్స్‌ను అడ్డుకొని, ఈస్ట్రోజెన్ మళ్లీ శరీరంలోకి వెళ్లకుండా నిరోధిస్తుంది. ముఖ్యంగా మలబద్ధకం సమస్య ఉన్నవారిలో వ్యర్థాలు సక్రమంగా బయటకు వెళ్లవు. దీనివల్ల హార్మోన్ల అసమతుల్యత ఎక్కువ కాలం కొనసాగి సమస్యలు మరింత తీవ్రమవుతాయి. ఈ ప్రాథమిక దశలన్నీ సక్రమంగా పనిచేసిన తర్వాతే డిఐఎమ్ సప్లిమెంట్స్ గురించి ఆలోచించాలి. డిఐఎమ్ అనేది బ్రోకోలీ, కాలీఫ్లవర్, బ్రస్సెల్స్ స్ప్రౌట్స్ వంటి క్రూసిఫెరస్ కూరగాయల నుండి లభించే ఒక సహజ సమ్మేళనం. ఇది ఈస్ట్రోజెన్‌ను సురక్షిత మార్గంలో విచ్ఛిన్నం చేయడానికి తోడ్పడుతుంది. కానీ, గట్ మరియు లివర్ వ్యవస్థ క్లియర్ కాకముందే డిఐఎమ్ సప్లిమెంట్స్ తీసుకుంటే, శరీరంలో ఇప్పటికే ఉన్న బ్లాకేజ్ మరింత పెరిగి లక్షణాలు వికటించే ప్రమాదం ఉంది. అవసరమైతే నిపుణుల సలహాతో రోజుకు 1000 మిల్లీగ్రాముల డిఐఎమ్ పొడిని కొవ్వు ఉన్న ఆహారంతో కలిపి తీసుకోవచ్చు. అప్పటికీ హార్మోన్ల సమస్యలు తగ్గకపోతే, హార్మోన్ మెటబాలిజం ఏ దశలో ఇబ్బంది పడుతోందో తెలుసుకోవడానికి ప్రత్యేక పరీక్షలు చేయించుకోవాలి. అయితే చాలా మందికి ఆ అవసరం రాదు. ముందుగా జీర్ణవ్యవస్థను, కాలేయాన్ని శుభ్రపరుచుకుంటేనే హార్మోన్ల సమస్యల నుండి శాశ్వత ఉపశమనం లభిస్తుందని మహిళలు గుర్తుంచుకోవాలి.

# ఒత్తిడితో సతమతమవుతున్నారా? ఈ ఫుడ్స్ ను డైట్ లో చేర్చుకోండి!





నేటి బిజీ లైఫ్ లో చాలామంది ఒత్తిడికి గురవుతున్నారు. ఇంటి బాధ్యతలు, ఉద్యోగ సమస్యలతో సంతోషానికి దూరమవుతున్నారు. తమకు తాముగా లేదా తమ కుటుంబాలకు సమయం ఇవ్వలేకపోతున్నారు. అటువంటి పరిస్థితిలో, ఒత్తిడికి గురికావడం సహజం. మీరు ఒత్తిడి లేని జీవితాన్ని గడపాలనుకుంటే, ముందుగా మీకోసం సమయం కేటాయించుకోవాలని అంటున్నారు నిపుణులు. ఒత్తిడిని జయించేందుకు వ్యాయామాలు, యోగా, ట్రిప్ లకు వెళ్లడం వల్ల మానసిక స్థితి మెరుగుపడుతుంది. ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడే ఆహార పదా ర్థాలను డైట్ లో చేర్చుకుంటే మానసిక ఆనందం పొందొచ్చంటున్నారు నిపుణులు.

డార్క్ చాక్లెట్

డార్క్ చాక్లెట్ తినడం వల్ల శరీరంలో హ్యాపీ హార్మోన్లు విడుదలవుతాయి. ఇది మానసిక స్థితిని మెరుగుపరుస్తుంది. ఇందులో ఒత్తిడిని ఎదుర్కోవడానికి సహాయపడే యాంటీఆక్సిడెంట్లు కూడా ఉన్నాయి. మీరు దీన్ని పరిమిత పరిమాణంలో మాత్రమే తినాలని గుర్తుంచుకోండి. డార్క్ చాక్లెట్ అధికంగా తినడం వల్ల మీ ఆరోగ్యానికి హాని కలుగుతుంది.

అరటిపండు

అరటిపండు సులభంగా జీర్ణమయ్యే పండు. అరటిపండ్లలో విటమిన్ బి6, పొటాషియం, ట్రిప్టోఫాన్ ఉంటాయి. ఇవి మనస్సును ప్రశాంతంగా ఉంచుతాయి. ఇది మానసిక స్థితిని మెరుగుపరిచే అనుభూతి-మంచి న్యూరోట్రాన్స్మిటర్లను పెంచుతుంది.

బాదం, వాల్‌నట్‌లు

గింజల్లో మంచి మొత్తంలో మెగ్నీషియం, ఆరోగ్యకరమైన కొవ్వులు ఉంటాయి. ఇవి ఒత్తిడిని తగ్గించడంలో సహాయపడతాయి. వాల్‌నట్స్ ముఖ్యంగా మానసిక ఆరో గ్యానికి మంచివి. మానసిక స్థితిని స్థిరంగా ఉంచడంలో సహాయ పడతాయి. మీరు ప్రతి ఉదయం ఈ డ్రై ఫ్రూట్స్ ఖచ్చితంగా తినాలి.

బ్లూబెర్రీ

బ్లూబెర్రీ అనేది యాంటీఆక్సిడెంట్లు కలిగిన పండు. ఇవి శరీరాన్ని హానికరమైన ఒత్తిడి నుంచి రక్షించడానికి పనిచేస్తాయి. దీనితో పాటు, సంతోషకరమైన హార్మోన్లు కూడా విడుదల వుతాయి. ఇది మీకు మంచి అనుభూతిని కలి గిస్తుంది.

గ్రీన్ టీ :

గ్రీన్ టీలో ఎల్-థియనిన్ పుష్కలంగా ఉంటుంది. ముఖ్యంగా మనసుకు విశ్రాంతినిస్తుంది. దీనితో పాటు, ఇది ఒత్తిడి ప్రభావాలను కూడా తగ్గిస్తుంది.

## ఎండలు మండుతున్నాయ్ గురూ.. ఈ జాగ్రత్తలు తప్పక పాటించండి, లేదంటే?



వేసవి ఉష్ణోగ్రతలు అమాంతం పెరుగుతున్నాయి. తెలుగు రాష్ట్రాల్లోని పలు జిల్లాల్లో 41 డిగ్రీలు దాటి నమోదవుతున్నాయి. ఉదయం 9 గంటల నుంచే ఎండకు బయటకు రావాలంటే జనం జంకుతున్నారు. తేమ శాతం తగ్గిపోవడంతో ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరవుతున్నారు. వేడి తీవ్రత వడదెబ్బకు దారి తీసే ప్రమాదముంది. చాలామంది చల్లని పదార్థాలను తీసుకునేందుకు ఇష్టపడతారు. ఎండాకాలంలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు, శ్వాస సంబంధిత సమస్యలు ఉన్నవారు, శారీరక శ్రమ చేసే కార్మికులు ప్రత్యేక జాగ్రత్తలు తీసుకోవాలని వైద్య నిపుణులు సూచిస్తున్నారు. వడదెబ్బబారిన పడకుండా సాధ్యమైనంత వరకు నీడలో ఉండేలా చూసుకోవాలని, ఆహార నియమాలు, వస్త్రధారణ మార్పులు, శారీరక శ్రమను తగ్గించుకోవడం వంటి జాగ్రత్తలు పాటించాలని చెబుతున్నారు. పారిశ్రామిక, ఆర్టీసీ, ఉపాధి, వ్యవసాయ, ఇతర రంగాల కార్మికులు ఎండ ప్రదేశాల్లో పని చేయాల్సి ఉంటుంది. వీరంతా శారీరక రక్షణపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి. పలుచని కాటన్ దుస్తులు ధరించాలి. సరైన భోజనం తీసుకుంటూ శక్తిని కాపాడుకోవాలి. ప్రొటీన్లు, ఐరన్, కాల్షియం కలిగిన ఆహారాన్ని ఎక్కువగా తీసుకోవాలి. మసాలాలు, చక్కెర, ఉప్పు తగ్గించాలి. శరీర నొప్పులను తగ్గించుకునేందుకు తగినంత విశ్రాంతి తీసుకోవడం, వ్యాయామాలు చేయడం మంచిది. అతి చల్లని పదార్థాలు తీసుకుంటే దుష్ప్రభావాలు తప్పవు. శరీర ఉష్ణోగ్రతలకు అనుగుణంగా వాటిని తీసుకోవాలి. శీతల పానీయాలు, ఐస్‌క్రీములు తాత్కాలికంగా చల్లదనాన్ని కలిగించినా గొంతు ఇన్‌ఫెక్షన్లు, జీర్ణ సమస్యలు తలెత్తుతాయి. చల్లదనాన్ని కలిగించే కొబ్బరి నీరు, మజ్జిగ, బత్తాయి, ద్రాక్ష పండ్ల రసాలు, అరటి పండ్లు ఆరోగ్యానికి శ్రేయస్కరం. వేసవిలో దీర్ఘకాలిక వ్యాధిగ్రస్థులు ఆహారం, జీవన శైలిలో మార్పులు చేసుకోవాలి. పండ్లు, కూరగాయలు, తేలికపాటి ఆహారం తీసుకోవాలి. నిత్యం తగినంత నీరు తాగాలి. పొగ, మద్యం తాగడం వల్ల ఆరోగ్యంపై ప్రభావం ఉంటుంది. రక్తపోటు, మధుమేహం, గుండె, ఊపిరితిత్తుల సంబంధిత ఆరోగ్య పరీక్షలు చేయించుకుంటూ నివారణ చర్యలు తీసుకోవాలి. ఒత్తిడిని తగ్గించుకునేందుకు ధ్యానం, యోగా అభ్యాసం చేయాలి. నిద్ర సరిపోయేలా చూసుకోవాలి. శ్వాస సంబంధిత బాధితుల్లో ధూళి, పొగ, రసాయనాల కారణంగా ఊపిరితిత్తులు బలహీనపడే ప్రమాదం ఉంది. బహిరంగ ప్రదేశాల్లో ఎక్కువ సమయం గడపకుండా జాగ్రత్తపడాలి.



## బీపీ(రక్తపోటు) కంట్రోల్‌లో ఉండాలంటే, రోజు ఆ పండు ఒక్కటి తింటే చాలట!



రోజు ఒక అరటిపండు తినడం వలన రక్తపోటును సులభంగా తగ్గించుకోవచ్చని పరిశోధనలో వెల్లడైంది. అధిక రక్తపోటు(బీపీ) సమస్యతో బాధపడేవారు పొటాషియం కంటెంట్ ఎక్కువగా ఉండే ఆహారపదార్థాలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అయితే అరటి పండులో కరిగే ఫైబర్ అధికంగా ఉంటుంది. కొలెస్ట్రాల్‌ను కంట్రోల్ చేయడంతో పాటు రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రణలో ఉంచుతుంది కాబట్టి... గుండె సంరక్షణకు అరటి పండు ఎంతో దోహదం చేస్తుంది. ఇటీవలకాలంలో చాలా మంచి అధిక రక్తపోటు సమస్యతో బాధపడుతున్నారు. మారుతున్న జీవనశైలి, ఆహారపు అలవాట్ల కారణంగా చాలా మంది ఈ సమస్యను ఎదుర్కొంటున్నారు. బీపీని కంట్రోల్‌లో ఉంచుకునేందుకు అనేక ప్రయత్నాలు చేస్తున్నారు. రక్తపోటు సమస్య దీర్ఘకాలికంగా ఉన్నట్లయితే పలు రకాల ఆరోగ్య సమస్యలు రావచ్చు. టైమ్స్ ఆఫ్ ఇండియా కథనం ప్రకారం, అమెరికన్ జర్నల్ ఆఫ్ ఫిజియాలజీ పరిశోధనలో అరటి పండు తినడం వలన రక్తపోటును నియంత్రణలో ఉంచుకోవచ్చని వెల్లడైంది. పొటాషియం ఎక్కువగా, సోడియం కంటెంట్ తక్కువగా ఉండే ఆహార పదార్థాలు తీసుకోవడం వలన రక్తపోటు తగ్గుతుందని ఈ అధ్యయనంలో వెల్లడైంది.

**రోజు ఒక్క అరటిపండుతో బీపీకి చెక్ !**

రోజు ఒక్క అరటి పండు తింటే చాలు, రక్తపోటు నియంత్రణలో ఉంచుకోవచ్చని నిపుణులు సూచిస్తున్నారు. అరటి పండులో అధికంగా ఉన్నటువంటి పొటాషియం కంటెంట్ వలన బీపీ కంట్రోల్‌లో ఉంటుంది. ఒక సాధారణ సైజు అరటి పండులో సుమారుగా 400 నుంచి 450 గ్రాముల పొటాషియం కంటెంట్ ఉంటుంది. రోజులో శరీరానికి కావాల్సిన పొటాషియంలో ఇది 10 శాతం. అంతే కాదు రక్తపోటు పెరిగేందుకు కారణమయ్యే సోడియం కంటెంట్, అరటిపండులో చాలా తక్కువగా ఉంటుంది. ఇటీవల కాలంలో చాలా మంది రోజులో మనకు కావాల్సిన దానికంటే ఎక్కువ సోడియం కంటెంట్‌ను వివిధ రూపాల్లో తీసుకుంటున్నాం. ప్రాసెస్డ్ ఫుడ్, స్నాక్స్‌తో పలు రకాల ఆహార పదార్థలలో సోడియం కంటెంట్ ఎక్కువగా ఉంటుంది. దీని వలన రక్తపోటు పెరుగుతుంది. అరటి పండులో ఉన్నటువంటి పొటాషియం కంటెంట్ వలన మరెన్నో ఆరోగ్య ప్రయోజనాలు ఉన్నాయి. మూత్రపిండాలలో రాళ్లు ఏర్పడకుండా ఉంచడంలో అరటిపండ్లు ఎంతో దోహదం చేస్తాయి. పొటాషియం కంటెంట్ అధికంగా ఉండే ఫుడ్ తీసుకోవడం వలన శరీరంలో సోడియం కంటెంట్ తగ్గుతుంది.

**అరటి పండులోని పోషకాలు ఇవే !**

అరటి పండులో పొటాషియం కంటెంట్ మాత్రమే కాదు, ఇతర పోషకాలు సమృద్ధిగా ఉంటాయి. కరిగే ఫైబర్ అధిక రక్తపోటును నియంత్రణలో ఉంచడంలో సహాయ పడుతుంది. చెడు కొలెస్ట్రాల్ నియంత్రణలో ఉంచుతుంది. మెగ్నీషియం మరియు ఇతర ఖనిజాలు సమృద్ధిగా ఉండటం వలన రక్తపోటు తగ్గుతుంది. ఇన్‌ఫ్లేమేషన్ తగ్గి, గుండె పనితీరు మెరుగ వుతుంది. ఒత్తిడిని నియంత్రణలో ఉంచ డంలో కూడా కీలక పాత్ర పోషిస్తుంది.

## వేసవిలో బొప్పాయి ఎక్కువగా తినడం హానికరమా?

: వేసవిలో అధిక ఉష్ణోగ్రతల ప్రభావం వల్ల శరీరం త్వరగా డీహైడ్రేషన్కు గురవుతుంది. మన శరీరం అధికశాతం నీటితోనే ఉంటుంది. శరీరానికి హైడ్రేషన్ను మెరుగుపరిచే ఆహారం తీసుకోవడం అత్యవసరం. బొప్పాయి అద్భుతమైన ఎంపిక. ఇందులో సహజమైన చక్కెర, విటమిన్లు, యాంటీ ఆక్సిడెంట్లు, ముఖ్యంగా పపైన్ అనే సహజ ఎంజైమ్ సమృద్ధిగా ఉండటం వల్ల ఇది కడుపుకు హాయిగా ఉండే పండ్లలో ఒకటి. వేసవిలో వేడి, కారంగా ఉన్న ఆహారం జీర్ణక్రియను బాగా ప్రభావితం చేస్తుంది.

చర్మానికి సహజ రక్షణ..

అలాంటి సమయంలో బొప్పాయి తీసుకోవడం వల్ల కడుపులో మంట తగ్గిపోతుంది. పపైన్ జీర్ణక్రియలో ముఖ్యమైన పాత్ర పోషిస్తూ ప్రోటీన్లను సులభంగా విడదీసేందుకు సహాయపడుతుంది. ఇది



కడుపులో ముదురు పిండాలను తొలగించడంలో ఉపయోగపడుతుంది. అలాగే ఒక కప్పు బొప్పాయిలో విటమిన్ C మోతాదు రోజువారీ అవసరాన్ని మించి ఉంటుంది. ఇది శరీర రోగనిరోధక వ్యవస్థను శక్తివంతం చేయడంలో తోడ్పడుతుంది. వేసవిలో ఎక్కువసేపు బాహ్య ప్రదేశాల్లో గడిపే మనుషులకు UV కిరణాల ప్రభావం వల్ల చర్మం బాగా ప్రభావితమవుతుంది. బొప్పాయిలో ఉండే బీటా-కెరోటిన్, విటమిన్ C వంటి పోషకాలు చర్మానికి సహజ రక్షణ కలిగిస్తాయి.

బాలుడితో యజమాని హోమో సెక్స్.. ఆ భయంతో ముక్కలుగా నరికి, షాపులోనే పాతిపెట్టి!

దీన్ని ముఖానికి అప్లై చేసినా చర్మంపై తాజాగా మెరుపు కనిపిస్తుంది. ఇది సహజ తీపి ఉండే పండు అయినప్పటికీ ఇందులో కేలరీలు తక్కువగా ఉండడం వల్ల బరువు పెరగకుండా ఆరోగ్యకరంగా తినవచ్చు. బొప్పాయిని పుదీనా, పెరుగు, లేదా దోసకాయతో కలిపి తినడం మరింత శీతలతను కలిగిస్తుంది. వేసవిలో ఖాళీ కడుపుతో బొప్పాయి తింటే శరీరాన్ని చల్లబరుస్తుంది. ఇది తక్కువ ఖర్చుతో లభించే పోషకాలతో నిండి ఉండే పండు కావడం వల్ల ప్రతి ఒక్కరి ఆహారంలో భాగం కావాలి. రోజులో ఒక్కసారైనా బొప్పాయిని తీసుకుంటే వేసవిని ఆరోగ్యంగా ఎదుర్కోవచ్చు.



## ఫీచర్లు అంటే ఇలా ఉండాలి.. కొత్త మోటోరోలా ఫోన్ వచ్చేస్తోంది.. లాంచ్‌కు ముందే భారీ అంచనాలు..!









: ప్రముఖ మొబైల్ బ్రాండ్ మోటరోలా తన తదుపరి లాంచ్ ఈవెంట్‌లో కొత్త మోటరోలా ఎడ్జ్ 60 సిరీస్ స్మార్ట్‌ఫోన్‌లను ఆవిష్కరించనుంది. ఏప్రిల్ 24న జరగనున్న ఈ ఈవెంట్‌కు Motorola Razr 60 సిరీస్‌లోని అనేక స్మార్ట్‌ఫోన్‌లు రాబోతున్నాయి. అంతకుముందు, ఒక టెక్ వీరుడు Motorola Razr 60 స్మార్ట్‌ఫోన్ ముఖ్యమైన ఫీచర్లను వెల్లడించారు. ఇది మోటరోలా ఎడ్జ్ 60 స్మార్ట్‌ఫోన్ ప్రియులలో ఉత్సుకతను రేకెత్తించింది. లీకైన సమాచారం ప్రకారం, మోటరోలా ఎడ్జ్ 60 స్మార్ట్‌ఫోన్ 120Hz రిఫ్రెష్ రేట్‌తో 6.7-అంగుళాల pOLED డిస్‌ప్లేను కలిగి ఉంటుందని చెబుతున్నారు.దీనితో పాటు, ఇది ఆండ్రాయిడ్ 15 ఆపరేటింగ్ సిస్టమ్‌పై రన్ అవుతుందని, వినియోగదారులకు అత్యాధునిక సాఫ్ట్‌వేర్ అనుభవాన్ని అందిస్తుందని భావిస్తున్నారు. కెమెరా విభాగంలో, ఈ మోటరోలా ఎడ్జ్ 60 స్మార్ట్‌ఫోన్‌లో 50-మెగాపిక్సెల్ వెనుక కెమెరా, అలాగే హై క్వాలిటీ సెల్ఫీల కోసం 50-మెగాపిక్సెల్ ఫ్రంట్ కెమెరా ఉండవచ్చని అంచనా. దీర్ఘకాలిక బ్యాటరీ జీవితకాలం కోసం, ఈ స్మార్ట్‌ఫోన్ 5,200mAh సామర్థ్యం గల బ్యాటరీని ప్యాక్ చేస్తుందని భావిస్తున్నారు.లీకైన ఫోటోల ప్రకారం.. మోటరోలా ఎడ్జ్ 60 దాని ముందున్న మోటరోలా ఎడ్జ్ 50 మాదిరిగానే ఉండవచ్చని అంచనాలు చెబుతున్నాయి. వెనుక ఉన్న కెమెరా మాడ్యూల్స్ ఒకే పరిమాణంలో ఉంటాయి. డిజైన్‌లో స్థిరత్వం ఉంది. లీకైన చిత్రాల ప్రకారం, ఈ ఫోన్ 68W ఛార్జర్, USB కేబుల్, బాక్స్‌లో ఫోన్ కవర్‌తో రావచ్చు. ఈ స్మార్ట్‌ఫోన్ మే 2024లో మీడియాటెక్ ప్రవేశపెట్టిన డైమెన్సిటీ 7300 సిస్టమ్ ఆన్‌ఎచిప్‌పై రన్ అవుతుందని భావిస్తున్నారు. 12జీబీ వరకు ర్యామ్, 512జీబీ ఇంటర్నల్ స్టోరేజ్ ఉండే అవకాశం ఉంది.మోటరోలా ఎడ్జ్ 60 స్మార్ట్‌ఫోన్‌లో 6.7-అంగుళాల 1.5K pOLED స్క్రీన్ ఉంటుందని భావిస్తున్నారు. హ్యాండ్‌సెట్ కర్వ్‌డ్ డిస్‌ప్లేతో వచ్చే అవకాశం ఉంది. ఇది వీక్షణ అనుభవాన్ని మరింత మెరుగుపరుస్తుంది. సాఫ్ట్‌వేర్ విభాగంలో, ఈ హ్యాండ్‌సెట్ నేరుగా ఆండ్రాయిడ్ 15తో విడుదలవుతుందని భావిస్తున్నారు. మోటరోలా ఎడ్జ్ 60 వెనుక భాగంలో 50-మెగాపిక్సెల్ మెయిన్ కెమెరా ఉంటుంది, ఇందులో సోనీ లైటియా 700C సెన్సార్ ఉంటుందని అంచనాలు చెబుతున్నాయి. ఇతర వెనుక కెమెరాల గురించి ఇంకా ఎటువంటి సమాచారం అందుబాటులో లేదు. ముందు భాగంలో, సెల్ఫీలు, వీడియో కాల్స్ కోసం 50-మెగాపిక్సెల్ కెమెరా ఉంటుందని చెబుతున్నారు. బ్యాటరీ గురించి మాట్లాడుకుంటే, మోటరోలా తన రాబోయే ఎడ్జ్ 60 హ్యాండ్‌సెట్‌ను 5,200mAh సామర్థ్యం గల బ్యాటరీతో లాంచ్ చేయనుంది. ఈ ఫోన్‌లో 68W ఫాస్ట్ ఛార్జర్ ఉంటుంది, ఇది బ్యాటరీని త్వరగా ఛార్జ్ చేయడానికి సహాయపడుతుంది. MIL-STD 810H సర్టిఫికేషన్‌ను కూడా కలిగి ఉంటుందని సూచిస్తున్నాయి. ఈ హ్యాండ్‌సెట్‌ల గురించి మరిన్ని అధికారిక సమాచారం కోసం మనం ఏప్రిల్ 24 వరకు వేచి ఉండాలి.

## ఆల్‌టైమ్ రికార్డు... గరిష్ట స్థాయికి బంగారం ధరలు

: భారతీయులకు బంగారం అంటే కాస్తా మోజు ఎక్కువే. వారు ఎంత అందంగా ఉన్నా బంగారు నగదు ధరిస్తే తప్ప తృప్తిపడరు. అందుకే పండుగలు, శుభకార్యాలు తదితర వేడుకల్లో బంగారు నగలతో దర్శనమివ్వడానికే మొగ్గు చూపుతారు. నగలు ధరిస్తే వారి అందం మరింత రెట్టింపు అవుతుందని వారు భావిస్తుంటారు. అయితే నేడు బంగారం ధరలు ఆకాశాన్నంటుతున్నాయి, పలు కారణాలతో పాటు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ తీసుకున్న పలు నిర్ణయాల కూడా బంగారం ధరలు పెరగడానికి కారణమయ్యాయి. అంతర్జాతీయంగా తీవ్ర అనిశ్చితి నేపథ్యంలో బంగారానికి డిమాండ్ పెరిగింది. ఇన్వెస్టర్లు ఇటువైపు మొగ్గుచూపుతున్నారు. ఈ క్రమంలోనే ధరలు భారీగా పెరుగుతున్నాయి.ఈ ఎఫెక్ట్ కేవలం భారత్ మాత్రమే కాదు, ప్రపంచవ్యాప్తంగా ఉన్న పసిడి ధరలపై పడుతుంది. ఈ క్రమంలోనే తాజాగా ప్రపంచవ్యాప్తంగా ఉన్న గోల్డ్ రేట్లు ఆల్టైమ్ గరిష్ట స్థాయికి చేరుకున్నాయి. ప్రపంచ మార్కెట్ల ప్రకారం చూస్తే ప్రస్తుతం పసిడికి మంచి రోజులు వచ్చినట్టుగా అనిపిస్తుంది. ఎందుకంటే వీటి ధరలు క్రమంగా పెరుగుతున్నాయి తప్ప తగ్గడం లేదు. ఈ క్రమంలోనే నేడు (ఏప్రిల్ 21న) స్పాట్ గోల్డ్ ధర ఒక్కసారిగా 1.7% ఎగబాకి ఔన్సు %వి%3,383.87 స్థాయికి చేరుకుంది. దీనికి ముందు సెషన్లో %వి%3,384 ఆల్టైమ్ గరిష్ట స్థాయిని తాకింది. పసిడి ధరలు పెరిగిన నేపథ్యంలో దీనిపై పెట్టుబడులు చేసిన ఇన్వెస్టర్లు సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కానీ ఎ ని డి ని కొనుగోలు చేయాలని చూస్తున్న వారికి మాత్రం ఈ రేట్లు షాక్ ఇస్తున్నాయి.

మహిళా కమిషన్ లాగే.. పురుషులకు ప్రత్యేక కమిషన్ కావాలని డిమాండ్

ఈ బంగారం పెరుగుదల ప్రభావం భారతదేశం మీద కూడా పడింది. ఈ క్రమంలో ఏప్రిల్ 21న సోమవారం రోజు భారతదేశంలో బంగారం ధరలు కూడా పంజుకున్నాయి. గుడ్రిటర్న్ డేటా ప్రకారం, 24 క్యారెట్ల 10 గ్రాముల బంగారం ధర ఇప్పుడు రూ.9,83508 చేరుకుంది. ఇంకా ఇలానే వృద్ధి కొనసాగితే బంగారం కొనాలనుకున్నవాళ్లు ఇంకొంత ఆలస్యం చేసే అవకాశం ఉందని నిపుణులు చెబుతున్నారు. అంతేకాదు ఈ ధరలు ఈ వారంలో లక్ష రూపాయల స్థాయికి చేరుకునే ఛాన్స్ ఉందని







PRINTER,PUBLISHER AND OWNED BY M. A. NAVEEN KUMAR AND PRINTED AT M /S VANAMALI PUBLICATIONS , # 2-5-B , Revenue Ward No :2, Rudrampeta, Anantapur Rural & Mandal, Anantapur -515004, Ananthapuramu District, Andhra Pradesh PUBLISHED AT D. No 1-493 B, INDIRA GANDHI NAGAR , Anantapur -515001, Ananthapuramu District, Andhra Pradesh Editor : M. A .NAVEEN KUMAR Email : kumarmanaveen @gmail.com cell: 8919517176